గురువారం
01-01-2026
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 101
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

వొడాఫోన్-ఐడియాకు

రూ.87,695 కోట్ల ఊరట

- మహారాష్ట్రలో ఆరు లేన్ల కారిడార్‌కు రూ.19,142 కోట్లు
- ఒడిశాలో హైవేల విస్తరణ ప్రాజెక్టు
- కేంద్ర కేబినెట్ నిర్ణయాలు

న్యూఢిల్లీ: అప్పుల ఊబిలో కూరుకుపోయిన టెలికాం కంపెనీ వొడాఫోన్-ఐడియా(వీఐ)కు కేంద్ర కేబినెట్ భారీ ఊరట కల్పించింది. సర్దుబాటు చేసిన స్థూల ఆదాయాలకు (ఏజీఆర్) సంబంధించి రూ.87,695 కోట్ల బకాయిలు ఫ్రీజ్ చేసేందుకు ఆమోదం తెలిపింది. ఈ మొత్తాన్ని 2032-41 మధ్య చెల్లించేలా వెసులుబాటు కల్పించింది. ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ బుధవారం భేటీ అయింది. రూ.19,142 కోట్లతో మహారాష్ట్రలో ఆరులేన్ల నాసిక్-సోలాపూర్- అక్కల్కోట్ కారిడార్ నిర్మాణానికి ఆమోతం తెలిపింది. ఒడిశాలో హైవేల విస్తరణ ప్రాజెక్టుకు అంగీకరించింది. వొడాఫోన్-ఐడియా (వీఐ)కు ఊరట కల్పిస్తూ కేబినెట్ తీసుకున్న నిర్ణయం ప్రకారం ఈ మొత్తాన్ని ఆ టెలికాం సంస్థ ఇప్పటికిప్పుడు చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ మద్దతు కోసం ఎన్నో ఏళ్లుగా

- మిగతా 2 లో

పాఠకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు

నూతన సంవత్సర శుభాకాంక్షలు

8న ఏపీ కేబినెట్ భేటీ

విశాలాంధ్ర-సచివాలయం: నూతన సంవత్సరంలో ఏపీ మంత్రి మండలి తొలి సమావేశం జరగనుంది. జనవరి 8న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంత్రిమండలి సమావేశం కానుంది. కేబినెట్ సమావేశం నేపథ్యంలో 6వ తేదీలోగా ప్రతిపాదనలు పంపాలని వివిధ శాఖలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ మెమో జారీ చేశారు. సమావేశంలో మంత్రిమండలి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. భూ కేటాయింపులు, అమరావతి నిర్మాణం, పథకాల అమలుపై సమీక్ష, భవిష్యత్ పెట్టుబడుల ప్రణాళికలు, విద్య, రోడ్లు, రవాణా వంటి అంశాలపై కేబినెట్ సమావేశంలో చర్చ జరగనుంది.



భారీ ఉగ్ర కుట్ర భగ్నం

జైపూర్: భారీ ఉగ్రకుట్రను రాజస్థాన్ పోలీసులు భగ్నం చేశారు. 150 కిలోల పేలుడు పదార్థాలను పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. నూతన సంవత్సరం వేళ రాజస్థాన్‌లో పెద్దఎత్తున పేలుడు పదార్థాలు లభ్యం కావడం కలకలం రేపింది. ఓ కారులో 150 కిలోల అమ్మోనియం నైట్రేట్, ఇతర పేలుడు పదార్థాలు తరలిస్తుండగా పోలీసులు మార్గమధ్యంలో అడ్డుకున్నారు. ఓ కారులో నిందితులు పేలుడు పదార్థాలు తరలిస్తున్నట్లు టోంక్ జిల్లా పోలీసులకు నిఘావర్గాల నుంచి

- మిగతా 2 లో

పర్యాటకానికి మహర్దశ

- రూ.22,324 కోట్ల పెట్టుబడి ఒప్పందాలు
- 90 వేల ఉద్యోగాల సృష్టి
- పర్యాటకుల భద్రతకు 'టూరిస్ట్ పోలీస్'
- అమలులోకి 2025-2030 టూరిజం పాలసీ
- లక్ష్యాలు వెల్లడించిన పర్యాటక శాఖ అధికారులు

అంతర్జాతీయస్థాయిలో అద్భుత ప్రగతి

2 లో

పీఎంశ్రీ విజయవంతం కావాలి

- ప్రాథమిక విద్యలో విప్లవాత్మక మార్పులు
- సీఎస్‌ల సమావేశంలో ప్రధాని మోదీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పీఎం శ్రీ(ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా)పథకాన్ని విజయవంతంగా అమలు చేయడం ద్వారా విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు. వివిధ జాతీయ ప్రాజెక్టులు, పీఎంశ్రీ తదితర అంశాల ప్రగతికి సంబంధించి బుధవారం దిల్లీ నుంచి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో 50వ వీడియో సమావేశం

- మిగతా 2 లో

కార్మిక వ్యతిరేక విధానాలపై

సమరశీల ఐక్య పోరాటాలు

లేబర్ కోడ్‌ల రద్దు కోసం ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మె

సీఐటీయూ అఖిలభారత మహాసభ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం : పాలకుల కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు శక్తివంతమైన సమరశీల ఐక్య పోరాటాలు చేపట్టాలని సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభ పిలుపునిచ్చింది. సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) 18వ అఖిల భారత మహాసభలు బుధవారం విశాఖపట్నంలో ప్రారంభమైంది. ఏయూ కన్వెన్షన్ సెంటర్ లో డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు జరుగుతున్న మహాసభలను సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ కె. హేమలత యూనియన్ పతాకం ఎగురవేసి ప్రారంభించారు. గంజాయి మాఫియాకు వ్యతిరేకంగా పోరాడి హత్యకు గురైన పెంచలయ్య ఆశ యాలను కొనసాగిస్తామని ఆయ న కుటుంబ సభ్యులు తీసుకొచ్చి న జ్యోతి స్ఫూర్తి నింపింది. ఆహ్వాన సంఘం చైర్మన్ సీహెచ్ నరసింగరావు ప్రారంభ ఉపన్యాసం చేస్తూ బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అల్లూరి సీతారా మరాజు స్ఫూర్తితో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

- మిగతా 2 లో

ఉద్యోగుల పెండింగ్ బిల్లులు

రూ.713 కోట్లు విడుదల

విశాలాంధ్ర - హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల్లో డిసెంబరు మాసానికి సంబంధించి రూ.713 కోట్లు విడుదల చేయాలంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆర్థికశాఖ అధికారులు రూ.713 కోట్ల బిల్లులు బుధవారం విడుదల చేశారు. ఉద్యోగ సంఘాలకు ప్రతినెల రూ. 700 కోట్ల చొప్పున విడుదల చేస్తామని గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చింది. జూన్ రూ.183 కోట్లు విడుదల చేసింది.ఆగస్టు నుంచి ప్రతినెల కనీసం రూ.700 కోట్ల చొప్పున విడుదల చేస్తూ వస్తోంది. ఉద్యోగుల గ్రాట్యుటీ, జీపీఎఫ్, సరెండర్ లీవుల అడ్వాన్స్‌లకు సంబంధించిన బిల్లులు ఉన్నాయి.

'నిమెసులైడ్' అధిక డోసుపై కేంద్రం నిషేధం

న్యూఢిల్లీ: ప్రముఖ పెయిన్‌కిల్లర్ ఔషధం నిమెసులైడ్ తయారీ, విక్రయాలపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. నోటి ద్వారా తీసుకొనే ఈ ఔషధం అధిక డోసులపై నిషేధం విధించింది.
ఆరోగ్యపరమైన భద్రతా కారణాల రీత్యా నిమెసులైడ్ 100 ఎంజీకి మించి డోసు ఉండే ఔషధాల తయారీ, విక్రయాలను తక్షణమే నిలిపివేయాలని ఆదేశించింది. ఈ మేరకు డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డుతో చర్చించిన అనంతరం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. '100 ఎంజీ కంటే అధిక డోసు ఉండే నిమెసులైడ్ తీసుకోవడం వల్ల మనుషుల ఆరోగ్యానికి ప్రమాదం

- మిగతా 2 లో

ఇదీ లోకం!

జాగ్రత్త బిడ్డా.. చితకేసేస్తారు!

చంద్రబాబుపై కేసుల వివరాలు

సమర్పించండి

సీఐడీకి హైకోర్టు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై నమోదయిన కేసుల రికార్డులకు సంబంధించి కోర్టు తీర్పు ప్రతులు ఇవ్వాలంటూ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సువర్ణరాజు బుధవారం హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటీషన్‌పై ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్ నెట్ కేసులకు సంబంధించిన పూర్తి వివరాలు తమకు సమర్పించాలంటూ ఏపీ సీఐడీని హైకోర్టు ఆదేశించింది. గతంలో ఇదే అంశంపై ఆయన ఏసీబీ ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా... తీర్పు ప్రతులు ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. దీంతో ఏసీబీ ప్రత్యేక కోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ తాజాగా హైకోర్టులో ఆయన పిటిషన్ దాఖలు చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్‌నెట్‌లో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరిగాయంటూ చంద్రబాబుపై వైసీపీ ప్రభుత్వం కేసులు

- మిగతా 2 లో

ప్రళయ్ పరీక్ష విజయవంతం

భువనేశ్వర్: దేశీయంగా తయారు చేసిన ప్రళయ్ క్షిపణుల పరీక్ష విజయవంతమైంది. బుధవారం ఉదయం 10.30 గంటలకు చండీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ సమీపంలో ఈ రెండు క్షిపణులను పరీక్షించినట్లు రక్షణ శాఖ ఒక ప్రకటన చేసింది. రెండు క్షిపణులు నిర్దేశిత లక్ష్యాలను కచ్చితంగా ఛేదించాయని వెల్లడించింది. క్షిపణి వ్యవస్థ సంసిద్ధత, సామర్థ్యాన్ని ప్రదర్శించినట్లు తెలిపింది. ప్రళయ్ అనేది సాలిడ్ ప్రొపెలెంట్, క్వాసీ బాలిస్టిక్ క్షిపణి. దీనిని దేశీయ పరిజ్ఞానంతో అధునాతన నేవిగేషన్ వ్యవస్థలతో తయారు చేశారు. వివిధ రకాల వార్‌హెడ్స్‌ను మోసుకెళ్లడం, నిర్దేశిత లక్ష్యంపై కచ్చితంగా దాడి చేయగల సామర్థ్యం ప్రళయ్‌కు ఉన్నదని రక్షణ శాఖ పేర్కొంది. డీఆర్‌డీఓ లేబరలేటరీలు, భారత పారిశ్రామిక భాగస్వాములతో కలిసి హైదరాబాద్‌లోని పరిశోధన కేంద్రం 'ఇమారత్' ఈ క్షిపణిని తయారు చేసింది. పరీక్షల కోసం ఇంటిగ్రేటెడ్

- మిగతా 2 లో



కొత్త సంవత్సరానికి న్యూజిలాండ్ స్వాగతం

సిడ్నీ, హాంగ్‌కాంగ్, బాలీలో వేడుకల రద్దు

ఆక్లాండ్: నూతన సంవత్సరానికి న్యూజిలాండ్ ఘన స్వాగతం పలికింది. ప్రపంచ దేశాల్లో అన్నింటి కంటే ముందుగా ఆక్లాండ్‌లో న్యూ ఇయర్ వేడుకలు జరుపుతారు. అత్యంత ఎత్తైన భవనం స్కై టైవర్ నుంచి అందమైన బాణాసంచా పేలుళ్ల ప్రదర్శనతో 2026కి ఆక్లాండ్ స్వాగతం పలికింది. 787 అడుగుల ఎత్తైన స్కైటవర్ నుంచి 3,500 బాణాసంచా పేలుళ్లతో ఐదు నిమిషాల రంగురంగుల బాణాసంచా పేలుళ్ల ప్రదర్శన ఆకట్టుకున్నది. ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన దృష్ట్యా న్యూజిలాండ్‌వ్యాప్తంగా చిన్న స్థాయి వేడుకలన్నీ రద్దు అయ్యాయి. న్యూజిలాండ్‌కు వేడుకలు జరిగిన రెండు గంటలకు ఆస్ట్రేలియా కొత్త సంవత్సరాన్ని స్వాగతించింది. గత 30 ఏళ్లలో జరగని విధంగా బోండీ బీచ్‌లో కాల్పుల ఘటన దృష్ట్యా రాజధాని సిడ్నీ హార్బర్ బ్రిడ్జి వద్దకు బాణాసంచా ప్రదర్శనను వీక్షించేందుకు వచ్చే వారి దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు. వేలాది మంది పోలీసులతో బందోబస్తు చేశారు. భద్రతాధికారులు రాపిడ్-ఫైర్ రైఫిళ్లతో మోహరించారు. కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ఒక గంట ముందు బోండీ బీచ్ మృతులకు ఒక నిమిషం మౌనం పాటించి నివాళులర్పించారు. అదే విధంగా హాంగ్‌కాంగ్ కూడా వేడుకలను రద్దు చేసుకుంది. కనివినీ ఎరుగని రీతిలో బహుళ అంతస్తుల భవనం మంటల్లో చిక్కుకొని అనేక మంది ప్రాణాలు కోల్పోయిన దృష్ట్యా ఈ సంవత్సరం సంబరాలకు హాంగ్ కాంగ్ దూరంగా ఉంది. కాగా, భారీ నష్టాన్ని మిగిల్చిన సమత్రా వరదల కారణంగా ఇండోనేసియాలోనూ వేడుకలు రద్దు చేశారు.

మృతులకు సతాపసూచికంగా రాజధాని జకార్త, పర్యాటక క్షేత్రం బాలీ సహా ఎక్కడ కూడా బాణాసంచా ప్రదర్శనను అనుమతించలేదు. సుమత్రా వరదల్లో 1,100 మంది ప్రాణాలు కోల్పోగా, నాలుగు లక్షల మంది నిర్వాసితులయ్యారు. అదే విధంగా జపాన్ రాజధాని టోక్యో, సెర్బియా రాజధాని బెల్‌గ్రాడ్, ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లోనూ వివిధ భద్రతాపరమైన కారణాలతో కొత్త సంవత్సరం వేడుకలు చాలా వరకు రద్దు చేశారు. మిగతా ప్రపంచంలో పోల్చుకుంటే దక్షిణ పసిఫిక్ దేశాలు కొత్త సంవత్సరానికి మొదటగా స్వాగతం పలికాయి. సిడ్నీకి రెండు గంటలు, న్యూయార్క్‌కు దాదాపు 18 గంటల ముందుగానే న్యూజిలాండ్ నూతన సంవత్సరాన్ని స్వాగతించింది.

మరింత క్రియాశీల విధానాలు తెస్తాం

కొత్త సంవత్సరం తేనీటి విందులో జిన్‌పింగ్

బీజింగ్: నూతన సంవత్సరంలో మరింత క్రియాశీలమైన, సమర్థ విధానాలు అమలు చేస్తామని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వెల్లడించారు. దీర్ఘకాలిక వృద్ధి లక్ష్యంతో ఆర్థిక పురోగతి దృష్ట్యా పటిష్ట కార్యాచరణలతో ముందుకు వెళతామని చెప్పారు. 2025కి నిర్దేశించిన ఐదు శాతం ఆర్థిక వృద్ధి లక్ష్యాన్ని దాదాపుగా చేరుకున్నట్లు తెలిపారు. చైనా ఆర్థిక వ్యవస్థ 140 ట్రిలియన్ యువాన్‌కు చేరుకున్నదన్నారు. 2026లోకి అడుగు పెట్టే క్రమంలో చైనా కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకత్వానికి జిన్‌పింగ్ తేనీటి విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిళ్ల నడుమ చైనా ఆర్థిక వ్యవస్థ తన స్థితిస్థాపకతను, సామర్థ్యాన్ని రుజువు చేసుకుంటూ ముందుకు వెళుతోందని అన్నారు. ఆర్థిక వ్యవస్థలో పరిమాణాత్మక వృద్ధి సాధిస్తూనే సామాజిక సామరస్యం, సుస్థిరతకు విఘాతం కలిగకుండా ఓ పద్ధతి ప్రకారం నడుచుకుంటున్నట్లు తెలిపారు.

భారత్-పాక్ శాంతికి చైనా దౌత్యం: వాంగ్ యీ

ఈ ఏడాది చైనా మధ్యవర్తిత్వం వహించిన 'హాట్‌స్పాట్' అంశాల్లో భారత్-పాకిస్థాన్ ఘర్షణలు ఉన్నట్లు ఆ దేశ విదేశాంగ మంత్రి వాంగ్ యీ వెల్లడించారు. 'రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం స్థానిక యుద్ధాలు, సరిహద్దు ఘర్షణలు చోటుచేసుకున్నాయి. భౌగోళిక-రాజకీయ ప్రకంపనలు వ్యాప్తి చెందాయి. సుస్థిర శాంతి కోసం లక్షణాలు, మూల కారణాలపై దృష్టిని కేంద్రీకరించాం. 'హాట్‌స్పాట్' అంశాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం వహించాం. ఉత్తర మైన్మార్, ఇరాన్ అణు సమస్య, పాకిస్థాన్- భారత్ ఘర్షణలు, పలస్తీనా-ఇజ్రాయిల్ సమస్యలతో పాటు ఇటీవల కంబోడియా, థాయిలాండ్ మధ్య ఘర్షణలను పరిష్కరించేందుకు మా పద్ధతిలో ప్రయత్నించాం' అని బీజింగ్‌లోని చైనా విదేశాంగ సంబంధాలు, అంతర్జాతీయ పరిస్థితులపై సమావేశంలో వాంగ్ యీ వెల్లడించారు.

ఖలీదా జియాకు అంతిమ వీడ్కోలు

ఢాకా: బంగ్లాదేశ్ తొలి మహిళా ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) అధినేత్రి ఖలీదా జియా అంత్యక్రియలు ముగిశాయి. కొద్ది కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మంగళవారం తుదిశ్వాస విడిచారు. బుధవారం మధ్యాహ్నం రాజధాని ఢాకాలోని మానిక్ మియా అవెన్యూలో నమాజే జనాజా (ప్రత్యేక ప్రార్థన) అనంతరం ఆమె అంతిమసంస్కారలు నిర్వహించారు. ఖలీదా జియా భౌతికకాయాన్ని చంద్రిమా ఉద్యాన్ (శ్మశానం)కు తరలించారు. ఆమె భర్త, మాజీ అధ్యక్షుడు జియార్ రెహమాన్ సమాధి పక్కనే ఖలీదా జియాను ఖననం చేశారు. అంతిమ యాత్రలో బీఎన్‌పీ నాయకులు, కార్యకర్తలు, అభిమానాలు తదితరులు వేలాది మంది పాల్గొన్నారు. అభిమాన నాయకురాలికి కన్నీటి వీడ్కోలు పలికారు. ఖలీదా జియా మరణంతో ఓ రాజకీయ శకం ముగిసిందని పార్టీలకు అతీతంగా నాయకులు, విదేశీ ప్రతినిధులు సంతాపం ప్రకటించారు. ఆమె కుమారుడిని పరామర్శించారు. అంత్యక్రియల్లో దేశ తాత్కాలిక అధినేత మహమ్మద్ యూనస్, త్రివిధ దళాధిపతులు, పాలక పక్ష నాయకులు తదితరులు హాజరయ్యారు. భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌తో పాటు అనేక మంది ప్రతినిధులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించింది నివాళులర్పించారు. జియా కుమారుడు తారిక్ రెహమాన్‌ను కలిసి, పరామర్శించారు.

52 లక్షల ఎప్‌స్టీన్ ఫైళ్ల సమీక్ష

వాషింగ్టన్: అమెరికాలో సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ ఫైళ్లను సమీక్షించడం కోసం అక్కడి న్యాయ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. సుమారు 5.2 మిలియన్ (52 లక్షల) పేజీలను సమీక్షించే బాధ్యతను 400 మంది న్యాయవాదులకు అప్పగించబోతోంది. జాతీయ భద్రత, క్రిమినల్ కేసుల ప్రాసిక్యూటర్లతో పాటు న్యూయార్క్, ఫ్లోరిడాలోని అటార్నీల కార్యాలయాల్లో పనిచేసే న్యాయవాదులకు ఈ పని అప్పజెప్పనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

నవంబరు నెలాఖరు నుంచి 200 మంది న్యాయవాదులకు ఈ పత్రాల సమీక్ష బాధ్యతలను న్యాయ శాఖ అప్పగించింది. ఇప్పుడు ఈ పని కోసం మరింత మంది అవసమని తమ ఉద్యోగులతో న్యాయ శాఖాధికారులు వెల్లడించారు. సమీక్ష ప్రక్రియ జనవరి 20వ తేదీ లోపు పూర్తి అయ్యే అంచనా ఉంది.

హాదీని చంపలేదు

హత్య కేసులో ప్రధాన నిందితుడి వీడియో వైరల్

దుబాయ్: బంగ్లాదేశ్ యువ నేత షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్యలో తన పాత్ర లేదని ఆ కేసులో ప్రధాన నిందితుడు ఫైజల్ కరీం మసూద్ వెల్లడించారు. తాను దుబాయ్‌లో ఉన్నట్లు ఓ వీడియో సందేశం ద్వారా తెలిపారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. హాదీ హత్యకు బాధ్యత బంగ్లాదేశ్ జమాతే ఇస్లామీదేనని యూఏఈ వాదిస్తోంది. మసూద్ తన వీడియోలో 'నేను హాదీని హత్య చేయలేదు. నాకు, నా కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదు. చేయని నేరానికి మమల్ని బలిపశువులు చేయొద్దు. ప్రాణాలు కాపాడుకోవడం కోసం దుబాయ్ వచ్చాను. హాదీ జమాత్‌కు చెందిన వారు. ఆయన హత్య వెనుక జమాతీలు ఉండొచ్చు. హాదీతో నాది కేవలం వ్యాపార బంధం' అని మసూద్ వెల్లడించారు. ప్రభుత్వ కాంట్రాక్టులకు బదులుగా హాదీకి రాజకీయపరంగా విరాళాలిచ్చాను తప్ప మరెలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాల కోసం కాదని ఆయన వివరణ ఇచ్చారు. కాగా, డిసెంబరు 12న బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో గుర్తుతెలియని వ్యక్తులు హాదీపై కాల్పులు జరపగా, ఆయన సింగపూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశాస విడిచారు. హాదీ హత్య కేసులో నిందితులు భారత్‌లో ఆశ్రయం పొందినట్లు ఢాకా పోలీసుల వాదనను భారత సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) తోసిపుచ్చింది. నిరాధార ఆరోపణలు చేయొద్దని సూచించింది.

భారీ ఉగ్రకుట్ర భగ్నం

(మొదటిపేజీ తరువాయి)

సమాచారం అందినట్లు పోలీసులు తెలిపారు. దీంతో బరోని పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ అనుమానాస్పద కారులో తనిఖీలు నిర్వహించామని, వాహనంలో యూరియా సంచుల్లో 150 కిలోల అమ్మోనియం నైట్రేట్ నింపి ఉంచినట్లు గుర్తించామన్నారు. అదేవిధంగా 200 కాట్రిడ్జ్‌లు, ఆరు కట్టల (1,100 మీటర్లు) సేఫ్టీ ఫ్యూజ్ వైర్ స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారిని బూందీ జిల్లాకు చెందిన సురేంద్ర పట్వా, సురేంద్ర మోచీగా గుర్తించారు. ఈ పేలుడు పదార్థాలను బూందీ నుంచి టోంక్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పేలుడు పదార్థాలను ఎక్కడినుంచి సేకరించారు? చట్టవిరుద్ధ కార్యకలాపాలకు వినియోగించాలనుకున్నారా? తదితర వివరాలు రాబట్టే దిశగా దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

'నిమెసులైడ్' అధిక డోసుపై కేంద్రం నిషేధం

(మొదటిపేజీ తరువాయి)

కలిగే అవకాశం ఉంది. దీనికి ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయ ఔషధాలు కూడా అందుబాటులో ఉన్నాయి. అందుకే దీన్ని తక్షణమే నిషేధిస్తున్నాం' అని ఆరోగ్యశాఖ వెల్లడించింది. నిమెసులైడ్ అధిక డోసు ఉండే ఔషధం తయారీ, విక్రయాలు, పంపిణీపై ఈ నిషేధం వర్తించనుంది. తక్కువ డోసు ఫార్ములా ఉన్న నిమెసులైడ్ ఎప్పటిలాగే మార్కెట్‌లో అందుబాటులో ఉంటుంది. నిమెసులైడ్ అనేది నాన్ స్టెరాయిడ్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డ్రగ్. దీనివల్ల దుష్ప్రభావాలు ఉన్నట్లు కొంతకాలంగా చర్చ జరుగుతోంది. కాలేయంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని గతంలో నిపుణులు హెచ్చరించారు. దీంతో కేంద్రం దీని వినియోగంపై ఆంక్షలు విధించింది. కేంద్రం నిర్ణయంతో నిమెసులైడ్ ఆధారిత పెయిన్ కిల్లర్ బ్రాండ్లను తయారుచేసే ఫార్మా కంపెనీలు వెంటనే తమ ఉత్పత్తిని నిలిపివేయాల్సి ఉంటుంది. మార్కెట్లోకి ఇప్పటికే పంపిన ఈ ఔషధాలను రీకాల్ చేయనున్నారు. గతంలోనూ కేంద్ర ప్రభుత్వం ఇలా ఆరోగ్యపరమైన భద్రతా కారణాలతో కొన్ని అధిక డోసు ఔషధాలు నిషేధించింది.

'ప్రళయ్' పరీక్ష విజయవంతం

(మొదటిపేజీ తరువాయి)

వ్యవస్థలుగా, తయారీ-ఉత్పత్తి భాగస్వాములుగా భారత్ డైనమిక్స్ లిమిటెడ్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ వ్యవహరించాయి. ఈ పరీక్ష విజయంతో డీఆర్‌డీఓ, సాయుధ దళాలు, రక్షణ పరిశ్రమలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. డీఆర్‌డీఓ చైర్మన్, ఆర్ అండ్ డీ శాఖ కార్యదర్శి సమీర్ వి కామత్ కూడా హర్షం వ్యక్తంచేశారు. క్షిపణి వ్యవస్థ త్వరలోనే సాయుధ దళాల్లో చేరబోతోందన్నారు. పరీక్షలకు డీఆర్‌డీఓ సీనియర్ శాస్త్రవేత్తలు, వైమానిక దళం, సైన్యం ప్రతినిధులు, పరిశ్రమల అధికారులు హాజరయ్యారు. ఈ పరీక్షతో భారత క్షిపణి సామర్థ్యం మరింత పెరిగిందని అభినందించారు.

ఇస్రో మరో ముందడుగు

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో ముందడుగేసింది. స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ) మూడో దశను విజయవంతంగా పరీక్షించింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని సాలిడ్ మోటార్ స్టాటిక్ టెస్ట్ కేంద్రంలో ఈ ప్రయోగం నిర్వహించింది. మూడు దశల ఆల్-సాలిడ్ లాంచ్ వెహికల్ ఎస్ఎస్ఎల్‌వీ పనితీరును విశ్లేషించడంతోపాటు డేటాను సేకరించినట్లు ఇస్రో వెల్లడించింది. అంతరిక్షంలోకి చిన్న ఉపగ్రహాలను వేగంగా ప్రయోగించడం కోసం దీనిని రూపొందించారు. అధిక స్థాయిలో ఉత్పత్తికి ఇది అనుకూలంగా ఉంటుంది. పేలోడ్‌కు సెకనుకు 4 కిలోమీటర్ల వేగాన్ని అందించడంలో ఎస్ఎస్-3 కీలకపాత్ర పోషిస్తుందని అధికారులు వెల్లడించారు. పేలోడ్ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుందన్నారు. ప్రస్తుతం చేసిన అప్‌గ్రేడ్‌లు ఈ దశలో మెరుగైన ఇగ్నైటర్, నాజిల్ డిజైన్ ఉపగ్రహాల సామర్థ్యం, నిర్మాణాత్మక దృఢత్వాన్ని పెంచినట్లు తెలిపారు. ఈ పరీక్షలో ఒత్తిడి, థ్రస్ట్, ఉష్ణోగ్రత, వైబ్రేషన్, యాక్యుయేటర్ పనితీరు వంటి విషయాలను పరిశీలించినట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు.

పర్యాటకానికి మహర్దశ

విశాలాంధ్ర - హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దిశానిర్దేశంలో తెలంగాణ పర్యాటక రంగం అంతర్జాతీయ స్థాయిలో అద్భుతమైన ప్రగతిని సాధించిందని ఆ శాఖ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2025లో పర్యాటక శాఖ సాధించిన ప్రగతిని... 2026 లో సాధించబోయే లక్ష్యాలు, భవిష్యత్ ప్రణాళికలను వెల్లడించారు. పర్యావరణ, వైద్యం, వారసత్వ, ఆధ్యాత్మిక, గ్రామీణ మరియు గిరిజన, సినిమా, వెడ్డింగ్ డెస్టినేషన్, స్పోర్ట్స్ టూరిజంపై దృష్టి సారించి "తెలంగాణ టూరిజం పాలసీ 2025-2030" ని అమలులోకి తెచ్చామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాల అభివృద్ధిని వివరించారు. టూరిజం కాంక్లేవ్ 2025 ద్వారా 30 ప్రాజెక్టులకు రూ.15,279 కోట్ల పెట్టుబడి ఒప్పందాలు జరిగాయని, తద్వారా సుమారు 50 వేల ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని చెప్పారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ద్వారా మరో రూ.7,045 కోట్ల పెట్టుబడులు, 40 వేల ఉద్యోగాలు సృష్టించబడుతున్నాయని, ముఖ్యంగా రూ.మూడు వేల కోట్ల పెట్టుబడితో ఫుడ్‌లింక్ గ్లోబల్ సెంటర్ , రూ.వెయ్యి కోట్లతో సారస్ ఇన్‌ఫ్రా, రూ.వెయ్యి కోట్లతో స్మార్ట్ మొబిలిటీ వంటి సంస్థలు పెట్టుబడులతో ముందుకు వచ్చాయని పేర్కొన్నారు. పర్యాటక రంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 123 ప్రాజెక్టులలో ఇప్పటికే 78 ప్రాజెక్టులు విజయవంతంగా పూర్తయ్యాయన్నారు. దీనికి అదనంగా కేంద్ర పథకాలైన స్వదేశ్ దర్శన్ 2.0 ... ప్రసాద్ కింద రూ. 275 కోట్ల విలువైన పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా అనంతగిరి కొండల్లో 'ఎకో-టూరిజం జోన్', భువనగిరి కోట వద్ద 'ఎక్స్‌పీరియెన్షియల్ జోన్'ను తీర్చిదిద్దుతున్నట్టు వెల్లడించారు. జల పర్యాటకాన్ని ప్రోత్సహిస్తూ హుస్సేన్ సాగర్‌లో 120 మంది ప్రయాణించగల "ముచుకుంద" అనే డబుల్ డెక్కర్ బోటును పర్యాటక శాఖ అందుబాటులోకి తెచ్చిందన్నారు. ప్రపంచ సుందరీ వేడుకలకు 110 దేశాల నుంచి వచ్చిన సుందరీమణులు "పర్యాటక రాయబారులుగా" మారి మన పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేసినట్టు చెప్పారు. ఇది హైదరాబాద్‌ను కేవలం పెట్టుబడులకే కాకుండా, వ్యాపారానికి "సురక్షితమైన, అనుకూలమైన రాష్ట్రంగా" నిరూపించిందని ఉద్ఘాటించారు. బతుకమ్మ పండుగను ప్రపంచ వేదికపై నిలబెడుతూ... అతిపెద్ద బతుకమ్మ (19.44 మీటర్లు) 1,354 మంది మహిళలతో అతిపెద్ద జానపద నృత్యం ప్రదర్శించి సెప్టెంబరు 29, 2025న రెండు గిన్నిస్ రికార్డులు సాధించామని సగర్వంగా ప్రకటించారు. పర్యాటకుల భద్రత కోసం 80 మంది ప్రత్యేక శిక్షణ పొందిన అధికారులతో అక్టోబరు 13, 2025న ప్రారంభించిన "టూరిస్ట్ పోలీస్" వ్యవస్థ అద్భుతమైన ఫలితాలను ఇస్తోందన్నారు. పర్యాటకుల సౌకర్యార్థం యూనిఫైడ్ ఆన్‌లైన్ పోర్టల్, డిజిటల్ ట్రావెల్ కార్డులు వంటి వినూత్న సేవలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రాబోయే 2026 సంవత్సరానికి పర్యాటక శాఖ స్పష్టమైన ప్రణాళిక వివరాలను ప్రకటించిందన్నారు. హైదరాబాద్ - సోమశిల - శ్రీశైలం సర్క్యూట్‌లో హెలీ టూరిజం సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవడం, నాగార్జున సాగర్, సోమశిల, బస్వాపూర్ వంటి ప్రాంతాలను అత్యుత్తమ వెడ్డింగ్ డెస్టినేషన్లుగా అభివృద్ధి చేయడం, నాగార్జున సాగర్, బస్వాపూర్, సోమశిలలో కొత్త వెడ్డింగ్ డెస్టినేషన్ల అభివృద్ధి, మెడికల్ టూరిజం సొసైటీని స్థాపించి హైదరాబాద్‌ను గ్లోబల్ మెడికల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడం, జనవరి 13, 14, 15 తేదీల్లో ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ షోలను నిర్వహించడం, 19 దేశాల నుంచి 40 మంది అంతర్జాతీయ, 55 మంది జాతీయ కైట్ ఫ్లయర్స్ భాగస్వాములు కావడం, హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ ... జనవరి 16 నుంచి 18 వరకు ఐరోపా దేశాల నుంచి వచ్చే ప్రతినిధులతో అంతర్జాతీయ స్థాయి 15 బెలూన్లతో ప్రదర్శన, డ్రోన్ షో గచ్చిబౌలి స్టేడియంలో జనవరి 13, 14న హైటెక్ డ్రోన్లతో వినూత్న ప్రదర్శన, జాతీయ... అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్ పై ప్రత్యేక దృష్టి, తెలంగాణ పర్యాటక రంగం కేవలం వినోదానికే పరిమితం కాకుండా, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా, ప్రజలకు ఉపాధి కల్పించే వనరుగా మారుతోందని ఆ శాఖ అధికారులు స్పష్టం చేశారు.

వొడాఫోన్-ఐడియాకు రూ.87,695 కోట్ల ఊరట

(మొదటిపేజీ తరువాయి)

ఎదురుచూస్తున్న వొడాఫోన్ ఐడియాకు ఇది భారీ ఊరట. మారటోరియం పీరియడ్‌కుగాను బకాయిలపైనా వొడాఫోన్ ఐడియా వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదు. అంతేకాకుండా నిలుపుదల చేసిన బకాయిలను టెలికాం విభాగం పునః మదింపు చేస్తుంది. దీనిపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తుది నిర్ణయం తీసుకోనుంది. 2017-18, 2018-19 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన ఏజీఆర్ బకాయిలు మాత్రం 2025-26 నుంచి 2030-31 మధ్య యథాతథంగా చెల్లించాల్సి ఉంటుంది. వొడాఫోన్ ఐడియాలో ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉంది. దీంతో పాటు 20 కోట్ల మంది చందాదారులు ఈ నెట్‌వర్క్‌ను వినియోగిస్తున్నారు. వారి ప్రయోజనాలు, టెలికాం రంగంలో పోటీ ఉండాలన్న ఉద్దేశంతో కేబినెట్ ఈ నిర్ణయం తీసుకున్నది. ఈ శుభవార్త ఉంటుందని మదుపర్లు ముందుగానే ఊహించారు. దీంతో బుధవారం వొడాఫోన్ ఐడియా షేర్లు 4 శాతం మేర పెరిగి రూ.12.50 వద్ద 52 వారాల గరిష్ఠాన్ని తాకాయి. మార్కెట్ అంచనాలకు అనుగుణంగా నిర్ణయం వెలువడకపోవడంతో ఒక్కసారిగా పతనమయ్యాయి. మొత్తం బకాయిల్లో కనీసం సగమైనా ప్రభుత్వం రద్దు చేస్తుందని మార్కెట్ వర్గాలు అంచనా వేశాయి. అంచనాలకు అనుగుణంగా నిర్ణయాలు లేకపోవడంతో కేబినెట్ నిర్ణయం వెలువడిన వెంటనే వీఐ షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. కేబినెట్ నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. రూ.19,142 కోట్లతో మహారాష్ట్రలో నాసిక్-సోలాపూర్- అక్కల్కోట్‌ను కలుపుతూ ఆరు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ నిర్మాణానికి కేబినెట్ అంగీకరించిందన్నారు. బీఓటీ (టోల్) మోడ్‌తో 374 కిమీల ఈ ప్రాజెక్టు నాసిక్, అహిల్యానగర్, సోలాపూర్‌ను కర్నూల్ (ఏపీ)తో అనుసంధానం చేస్తుందని తెలిపారు. నాసిక్ నుంచి అక్కల్కోట్ వరకు గ్రీన్‌ఫీల్డ్ కారిడార్‌ను వధావన్ పోర్టు ఇంటర్‌చేంజ్ వద్ద ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌ను కలిపే విధంగా ప్రతిపాదన చేశారు. నాసిక్ వద్ద ఆగ్రా-ముంబై కారిడార్‌ను ఎన్‌హెచ్ 60 (అడెగావ్) వద్ద జంక్షన్‌తో... నాసిక్ సమీపంలో పంగ్రీ వద్ద సమృద్ధి మహామార్గ్‌ను అనుసంధానం చేసేదిగా ఈ ప్రాజెక్టు ఉంటుంది. వెస్ట్‌కోస్ట్ నుంచి ఈస్ట్ కోస్ట్ వరకు అనుసంధానికి ఈ ప్రతిపాదన చేసినట్లు అధికారిక ప్రకటన వెల్లడించింది. చెన్నై నుంచి హోసూర్ (ఎంహెచ్ బార్డర్) వరకు తిరువల్లూర్, రేణిగుంటా, కడప, కర్నూలు (700 కిమీల పొడవైన) మీదుగా నాలుగు లేన్ల కారిడార్ల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నట్లు తెలిపింది. మహారాష్ట్రలో ఆరులేన్ల కారిడార్ పూర్తైతే ప్రయాణ సమయం 31 గంటల నుంచి 17 గంటలకు తగ్గుతుందని ప్రకటన పేర్కొంది. 251.06 లక్షల మందికి ప్రత్యక్ష ఉపాధి... 313.83 లక్షల మందికి పరోక్ష ఉపాధి లభిస్తుందని వెల్లడించింది. ప్రతిపాదిత కారిడార్ పరిధిలో ఆర్థిక కార్యకలాపాలు పుంజుకునే క్రమంలో నూతన ఉపాధి అవకాశాలకు అవకాశం ఉంటుందని ప్రకటన తెలిపింది. ఇదిలావుంటే, ఒడిశాలో ఎన్‌హెచ్-326 బలోపేతానికి, విస్తరణకు కేంద్ర కేబినెట్ అంగీకారం తెలిపింది. రెండు లేన్ల రోడ్డు నుంచి రెండు లేన్ల రాజధానిగా అప్‌గ్రేడ్ చేసేందుకు ఆమోదించింది. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.1,526.21 కోట్లు కాగా ఇందులో నిర్మాణ ఖర్చు రూ.966.79 కోట్లుగా ఉన్నట్లు ప్రకటన తెలిపింది. గజపతి, రాయగడ, కోరాపుట్ జిల్లాలకు ఈ ప్రాజెక్టు ప్రయోజకరమని వెల్లడించింది.

సమరశీల ఐక్య పోరాటాలు

(మొదటిపేజీ తరువాయి)

కార్మికవర్గం పెద్ద ఎత్తున పోరాడుతోందని తెలి పారు. ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి పంబిస్ కీట్సీస్ మాట్లాడుతూ భారతదేశ కార్మిక వర్గం కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరే కంగా తీవ్రంగా పోరాడుతోందని ప్రశంసించారు. కార్మికులు, కర్షకులు కలిసి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న జరపతలపెట్టిన సార్వత్రిక సమ్మెకు మద్దతు ప్రకటించారు. కార్మిక హక్కుల రక్షణ కోసం చేస్తున్న పోరాటంలో సీఐటీయూ ఒంటరి కాదని, ప్రపంచ కార్మిక సంఘాల మద్దతు ఉంటుందని ప్రతినిధుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు హేమలత మాట్లాడుతూ కార్మికులను కట్టు బానిసలుగా మార్చేందుకు మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అని నినదించి 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న ఉక్కు ఫ్యాక్టరీని అమ్మాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా నిరసించారు. స్టీల్ ప్లాంట్ రక్షణకు పోరాడుతున్న కార్మికులను అభినందించారు. ఈ మహాసభలో ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్, ఐఎన్‌టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి మంత్రి రాజశేఖర్, హెచ్ఎంఎస్ నేత సుదర్శన్ రావు, ఏఐసీటీయూ వైస్ ప్రెసిడెంట్ క్లిఫ్టన్ డి రోజారియో, ఏఐయూటీసీ సెక్రటేరియట్ సభ్యుడు జయసేన్ మెహర్, యూటీయూసీ నేత షేకిజార్ అపాస్వామి, ఎస్ఈడబ్ల్యూఏ వైస్ ప్రెసిడెంట్ సోనియా జార్జ్ తదితరులు ప్రసంగించారు.

పీఎంశ్రీ విజయవంతం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. ప్రధాని మాట్లాడుతూ కేంద్ర ప్రాయోజిత పథకం పీఎంశ్రీని విజయవంతంగా అమలు చేయడం ద్వారా పాఠశాలలను ఆధునికీకరించి, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020కి అనుగుణంగా నమూనా పాఠశాలలుగా తీర్చిదిద్ది, ప్రాథమిక విద్యలో విప్లవాత్మక మార్పులు తేవడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని దిశానిర్దేశం చేశారు. దీని కింద పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, నాణ్యమైన విద్య అందించడంపై దృష్టి సారించడం జరుగుతుందన్నారు. ప్రాథమిక విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం,ఆధునిక వసతులు కల్పించడం ముఖ్య లక్ష్యంగా చెప్పారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూర్చడం జరుగుతోందన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధి చేయడంతో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, డిజిటల్ విద్య, మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. అదే విధంగా ఎన్ఈపీ-2020 (జాతీయ విద్యా విధానం) అమలులో భాగంగా విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలు పెంపొందించడం జరుగుతుందని ప్రధాని స్పష్టం చేశారు. డిజిటల్, గ్రీన్ స్కూళ్ల అభివృద్ధి స్మార్ట్ క్లాసులు, డిజిటల్ ల్యాబ్‌లు, ఆధునిక సైన్స్ ల్యాబ్స్, లైబ్రరీలు,క్రీడలు,ఆర్ట్స్, వొకేషనల్ ఎడ్యుకేషన్ ను మెరుగు పర్చడం జరుగుతుందన్నారు. ఈ వీడియో సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ... రాష్ట్రంలో పీఎంశ్రీ పథకం కింద 935 పాఠశాలలు ఎంపిక కాగా వాటిని అన్ని విధాలా మెరుగైన రీతిలో అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన, డిజిటల్ సాంకేతికతతో కూడిన విద్యను అందిస్తున్నామని వివరించారు. ఈ పథకం కింద ఎంపిక చేసిన పాఠశాలలన్నిటికి పక్కా భవనం, విద్యుత్ సరఫరా ఉండేలా చూడడంతో పాటు బాలికలు, బాలురకు వేరువేరు మరుగుదొడ్లు, సురక్షిత మంచినీటి సౌకర్యం, ప్రత్యేక హ్యాండ్ వాషింగ్ సౌకర్యం, గ్రంథాలయం, క్రీడా పరికరాలు వంటివి ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇంటర్నెట్, కంప్యూటర్ ల్యాబ్, ప్లే గ్రౌండ్, ఉపాధ్యాయులు, విద్యార్థులకు గుర్తింపు కార్డులు జారీ చేసి వారి హాజరును చైల్డ్ ట్రాకింగ్ సాఫ్ట్‌వేర్ ట్రాకింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలో పీఎంశ్రీ పథకాన్ని విజయవతంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని ప్రధానికి సీఎస్ విజయానంద్ వివరించారు. ఈవీడియో సమావేశంలో ఎస్పీడీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చంద్రబాబుపై కేసుల వివరాలు సమర్పించండి

(మొదటిపేజీ తరువాయి)

నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటీవల ఫైబర్ నెట్ కేసును విజయవాడ ఏసీబీ కోర్టు కొట్టివేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసును సైతం సీఐడీ మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్ అంటూ నోటీసు జారీ చేసింది. దీంతో ఆయా కేసుల మూసివేతకు సంబంధించిన రికార్డులు, కోర్టు తీర్పు ప్రతులు పూర్తి వివరాలతో తనకు అందించాలంటూ సువర్ణరాజు ఏసీబీ కోర్టులో పిటిషన్ వేశారు. దానిని ఏసీబీ కోర్టు తిరస్కరించగా... హైకోర్టును ఆశ్రయించారు. అనంతరం ఈ కేసు విచారణను వారం రోజులకు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది.

మున్సిపల్ కమీషనర్ పై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: అక్రమ కూల్చివేతలపై రామగుండం మున్సిపల్ కమీషనర్ పై చర్యలు తీసుకోవాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు.ఈ విషయమై ఆయన బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కు విజ్ఞాపనపత్రం ఇస్తూ పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో అక్రమ కూల్చివేతలు చేపడుతున్నారని కూల్చివేతలు ఎందుకు చేస్తున్నారో చెప్పకుండా మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు.ఈ ప్రాంతంలో 43 మైసమ్మ గుళ్లను కూల్చివేసారని,ఇప్పటివరకు బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.చిరు వ్యాపారుల దుకాణాలకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా కూల్చివేసి వారి జీవితాలను రోడ్డుపై పడవేసారని అన్నారు. ఈ కార్యక్రమం లో బీ.ఆర్.ఎస్ పార్టీ నాయకులు పర్లపల్లి రవి, నారాయణదాసు మారుతి నీరటీ శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికలో బీఆర్ఎస్ జెండా ఎగరాలి

విశాలాంధ్ర తొర్రూర్ : తొర్రూరు మున్సిపల్ ఎన్నికలలో బి.ఆర్.ఎస్ పార్టీ జెండా ఎగర వెయ్యాలని పెద్ద వంగర మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తొర్రూరు ఆరవ వార్డు ఇంచార్జ్ ఈదురు ఐలయ్య అన్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకుబుధవారం తొర్రూరు మున్సిపల్ 6 వార్డు అధ్యక్షుడు రాయిశెట్టి వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశములో ఆయన పాల్గొని మాట్లాడుతూ మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నాయకత్వంలో తొర్రూరు ఎస్సీ కాలనీలో అనేకమైన అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించారని,200 డబుల్ బెడ్ రూమ్స్ ఇండ్లు మంజూరు చేశారని, అలాగే స్మశాన వాటిక ,సీసీ రోడ్స్ ,సైడ్ డ్రైనేజ్, విద్యుత్ కలెక్షన్స్, ముత్యాలమ్మ గుడికి సీసీ రోడ్స్ పనులు చేయించాడని ఆయన అన్నారు.ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ ఎలక్షన్ లో తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మంగళపల్లి ఆశయ్య, శ్రీరాం సుధీర్,తొర్రూరు పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడు రాయిశెట్టి ఉపేందర్, వార్డు కార్యదర్శి అరుణ్ కుమార్,మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎనంనేని శ్రీనివాస్ రావు,మాజీ సర్పంచ్ గద్దల బిక్షపతి,సర్పంచ్ గూగులోతు పటేల్ నాయక్,మాజీ సర్పంచ్లు బానోతు సోమ్లా నాయక్, జటోతు సురేష్,మంగళపల్లి నాగరాజు,గారే యాకయ్య,చిలుక మల్లేష్, మంగళపల్లి ఎల్లయ్య, అర్వపల్లి,మంగళపెల్లి సోమయ్య,గుడెల్లి దయాకర్,యం సుధాకర్, జి మల్లేష్, బందు యాకయ్య, రాయిశెట్టి యాకేందర్,బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ చర్యలు

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా : మున్సిపాలిటీల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల వారీ ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ, ప్రచురణ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, లోపాలు లేకుండా నిర్వహించడమే ముఖ్య లక్ష్యమని తెలిపారు. మున్సిపాలిటీలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్ల వారీ ముసాయిదా ఓటర్ల జాబితా జనవరి 1న సంబంధిత నోటీసు బోర్డులపై ప్రచురించడం జరుగుతుందని వివరించారు. జాబితాలో పేర్లు, చిరునామాలు లేదా ఇతర వివరాల్లో ఏవైనా తప్పులు, అభ్యంతరాలు ఉంటే, నిబంధనల ప్రకారం సకాలంలో సంబంధిత మున్సిపల్ కమిషనర్లకు లేదా జిల్లా అధికారులకు సమర్పించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. వారి ద్వారా వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం మున్సిపాలిటీల పోలింగ్ స్టేషన్ల వారీ తుది ఓటర్ల జాబితాను 2026 జనవరి 10వ తేదీన ప్రచురించనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు, సమగ్ర ఓటర్ల జాబితా రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు అప్పల గణేష్, శ్రావణ్ రెడ్డి, అజంబిన్ యహియా, రాము, సయ్యద్ హైదర్, నాందేడపు చిన్ను, భరత్వ్, జయ్, మజార్, వినోద్, సాదిక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-నల్గొండ బ్యూరో : ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందించేందుకు కృషి చేస్తానని నల్గొండ జిల్లా నూతన కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.కలెక్టర్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా సమాఖ్య భవనాలు

విశాలాంధ్ర-తుంగతుర్తి: ఉపాధి హామీ నిధులతో గ్రామ గ్రామాన మహిళా సమాఖ్య భవనాలు ప్రభుత్వ నిర్మించనున్నట్లు ఏపీఎం అశోక్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని 24 గ్రామపంచాయతీలో గాను 12 గ్రామపంచాయతీల లో భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ... మహిళా స్వయం సహాయక సంఘాలు ఆలయాలు ప్రభుత్వ కార్యాలయాలు చెట్ల కింద సమావేశాలు నిర్వహించాల్సి వస్తుందని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపే మార్గంలో ఉపాధి హామీ నిధులతో 200 గజాల స్థలంలో కనీసం 5502 చదరపు అడుగుల విస్తీర్ణంలో సుమారు రూ.10 లక్షల వ్యయంతో మండల పరిధిలోని అన్ని గ్రామాలలో భవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా మండల పరిధిలోని అన్నారం కేశవపురం గ్రామంలో ప్యాడీ క్లీనర్ నిర్మాణం కొరకు స్థలాన్ని సేకరించినట్లు తెలిపారు. స్థలాల గుర్తింపు అనంతరం గ్రామసభలు తీర్మానం చేసి గ్రామపంచాయతీ ద్వారా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పీడీకి ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు.

గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి చర్యలు : మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం/కల్లూరు : గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికాబద్ధ చర్యలు చేపడుతుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. రూ. 2 కోట్లతో నారాయణపురం నుండి పేరువంచ వరకు బిటి రోడ్డు, రూ. 4 కోట్లతో నారాయణపురం నుండి కొర్లగూడెం ఆర్ అండ్ బి రోడ్ నుండి రామకృష్ణపురం వరకు బిటి రోడ్డు, రూ. 7 కోట్లతో పేరువంచ నుండి కుప్పనకుంట్ల వరకు బిటి రోడ్డు, రూ. 2 కోట్లతో కొత్త నారాయణపురం నుండి ఎన్ఎస్పీ కెనాల్ లిఫ్ట్ వరకు నిర్మించనున్న బిటి రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా లిమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూలి ప్రజా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎటువంటి వెనుకడుగు వేయకుండా చర్యలు తీసుకుంటుందని అన్నారు. రాబోయే రోజుల్లో వందకు వంద శాతం ప్రతి గ్రామానికి అవసరమైన రోడ్లు, మౌళిక సదుపాయాల కల్పన చేస్తామని తెలిపారు. పేదలకు ఇచ్చిన ప్రతి మాట నెరవేర్చేందుకు ప్రభుత్వం పని చేస్తున్నదని, పేదలకు సన్న బియ్యం సరఫరా, కొత్త రేషన్ కార్డుతో పాటు పాత రేషన్ కార్డులో పేర్లను చేర్చడం, మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, పిల్లలకు మంచి విద్య అందించాలనే లక్ష్యంతో గురుకులాల్లో 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచడం జరిగిందని అన్నారు. రైతును రాజు చేసే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం వచ్చిన మొదటి 9 నెలల్లోనే 21 వేల కోట్ల రూపాయలు 25 లక్షల రైతన్నలకు చెందిన రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేశామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం మొదటి విడతలో నాలుగున్నర లక్షలు ఇండ్లు మంజూరు చేసిందని, ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు ఇస్తూ, ప్రతి సోమవారం నాడు లబ్దిదారులు కట్టిన ఇంటి లెవెల్ ననుసరించి చెల్లింపులు చేస్తున్నామని అన్నారు. వచ్చే ఏప్రిల్ నుండి రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరులు ఇస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర యాదవ్, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, కల్లూరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నీరజ ప్రభాకర్, మండల తహసీల్దార్ సాంబ శివుడు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సాయం చేయండి : కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : నూతన సంవత్సర నేపథ్యంలో వేలాది రూపాయలు ఖర్చుపెట్టి పరస్పరం శాలువాలు, పూల బొకేలు అందించుకునే బదులు పేద విద్యార్థులకు, ప్రభుత్వ పాఠశాలలకు ఆ డబ్బులతో ఉపయోగపడే సామాగ్రి ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అందులో భాగంగా వృధా ఖర్చు వద్దని పైన తెలిపిన సూచన చేశారు. రానున్న నూతన సంవత్సరం జిల్లా ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, శాంతి, సమృద్ధి తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా సాగాలని

కలెక్టర్ కోరుకున్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియ జేయడానికి తనను కలవడానికి వచ్చే అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ఎవరైనా కాని బొకేలు, పుష్పగుచ్ఛాలు, శాలువాలు తీసుకొని రావద్దని కలెక్టర్ పిలుపునిచ్చారు. నూతన సంవత్సరం సందర్భంగా బొకేలు, శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలపడం సహజమే అయినప్పటికీ వాటికి బదులుగా పేద విద్యార్థులకు ఉపయోగపడే నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, తదితర అవసరమైన సామగ్రిని అందించాలని ఆయన సూచించారు. ఈ విధంగా అందించే సామగ్రి పేద విద్యార్థుల చదువుకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యమే చాలా పుణ్యప్రదమైందన్నారు. ఆ డబ్బులను సేకరించిన విద్యా సామగ్రిని త్వరలో అర్హులైన విద్యార్థులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కలెక్టర్ నూతన ఆలోచనతో మానవీయ కోణంలో అభ్యర్థించిన ఈ పిలుపుతో జిల్లా ప్రజలను అభినందిస్తున్నారు.

ప్రజలందరు సుభిక్షంగా ఉండాలి : కూనంనేని

విశాలాంధ్ర - కొత్తగూడెం : నూతన సంవత్సరం 2026లో ఆద్యంతం ప్రజలు ఆయురారోగ్యాలతోపాటు కుటుంబాలతో సుభిక్షంగా ఉండాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆకాంక్షించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలతో పాటు భద్రాద్రి జిల్లా, కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలొ ప్రతి కుటుంబానికి శాంతి, సౌభాగ్యాలు లభించాలని కోరారు. గత సంవత్సరంలో ప్రజల సహకారంతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం చేయనున్నట్లు కూనంనేని భరోసా ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమన్నారు. కార్మికులు, రైతులు, యువత, మహిళలు అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ముందుకు వెళతానన్నారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో మరింత పురోగతి సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పేదల జీవితాల్లో మార్పు తీసుకురావడమే కమ్యూనిస్టుగా తన ధ్యాయమన్నారు. ప్రజలు పరస్పరం వైశమ్యాలు,

పగలు ప్రతీకారాలకు దూరంగా వుంటూ ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుకుంటూ అభివృద్ధి బాటలు నిర్మిద్దామని కోరారు. నూతన సంవత్సరం ఆశలు, అవకాశాలతో నిండి ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం రాబోయే ఏడాది ఇతోధికంగా సంక్షేమం అభివృద్ధి చెందాలని కోరారు. తనను నమ్ముకుని గెలిపించిన ప్రజల విశ్వాసానికి తగిన విధంగా సేవలందిస్తానని ఎమ్మెల్యే కూనంనేని స్పష్టం చేశారు.

జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు : సాబీర్ పాషా

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలకు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. నూతన సంవత్సరం ప్రతి కుటుంబానికి శాంతి, ఆరోగ్యం, సుఖసంతోషాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి సిపిఐ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. కార్మికులు, రైతులు, పేదల హక్కుల పరిరక్షణకు పార్టీ నిరంతరం పోరాడుతుందని, అందులో తాను కమ్యూనిస్టుగా నిరంతరం శ్రమిస్తానని భరోసా కల్పించారు. అభివృద్ధి, సంక్షేమం రెండూ సమాంతరంగా ఉన్నప్పుడే నిజమైన ప్రజల పండగ అని తెలిపారు. నూతన ఆశలు, ఆశయాలతో 2026 ఏడాది ముందుకు సాగేలా మనసూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రజల మద్దతుతో సిపిఐ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని సాబీర్ పాషా స్పష్టం చేశారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుంది : కలెక్టర్

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని మంచిర్యాల పట్టణంలో గల పద్మనాయక కళ్యాణమండపం ఏర్పాటు చేసిన కళ్యాణలక్ష్మి/ షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమంతో పాటు మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించే విధంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా పేదింటి ఆడపిల్ల పెళ్లికి ప్రభుత్వం కళ్యాణలక్ష్మి/ షాదీ ముబారక్ ద్వారా నగదు అందజేస్తుందని తెలిపారు. మంచిర్యాల మండలానికి చెందిన 95 మంది, హాజీపూర్ మండలానికి చెందిన 43 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అనేక వ్యాపారాలలో అభివృద్ధి చెందే దిశగా ప్రోత్సహిస్తుందని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అనేక వ్యాపార రంగాలలో ప్రోత్సహిస్తూ పెట్రోల్ బంకులు, సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు వంటి అనేక పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, హాజీపూర్ మండల తహసిల్దార్లు రఫతుల్లా, శ్రీనివాస్ రావు దేశ్ పాండే, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనవరి 4 నుంచి టెట్ పరీక్షలు: కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : టెట్ పరీక్షలు అభ్యర్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న కీలకమైన పరీక్షలు కావడంతో ఎలాంటి లోపాలకు తావు లేకుండా పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో టెట్ పరీక్షల నిర్వహణపై కలెక్టర్, అధనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ విద్యచందన, సంబంధిత శాఖల అధికారులతో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. జనవరి 2026లో 4, 5, 6, 8, 9, 11, 19, 20 తేదీలలో టెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9.00 గంటల నుండి 11.30 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2.00 గంటల నుండి 4.30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతా యన్నారు. జిల్లాలో టెట్ పరీక్షలకు మొత్తం 1017 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని వెల్లడిం చారు. టెట్ పరీక్షల నిర్వహణ నిమిత్తం జిల్లా వ్యాప్తంగా రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సుజాతనగర్ మండ లం అబ్దుల్ కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్సెస్, పాల్వంచ మండలం అనుబోస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నందు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని వద్ద సీసీ కెమెరాలు, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 163 బి ఎన్ ఎస్ ఎస్ సెక్షన్ అమలు చేయాలన్నారు.పరీక్షలు పూర్తిగా ఆన్లైన్ విధానంలో నిర్వహించబడతాయని కలెక్టర్ తెలిపారు. అన్ని కంప్యూటర్లు, నెట్‌వర్క్ కనెక్టివిటీ సక్రమంగా పనిచేసేలా ముందుగానే పరిశీలించాలన్నారు. అభ్యర్థులు ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా చెల్లుబాటు అయ్యే ఫోటో గుర్తింపు కార్డు తప్పనిసరిగా తమ వెంట తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. అభ్యర్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులు నడపాలని సంబంధిత అధికారులను సూచించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు గంట న్నర ముందే చేరుకోవాలని, పరీక్ష సమయానికి 10 నిమిషాల ముందే గేట్లు మూసివేస్తారని తెలిపారు. ఒకసారి గేట్లు మూసిన తరువాత ఎవరికీ లోపలికి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి, ఇంటర్మీడియట్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, అనుబోస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవికుమార్, అబ్దుల్ కలాం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దయాకర్ రావు, అబ్జర్వర్లు, పోలీస్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్యులు సమయ పాలన పాటించాలి : కలెక్టర్

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో వైద్యులు సమయ పాలన పాటించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం ఆయన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,వైద్యులు సమయ పాలన పాటిస్తూ విధులకు తప్పకుండా హాజరుకావాలని,ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జనరల్ ఆసుపత్రి లోని క్రిటికల్ కేర్,ఆర్థోపెడిక్ సర్జరీ బ్లాక్ లను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల నుంచి తమకు ఎటువంటి ఫిర్యాదులు రాకుండా వైద్య సిబ్బంది సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో ఆయన వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దయాళ్ సింగ్,డాక్టర్ లు కృపా బాయిరాజు,సంబంధిత అధికారులు, పాల్గొన్నారు

తలారి ఆశయాలు కొనసాగిస్తాం

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్: తలారి వెంకటేశ్వర్లు ఆశయాలు కొనసాగిస్తామని సీపీఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వి అజయ్ సారధి రెడ్డి అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మాజీ పట్టణ సహాయ కార్యదర్శి, ప్రజానేత అమరజీవి తలారి వెంకటేశ్వర్లు 13 వ వర్ధంతిని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లో బుధవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని తలారి వెంకటేశ్వర్లు కు ఘన నివాళులర్పించి అనంతరం మాట్లాడుతూ తలారి వెంకటేశ్వర్లు సేవలు మరువలేనివి అన్నారు .పట్టణ సహాయ కార్యదర్శిగా పాత బజార్ ప్రాంతంలో ఉద్యమాన్ని ముందుకు నడిపించిన గొప్ప వ్యక్తి తలారి వెంకటేశ్వర్లు అన్నారు. తెలంగాణ ఉద్యమకారుడుగా మరియు భూపోరాటాలలో తన వంతు పాత్ర పోషించి అనేక ఉద్యమాలు ఈ ప్రాంతంలో నడిపించిన వ్యక్తి తలారి వెంకటేశ్వర్లు తెలిపారు .ఈ కార్యక్రమంలో తలారి వెంకటేశ్వర్లు కుమార్తె తలారి కుమారి, పెరుగు కుమార్ ,రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న ,వెలుగు శ్రవణ్ ,నర్రా శ్రావణ్ ,ఆబోతు అశోక్‌పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణం ప్రాణదానం

విశాలాంధ్ర తొర్రూరు : ఒక వ్యక్తి రక్త దానం చేస్తే మరొకరికి ప్రాణదానం చేసినట్లుని లయన్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య, వరప్రసాద్ లు అన్నారు. బుధవారం ప్రముఖ వైద్యులు తొర్రూర లయన్స్ లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్యాట్రన్ సభ్యులు లయన్ డాక్టర్ కుందూరు రాజేందర్ రెడ్డి జన్మదిన సందర్భంగా, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మహబూబాబాద్ మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూర్ ల ఆధ్వర్యంలో స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో మెగా రక్తదాన శిబిరంలో వారు సంయుక్తంగా మాట్లాడుతూ, రక్తదాన శిబిరాల ద్వారా రక్తాన్ని సేకరించి, అవసరార్థులకు, ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తులకు ,శస్త్ర చికిత్సలో అవసరమైన రక్తాన్ని ఇవ్వటం వల్ల, ఇతరుల ప్రాణాలను కాపాడినట్లు అవుతుందని అన్నారు. ఆరోగ్యవంతులు సంవత్సరంలో కనీసం మూడుసార్లు అయినా రక్తదానం చేయవచ్చని తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో 25 యూనిట్ల సేకరించినట్టుగా మహబూబాబాద్ డాక్టర్ల బృందం తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320ఎఫ్ వీ.డీ.జీ. వన్ లయన్ ఎన్ సుధాకర్ రెడ్డి, వి డిజిటు లయన్ హరికిషన్ రెడ్డి, పూర్వ జిల్లా గవర్నర్లు లయన్ డాక్టర్ కే రాజేంద్రరెడ్డి, లయన్ తమ్మెర లక్ష్మీ నరసింహారావు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజ్మెంట్ సభ్యులు లయన్ తమ్మెర విశ్వేశ్వరరావు, రీజియన్ చైర్మన్ దామెర సురేష్, జోన్ చైర్మన్ లయన్ చిదురాల నవీన్ , క్లబ్బు అధ్యక్షులు లయన్ డాక్టర్ ఎస్ .రామ నర్సయ్య , క్లబ్బు కార్యదర్శి లయన్ ముడుపు రవీందర్ రెడ్డి ,క్లబ్ కోశాధికారి లయన్ వ జినేపల్లి శ్రీనివాస్, క్లబ్ సీనియర్ సభ్యులు లయన్ తమ్మెర వీరభద్రరావు, లయన్ తుమ్మేటి వెంకటరెడ్డి, లయన్ రేగురి వెంకన్న, లయన్ డాక్టర్ పి కిరణ్ కుమార్ లయన్ తమ్మి రమేష్, రీజియన్ సెక్రెటరీ లయన్ సారధి వెంకన్న ,పాస్ట్ జోన్ చైర్మన్ లయన్ ప్రతాపని వెంకటేశ్వర్లు, పూర్వపు అధ్యక్షులు లయన్ గంజి విజయపాల్ రెడ్డి మరియు బోనగిరి శంకర్ ,తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష పుష్పార్చన

విశాలాంధ్ర-మరిపెడ: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి సహిత హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో కొలువైన వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారికి సన్నిధిలో బుధవారం ఆర్యవైశ్యుల కుల గురువు వైశ్యగురుమఠం హలదీపూర్ కరా?టక,వారణాసి శ్రీ సంస్థాన్ శాంతాశ్రమమఠాధిపతి వామనాశ్రమ మహా స్వామిజీ చేతుల మీదుగా అమ్మవారికి లక్ష పుష్పార్చన పూజలు శాస్త్రోక్తంగా వైభవంగా నిర్వహించారు.ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి శ్రీశ్రీశ్రీ వామనాశ్రమ మహా స్వామిజీ సమక్షంలో స్వామి, అమ్మవార్ల సహస్రనామ పఠనాలతో లక్ష పుష్పార్చన పూజ మహోత్సవాన్ని అర్చకులు,వేద పండితుల బృందం అత్యంత ఘనంగా నిర్వహించగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.వివిధ పుష్పాలతో అమ్మవారిని అర్చిస్తూ నిర్వహించిన పూజను భక్తులు సేవించి దర్శించుకున్నారు.ఈపూజ కార్యక్రమంలో భక్తుల పెద్ద ఎత్తున పాల్గొనడంతో ఆధ్యాత్మిక సందడి నెలకొనడంతో అమ్మవారి నామస్మరణతో ఆలయం మారుమ్రోగింది. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేశారు.అదేవిధంగా స్వామివారితో పట్టణ కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ఆలయ నిర్వాహకులు, ఆర్యవైశ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల వివాహ ప్రోత్సాహక పథకాన్ని వినియోగించుకోండి

విశాలాంధ్ర-సూర్యాపేట బ్యూరో : తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగుల ఆర్థికాభివృద్ధి కోసం అమలు చేస్తున్న వివాహ ప్రోత్సాహక పథకాన్ని అర్హులు వినియోగించుకోవాలని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కె. నరసింహారావు తెలిపారు. దివ్యాంగులు-సకలాంగులు లేదా దివ్యాంగులు-దివ్యాంగుల వివాహానికి ప్రభుత్వం రూ.1 లక్షల ప్రోత్సాహక బహుమతి అందిస్తుందని చెప్పారు. 19-05-2025 తర్వాత వివాహం చేసుకున్న దంపతులు, వివాహం జరిగిన ఏడాది లోపు www.epass.telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నూతన ఐ మాస్టర్ ఆపిల్ సర్వీస్ సెంటర్ ప్రారంభం

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: కొండాపూర్ డివిజన్ పరిధిలోని, శ్రీరామ్ నగర్ ఏ బ్లాకు, చిరాక్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రక్కన, నూతనంగా ఏర్పాటు చేసిన ఐ మాస్టర్ ఆపిల్ సర్వీస్ సెంటర్ ను ముఖ్య అతిధిగా కొండాపూర్ డివిజన్ గౌరవ కార్పొరేటర్ హమీద్ పటేల్ గారు విచ్చేసి వారి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఐ మాస్టర్ ఆపిల్ సర్వీస్ సెంటర్ యాజమాన్యం హరీష్ హష్మీ గారికి శుభాకాంక్షలు తెలియజేసి, మరిన్ని శాఖలుగా విస్తరించి, వ్యాపారాభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కార్పొరేటర్ హమీద్ పటేల్ గారితో బాటుగా సీనియర్ నాయకులు షేక్ చాంద్ పాషా, భాస్కర్ ముదిరాజ్, హరీష్ రావు, ఉమర్, సమీర్ లాలా, అతిఫ్, మధు, హరీష్ శ్రీకాంత్, భరత్, వెంకటేష్, నిఖిల్, శ్రీనివాస్, అభిరామ్,తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

సంఘ్ పరువు తీసిన న్యూయార్క్ టైమ్స్

అమెరికా నుంచి వెలువడే న్యూయార్క్ టైమ్స్ పత్రిక సంఘ్ పరివార్ గుట్టు రట్టు చేసింది. అంటే ఒక రకంగా ప్రధానమంత్రి మోదీ అసలు స్వరూపాన్ని కూడా బయట పెట్టింది. గత పది రోజుల నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలలో విద్వేషం విషం కక్కుతోంది. బరేలీలో ఒక నర్సింగ్ విద్యార్థిని తన పుట్టిన రోజు పండగకు తన మిత్రులను ఆహ్వానించింది. బజ్‌రంగ్ దళ్ కార్యకర్తలమని చెప్పుకునే వారు జన్మదిన వేడుకలు జరుగుతున్న చోటికి వెళ్లి ఆ అమ్మాయి స్నేహితులలో ఇద్దరు ముస్లింలు ఉండడాన్ని గమనించి వారిని చితక బాదారు. విచిత్రం ఏమిటంటే మొదట బాధితుల మీదే కేసు నమోదు చేశారు. ఆ తరవాత దాడి చేసిన వారిని కూడా అరెస్టు చేశారు. ఈ మూకకు నాయకత్వం వహిస్తున్న రిషభ్ ఠాకూర్ ఇంకా పోలీసులకు పట్టుబడలేదు. ఈ మొత్తం దారుణాన్ని వీడియో తీసి ప్రచారంలో పెట్టారు. అదేమంటే మేం మా వారిని కాపాడడానికి వెళ్లామని ఆకతాయి మూక అంటోంది. సంఘ్ పరివార్‌కు అనుబంధంగా ఉన్న మూకలకు స్వపర భేదాలు కూడా ఉన్నట్టు లేవు. వారణాసిలో గంగా నదిలో స్నానం చేస్తున్న భారత్ యాత్రకు వచ్చిన ఓ కుర్రాడిని ఈ మూకలు నానా యాతన పెట్టాయి. ఆ కుర్రాడు చేసిన పాపమల్లా తల మీద ఎర్రటి శాంతా క్లాజ్ టోపీ పెట్టుకోవడం. ఎర్రటి చెడ్డీ వేసుకోవడం. హిందూ తత్వం కరడుకట్టిన అనేక మంది పరుగు పరుగున అక్కడికి వచ్చి ఆ కుర్రాడిని చాలా ఇబ్బంది పెట్టారు. ఈ సంఘటన వారణాసిలోని ప్రధాన స్నానఘట్టం దగ్గర జరిగింది. గంగా హారతి చూడడానికి ప్రతి రోజు వేలాది మంది వస్తూ ఉంటారు. సరిగ్గా ఇదే స్నానఘట్టం దగ్గర జపాన్ ప్రధానమంత్రి మన దేశానికి వచ్చినప్పుడు ప్రధాని మోదీ ఆయనను ఊయలలూగించారు. జపాన్ ప్రధాని గంగా హారతిలో కూడా పాల్గొన్నారు. సరిగ్గా ఆ దేశానికి చెందిన యువకుడే సంఘ్ పరివార్ అల్లరి మూకల బారిన పడవలసి వచ్చింది. త్రిపురకు చెందిన అంజెల్ చక్మాను చైనీయుడిగా భావించి సంఘ్ పరివార్ మూకలు చితక బాదాయి. తీవ్రంగా గాయపడ్డ ఆ వ్యక్తి పది పన్నెండు రోజుల తరవాత ప్రాణాలు విడిచాడు. ఈ సంఘటన సాధారణంగా ప్రశాంతంగా ఉండే ఉత్తరాఖండ్‌లో జరిగింది. క్రిస్మస్ సందర్భంగా దేశంలో వివిధ ప్రాంతాలలో క్రిస్మస్ వేడుకల మీద దాడి చేశారు. శాంతాక్లాజ్ బొమ్మల మీద ఆ వేషం వేసుకున్న వారి మీద సంఘ్ మూకలు తీవ్రంగా దాడి చేసి కనీవినీ ఎరుగని విధ్వంసం సృష్టించాయి. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో ప్రసిద్ధ మాల్‌లోకి చొరబడి క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటున్న వారి మీద భీకరమైన దాడి చేశారు. ఇలాంటి ఘోరాలు 2025 వ సంవత్సరం చివరి పది రోజులలో పెట్రేగి పోయాయి. ఐ.పి.ఎల్. మ్యాచ్ జరిగింది. ఆ మ్యాచ్‌లో పాల్గొనే బృందాలలో షారుఖ్‌ఖాన్ అధీనంలోని బృందం కూడా ఉంది. ఆ బృందంలో ఒక బంగ్లాదేశీ క్రీడాకారుడు కూడా ఉన్నారు. ఆ క్రీడాకారుడు ఉంటే మ్యాచ్ జరగనివ్వబోమని సంఘ్ మూకలు హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. ఆ బంగ్లా క్రికెటర్ మీదే కాక షారుఖ్‌ఖాన్ మీద దాడి చేస్తామని బాహాటంగా హెచ్చరిస్తున్నారు. సంఘ్ పరివార్ దురహంకారానికి సంబంధించిన ఇలాంటి ఘోరాల జాబితా చాలా పొడవైందే. మొత్తం మీద 2025 వ సంవత్సరం హిందూత్వ మూకల విలయ నర్తనంతో ముగిసింది.

ఇలాంటి అఘాయిత్యాలు కొత్తేమీ కాదు. మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత మతోన్మత్తుల మూకలు కొట్టి చంపడం అనే కిరాతకమైన కొత్త ప్రక్రియ ప్రారంభించారు. దీనినే లించింగ్ అంటారు. అంతకుముందు ఈ లించింగ్ అన్నమాట మన దేశంలో ఎన్నడూ వినిపించలేదు. ఈ దారుణకాండకు బలైన వారికి లెక్కే లేదు. ఈ మూక దాడులు గోరక్షణ పేరిట మొదలయ్యాయి. ఇటీవలే వారణాసిలో పశువులను దొంగిలిస్తున్న వారిని అరెస్టు చేశారట. వారు దొంగిలించి తీసుకెళ్తున్న నాలుగు ఆవులను కూడా పోలీసులు పట్టుకున్నారు. ఆవులను దొంగిలించిన వారు గోహత్యకు పాల్పడేవారు కాదు. సాధారణంగా గోహత్యకు పాల్పడుతున్నారన్న ఆరోపణపై ముస్లింలను కొట్టి చంపిన సంఘటనలు అనేకం జరిగాయి కానీ గోవులను తరలిస్తూ పట్టుబడ్డవారు రాజు పాండే, తీరథ్ కుమార్ సింగ్. వీరు పేర్లను బట్టి వీరు హిందువులే అని చెప్పడానికి అంతగా కష్టపడనక్కర్లేదు. పద్మావతి సినిమా తీసిన సంజయ్‌లీలా బన్సాలీ చరిత్రను వక్రీకరిస్తున్నారని హిందూత్వ భావజాలం ఉన్న వారే చెంపదెబ్బలు కొట్టారు. దీన్నిబట్టి ఈ మూకల దాడి కేవలం ముస్లింల మీదో, క్రైస్తవుల మీదో పరిమితం కాదు. తాము నమ్మే సిద్ధాంతానికి వ్యతిరేకులని భావిస్తే ఎవరి మీదైనా దాడి చేయగలరు. ఈ సంఘటనల ప్రభావం మన సరిహద్దులు దాటి కనిపించదనుకోవడం భ్రమ. అందుకే న్యూయార్క్ టైమ్స్ సంఘ్ పరివార్ గుట్టు విప్పింది. విస్తారమైన వార్త ప్రచురించింది. అందులో చెప్పిన కొత్త విషయాలేమీ లేకపోవచ్చు. కానీ ఆర్.ఎస్.ఎస్. బయటికి కనిపించేది కాదని తేల్చి చెప్పింది. అసలు ఆర్.ఎస్.ఎస్. భావజాలం, వారు శాఖల్లో ధరించే దుస్తులు, వారి భావజాలం జర్మనీలో బీభత్సం సృష్టించిన హిట్లర్ నుంచి, ఇటలీ నియంత ముస్సోలిని నుంచి తీసుకున్నవేనని న్యూయార్క్ టైమ్స్ పత్రిక మరోసారి వెల్లడించింది. ఆర్.ఎస్.ఎస్. దగ్గర అపారమైన నిధులున్నాయని కూడా రాసింది. విదేశాల్లో తన కీర్తి ప్రజ్వరిల్లుతోందని మోదీ చేసుకుంటున్న ప్రచారంలోని డొల్లతనం మరోసారి బట్టబయలైంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తనకు మంచి మిత్రుడు అని మోదీ మొన్నటి దాకా టముకు వేసుకునే వారు. కనీసం ట్రంప్ ప్రమాణ స్వీకారానికి మోదీని ఆహ్వానించనైనా లేదు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశాంగ విధానం ఏ పాటిదో అంతర్జాతీయ సమాజం గ్రహిస్తూనే ఉంది. ఆలింగనాలు, కరచాలనాలు విదేశాంగ విధానానికి ప్రతీకలు కావని అడుగడుగునా రుజువు అవుతోంది. శుష్క వాగ్దానాలు, అసత్య ప్రచారాల ద్వారా, సబ్కాసాథ్, సబ్కావికాస్ నినాదాల ద్వారా ఎల్లకాలం మోసం చేయడం కుదరదని న్యూయార్క్ టైమ్స్ కథనం రుజువు చేసింది. ప్రచారాస్త్రాలతో నిజం ఎల్లకాలం దాచడం కుదరదు. చిక్కేమిటంటే ఈ అవమానం మోదీకి, సంఘ్ పరివార్‌కు పరిమితం కాదు. ఈ అవమానం దేశాన్నే రచ్చకీడ్చింది.

ప్రజా భాగస్వామ్యంతోనే గ్రామ స్వరాజ్యం!

టి.ఎం.బి. బుద్ధిరాజు

గ్రామాల అభివృద్ధి లేకుండా రాష్ట్రాభివృద్ధి అసంపూర్ణమే అన్న సత్యాన్ని భారత రాజ్యాంగం గుర్తించింది. మహాత్మాగాంధీ ప్రతిపాదించిన గ్రామ స్వరాజ్య భావన కూడా అదే ప్రతిబింబిస్తుంది. ఈ దృక్పథానికి అనుగుణంగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవలి కాలంలో పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి తీసుకుంటున్న నిర్ణయాలు గ్రామ పాలనకు కొత్త ఊపిరిని ఇస్తున్నాయి. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బాధ్యతలు స్వీకరించిన తరువాత, ఈ శాఖలో కనిపిస్తున్న చురుకుదనం ప్రస్తావించదగినది.

పదివేల పదోన్నతులు-మానవ వనరుల బలోపేతం: పంచాయతీరాజ్ సంస్థలలో 10,000 పదోన్నతులు జారీ కావడం శాఖ చరిత్రలో ఒక మైలురాయి. దశాబ్దాలుగా పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న ఉద్యోగుల ఆకాంక్షలకు ఇది సార్థకమైన సమాధానం. ఉద్యోగుల్లో ఆత్మవిశ్వాసం పెరిగింది. వ్యవస్థపై నమ్మకం మరింత బలపడింది. పరిపాలనలో మానవ వనరులే ప్రధాన శక్తి అన్న సత్యాన్ని ఈ నిర్ణయం మరోసారి రుజువు చేసింది.

గ్రామీణాభివృద్ధికి భారీ బడ్జెట్ కేటాయింపు: 2025-26 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీరాజ్ శాఖకు రూ.4393.89 కోట్ల బడ్జెట్ డిమాండ్‌ను ఉప ముఖ్యమంత్రి శాసనసభలో ప్రవేశపెట్టారు. ఇది గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం ఇస్తున్న అత్యున్నత ప్రాధాన్యతకు స్పష్టమైన నిదర్శనం. ఈ నిధులు గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్‌లు, జిల్లా ప్రజా పరిషత్‌ల మూడు అంచెల వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఉన్నాయి.

15వ ఆర్థిక సంఘం నిధులు: 15 వ ఆర్థిక సంఘం పరిధిలో గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా ప్రజా పరిషత్‌లకు రూ.2,099 కోట్లు కేటాయించటం గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి కీలకంగా మారనుంది. రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ వంటి అవసరాలపై ఈ నిధులు గ్రామీణ జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయి.

పల్లె వెలుగు పథకం: గ్రామాల్లో ఎల్ఈడీ వీధి దీపాల నిర్వహణ కోసం 'పల్లె వెలుగు' పథకానికి రూ.250 కోట్లు కేటాయించడం మరో కీలక అడుగు. దీని ద్వారా గ్రామ భద్రత పెరుగుతుంది, విద్యుత్ వినియోగంలో పొదుపు సాధ్యమవుతుంది, రాత్రి వేళల్లో గ్రామ జీవనం మరింత చైతన్యవంతమవుతుంది.

సామాజిక సమానత్వం: గ్రామీణాభివృద్ధి అంటే కేవలం భౌతిక మౌలిక సదుపాయాలే కాదు. సామాజిక సమానత్వం కూడా అంతే ముఖ్యం. ఎస్సీ కాలనీల్లో గ్రంథాలయాల ఏర్పాటు కోసం నిధులు కేటాయించడం ద్వారా ప్రభుత్వం విద్య, జ్ఞానాభివృద్ధికి పెద్దపీట వేసింది. ఇది గ్రామీణ యువతలో చదువుపై ఆసక్తిని పెంచి, దీర్ఘకాలిక సామాజిక మార్పునకు దోహదపడుతుంది.

ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) కు రూ.1 కోటి కేటాయించడం స్థానిక స్వయం పాలనకు నిజమైన అర్థాన్ని ఇస్తుంది. ప్రతి గ్రామం తన అవసరాలను తానే గుర్తించి, ప్రజల భాగస్వామ్యంతో ప్రాధాన్యతలు నిర్ణయించుకునే స్వేచ్ఛ ఈ విధానం కల్పిస్తుంది. ఇక రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్‌ఏ) కింద శిక్షణ, సామర్థ్యాభివృద్ధికి రూ.130 కోట్లు కేటాయించడం పంచాయతీరాజ్ ప్రతినిధులు, సిబ్బందిపై పెట్టుబడిగా భావించాలి. అలాగే డ్రోన్ సాంకేతికతతో ఆస్తుల సర్వే, హక్కుల నమోదు చేసే స్వమిత్వ పథకం గ్రామాల్లో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారంగా మారే అవకాశం ఉంది.

చట్టసవరణ అవసరం: ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం మూడు స్థాయిల స్థానిక సంస్థలు స్వతంత్రంగా ఉన్నప్పటికీ, పరిపాలనా పర్యవేక్షణలో స్పష్టత లోపించింది. గ్రామ పంచాయతీలపై మండల ప్రజాపరిషత్‌కు, మండల ప్రజాపరిషత్‌లపై జిల్లా ప్రజాపరిషత్‌కు పర్యవేక్షణ అధికారాలు లేకపోవడం వల్ల అభివృద్ధి పనుల అమలు, నిధుల వినియోగంలో గందరగోళం నెలకొంది. కాబట్టి మూడు స్థాయిల మధ్య స్పష్టమైన పరిపాలనా అనుసంధానం చేసినప్పుడే డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టుల నియామకాలకు సార్థకత వస్తుంది. సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ విధానం ఏర్పడుతుంది. అంతేకాక తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం (2018) తరహాలో ట్రిబ్యునల్ ఏర్పాటు అత్యవసరంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. తద్వారా పంచాయతీరాజ్ సంస్థలలో, ముఖ్యంగా గ్రామ పంచాయతీలలో నిధుల దుర్వినియోగాన్ని అరికట్టవచ్చు.

అధికారాల వికేంద్రీకరణ: 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం పంచాయతీరాజ్ సంస్థలకు అధికారాలు నిధులు, విధులు బదలాయింపు జరగాలి. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం 29 అంశాలకు సంబంధించిన నిధులు, విధులు, అధికారాలు బదలాయింపులు జరగాల్సి ఉంది. ప్రస్తుతం పది అంశాలకు సంబంధించిన బదలాయింపు జరిగిందని చెప్తున్నారు. కానీ వాస్తవ రూపంగా అవి జరిగినట్టుగా కనిపించట్లేదు. అందుకే పరిపాలనా ఏకీకృతం జరగాలి. పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి విభాగాల పరిపాలన, ఖాతాల వ్యవస్థలను కమిషనర్ కార్యాలయం, జిల్లా పరిషత్, డివిజనల్ డెవలప్‌మెంట్, మండల పరిషత్ కార్యాలయాలలో ఏకీకృతం చేయాలి. "గ్రామాల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి పునాది" అన్న పవన్ కళ్యాణ్ మాటలు నినాదాలుగా కాకుండా విధానాలుగా అమలవుతున్నాయని చెపుతున్నారు. అంతేగాక అదనంగా గ్రామీణాభివృద్ధి, ఇంజనీరింగ్ విభాగాల నుంచి కూడా వేల కోట్ల రూపాయలు గ్రామీణ భారత్ వికాసానికి ఖర్చు పెడుతున్నారు. ఈ దిశలో చట్ట సవరణలు, పరిపాలనా సమన్వయం, ప్రజల భాగస్వామ్యం కొనసాగితే, గాంధీజీ కలగన్న గ్రామ స్వరాజ్యం ఆంధ్రప్రదేశ్‌లో వాస్తవ రూపం దాల్చడం ఖాయం.

చైర్మన్,ఏ.పీ. పంచాయతీరాజ్ వెల్ఫేర్ ట్రస్ట్
మొబైల్: 9703425006

కేరళలో అమిత్‌షాకు భంగపాటు!

ఎం.కోటేశ్వరరావు

ఇటీవల కేరళలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో అక్కడ అధికారంలో ఉన్న వామపక్ష సంఘటనకు ఎదురుదెబ్బ తగిలిందన్నది వాస్తవం. దాన్ని చావుదెబ్బగా కొందరు వర్ణిస్తున్నారు. అది నిజమా ? ప్రధాని నరేంద్రమోదీ తిరువనంతపురంలో బీజేపీ సాధించిన విజయం గురించి గొప్పలు చెప్పుకున్నారు. కేరళ రాజకీయాల్లో ఒక మహత్తర ఘట్టం అన్నారు. మోదీ సేవలో తరిస్తున్న కాంగ్రెస్ తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ చారిత్రాత్మక విజయం అన్నారు. ఎందుకటా నాలుగున్నర దశాబ్దాలుగా తిరువనంతపురం మేయర్ పీఠాన్ని నిలుపుకున్న సీపీఎం అక్కడ ఓడిపోయి 101 సీట్లకు బీజేపీ 50 తెచ్చుకున్నందుకు. ఓకే, కాసేపు నరేంద్రమోదీని సంతుష్టీకరించేందుకు అంగీకరిద్దాం, నిజమే కదా ! అయోధ్య రామ మందిరం గురించి దశాబ్దాల పాటు బీజేపీ ఎంత హడావుడి చేసిందో చూశాము. దానివల్లనే మూడుసార్లు మోదీ ప్రధాని అయ్యారు. అక్కడ మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో అయోధ్య భాగంగా ఉన్న ఫైజాబాద్‌లో పదేండ్ల అధికారం తరువాత బీజేపీ ఓడిపోయింది, అంతేనా, వారణాసి నియోజకవర్గం, వరుసగా ప్రధాని నరేంద్రమోదీ మూడుసార్లు ఎన్నికయ్యారు. తొలిసారి 3,71,784 ఓట్ల మెజారిటీ తెచ్చుకుంటే రెండవసారి 4,79,505 కు పెంచుకోగా మూడవ సారి 1,52,532 కు దిగజారింది. దీని గురించి ఏమని వర్ణిస్తారు ? ఒక వాస్తవం ఏమంటే కేరళలో గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే ఈసారి పెరగకపోగా స్వల్పంగా తగ్గాయి. దీని గురించి మోదీ నుంచి ఎలాంటి స్పందనా ఉండదు! స్థానిక సంస్థలలో అనేక అంశాలు పని చేస్తాయి. బీజేపి కేరళలో గతంలో తెచ్చుకున్న ఆరువందలకు పైగా పంచాయతీ వార్డులను ఈసారి పోగొట్టుకుంది. కొత్తగా కొన్ని తెచ్చుకొని గతం కంటే స్వల్పంగా మెరుగుపడింది. ఒకసారి అధికారంలో ఉన్న తరువాత అన్ని పార్టీలకూ వాటి పని తీరును బట్టి వ్యతిరేకత ఉంటుంది. అది ఒక్క సీపీఐ(ఎం) కే కాదు, ప్రతి పార్టీకి వర్తిస్తుంది.

కేరళ స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ (ఎం) నాయకత్వంలోని ఎల్‌డిఎఫ్ పని అయిపోయిందని తరువాత బీజేపీదే హవా అన్నట్లుగా మీడియాలో కొందరు ఊదరగొట్టారు. కేరళలో కమ్యూనిస్టు వ్యతిరేక మీడియాలో మళయాళ మనోరమ ఒకటి. అది 2025 డిసెంబరు 22 న ఒక విశ్లేషణ రాసింది. దానికి పెట్టిన శీర్షిక " స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇక్కడ బీజేపీ తీరుచూసి అమిత్ షా ఎందుకు ఆశాభంగం పొందుతారంటే" దాన్లో ఏముందో చూద్దాం. "స్థానిక సంస్థల ఎన్నికల్లో 25శాతం ఓట్లు తెచ్చుకోవాలని కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షా లక్ష్య నిర్దేశం చేశారు. అమిత్‌షాలో ఆశావాద వేడి ఎందుకు పుట్టిందంటే 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డిఏ ఒక్కటే ఇక్కడ 19.40 శాతం ఓట్లను తన ఖాతాలో వేసుకుంది. అదిప్పుడేమైందంటే నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (బీజేపీ -భారత ధర్మ జనసేన-లోక్ జనశక్తి పార్టీ) కేవలం 14.76 శాతం ఓట్లనే తెచ్చుకోగలిగింది. (గత స్థానిక ఎన్నికల కంటే 0.24 శాతం తక్కువ- వికీపీడియా) యుడిఎఫ్‌కు 38.81, ఎల్‌డిఎఫ్‌కు 33.45శాతం వచ్చాయి.

పంచాయత్‌లలో(జిల్లా, బ్లాక్, గ్రామ పంచాయి తీలు అన్నీ కలిపి) ఎన్‌డిఏకు వచ్చిన ఓట్లు 13.92 శాతం, 2020 లో వచ్చిన 14.34 శాతం కంటే స్వల్పంగా తక్కువ. మున్సిపాలిటీలలో 13.1 నుంచి 19.44 శాతానికి పెంచుకుంది. కార్పొరేషన్లలో 19.44 నుంచి 23.58 శాతానికి పెంచుకుంది. మొత్తం అన్ని స్థానిక సంస్థలలో వచ్చిన సగటు ఓట్లు 14.76 శాతం. యుడీఎఫ్‌కు సీట్ల రీత్యా ఎల్‌డిఎఫ్ కంటే మెరుగ్గా వచ్చాయి, గతం కంటే నాలుగుశాతం ఓట్లు పెరిగినప్పటికీ ఎన్‌డిఏకు వచ్చిన 34.52 శాతం కంటే మెరుగ్గా ఎల్‌డిఎఫ్‌కు 34.56 శాతం వచ్చాయి.

2020 లో బీజేపీకి కాసరగోడ్ జిల్లాలోని మధుర్, బెల్లూర్ గ్రామ పంచాయితీలలో, రెండు మున్సిపాలిటీలు పాలక్కాడ్, పండలంలో స్పష్టమైన మెజారిటీ ఉంది. ఈసారి రెండింటిలో దానికి మెజారిటీ రాలేదు, పండలంలో అవమానకరంగా నష్టపోయింది. ఈసారి ఎన్‌డిఏ 421 కార్పొరేషన్ వార్డులకు గాను 22.09 శాతం (93), 3,240 మున్సిపల్ వార్డులకు గాను పదిశాతం (324), 346 జిల్లా పంచాయత్ వార్డులకు గాను ఒక్కటి, 2,267 బ్లాక్ పంచాయత్ వార్డులకు 54, గ్రామ పంచాయితీలలోని 17,337 కు గాను 1,447 వార్డులు 8.35 శాతం వచ్చాయి. ఒక్క కార్పొరేషన్లలో తప్ప 2020 తో పోల్చితే బీజేపీ పరిస్థితి పెద్దగా మెరుగైనట్లు ఇవి ప్రతిబింబించటం లేదు. మున్సిపాలిటీలు, జిల్లా పంచాయత్‌లో గతం కంటే తగ్గింది. బీజేపీ 2020 లో సాధించినవి, ఇప్పటి పరిస్థితి ఇలా ఉంది. కార్పొరేషన్లు 14.25 (ఇప్పుడు 22.09), మున్సిపాలిటీలు 10.4 (ఇప్పుడు పదిశాతం) జిల్లా పంచాయత్‌లు 0.60 (ఇప్పుడు 0.29), బ్లాక్ పంచాయత్ 1.78 (ఇప్పుడు 2.38) గ్రామ పంచాయితీలు 7.4 (ఇప్పుడు 8.35). ఈ సారి పండలం మున్సిపాలిటీని బీజేపీ కోల్పోయింది. ఇది శబరిమలకు దగ్గరగా ఉంది. అంతర్గత కుమ్ములాటలు, పాలనలో అక్రమాల కారణంగా ఇది జరిగింది. గతంలో బీజేపీకి 20 సీట్లు ఉంటే ఇప్పుడు తొమ్మిది స్థానాలతో మూడవ స్థానానికి దిగజారింది. పాలక్కాడ్‌లో బీజేపీ 2020 లో 28 సీట్లు తెచ్చుకొని సంపూర్ణ మెజారిటీ సాధించింది. ఈసారి పెద్ద పార్టీగా ఎన్నికైనప్పటికీ మెజారిటీకి అవసరమైన 27 కు గాను 25 తెచ్చుకుంది. తిపురినిత్తుర మున్సిపాలిటీలో గత ఎన్నికల్లో 15 తెచ్చుకుంది.(ఎల్‌డిఎఫ్‌కు 21) ఈసారి 21 సీట్లతో బీజేపీ పెద్ద పార్టీగా ఎన్నికైంది, మెజారిటీ సంఖ్య 27. గత ఎన్నికల్లో రెండవ పార్టీగా ఉన్నప్పటికీ ఓట్ల శాతంలో 27.54 తో పెద్దదిగా, యుడిఎఫ్ 24.42, ఎల్‌డిఎఫ్ 23.25 శాతం తెచ్చుకున్నాయి.

మున్సిపాలిటీలలో గుర్తించదగినదిగా బీజేపీ ఉనికి ఉన్నప్పటికీ కొన్ని జిల్లాల్లో దాని ఓట్ల వాటా పెరిగింది. అయితే కొన్ని జిల్లాలోని మున్సిపాలిటీలలో దాని ఓట్ల వాటా తగ్గింది. ఇవన్నీ మళయాళ మనోరమ విశ్లేషణ లోని అంశాలే. తిరువనంతపురంలో బీజేపీ గెలుపు గురించి మీడియాలో వచ్చిందేమిటో చూశాము. శబరిమల అయ్యప్ప ఆలయం సమీపంలో ఉన్న పండలం మున్సిపాలిటీలో 34 వార్డులు ఉండగా గత ఎన్నికల్లో బీజేపీ పద్దెనిమిది తెచ్చుకుంది. ఈసారి తొమ్మిది వార్డులతో మూడ స్థానానికి పడిపోయింది. అనేక మంది రాష్ట్ర నేతలు ఇక్కడ తిష్టవేసి ఎలాగైనా నిలబెట్టుకోవాలని చూశారు. ఎల్‌డిఎఫ్ 14, యుడిఎఫ్ 11 తెచ్చుకున్నాయి. అయ్యప్పస్వామి ఆలయ ప్రవేశ వివాదంతో గతంలో బీజేపీ పొందిన లబ్ధి ఇప్పుడు తుడిచి పెట్టుకుపోయింది. ఇటీవల అయ్యప్ప ఆలయంలో జరిగిన బంగారు తాపడాల అక్రమాన్ని ప్రచారం చేసి మరింతగా లబ్ధిపొందాలని చూసి భంగపడింది. ఈ మున్సిపాలిటీ మాత్రమే కాదు, దాని పక్కనే ఉన్న కులంద గ్రామ పంచాయితీ 15 సంవత్సరాలుగా బీజేపీ ఆధీనంలో ఉంది. ఈసారి అక్కడ ఎల్‌డిఎఫ్ 8, బీజేపీ, ఇతరులు నాలుగు చొప్పున, యుడిఎఫ్‌కు ఒక స్థానం వచ్చింది. శబరిమల ఆలయం ఉన్న రన్నీ-పెరునాడ్ పంచాయితీ శబరిమల వార్డులో బీజేపీ మూడవ స్థానంలో ఉంది. యుడిఎఫ్, ఎల్‌డిఎఫ్‌కు సమంగా ఓట్లు రావటంతో లాటరీలో ఎల్‌డిఎఫ్‌కు వచ్చింది. ఈ పంచాయితీని పది వార్డులతో ఎల్‌డిఎఫ్ గెలుచుకుంది. తిరువనంతపురం కార్పొరేషన్‌లో బీజేపీ 101 కిగాను 50 వార్డులతో అధికారానికి వచ్చింది. సీపీఐ(ఎం) రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్ వెల్లడించిన వివరాల ప్రకారం ఓట్ల రీత్యా అక్కడ సీపీఐ(ఎం) ప్రథమ స్థానంలో ఉంది. మీడియాకు ఈ వివరాలు తెలిసినప్పటికీ అది పెద్ద ప్రాధాన్యత కలిగిన అంశం కాదన్నట్లుగా మౌనంగా ఉంది. లోక్‌సభ ఎన్నికలు 2024 లో బీజేపీకి తిరువనంతపురంలో 2,13,214 ఓట్లు వస్తే కార్పొరేషన్ ఎన్నికల్లో అవి 1,65,891 కి తగ్గాయి. యుడిఎఫ్ ఓట్లు 1,84,727 నుంచి 1,25,984 కు పడిపోగా ఎల్‌డిఎఫ్ ఓట్లు 1,29,048 నుంచి 1,67,522 కు పెరిగాయి, అంటే బీజేపీ కంటే స్వల్పంగా ఎక్కువ తెచ్చుకుంది. బీజేపీ గెలిచిన 50 వార్డులలో 40 చోట్ల యుడిఎఫ్ మూడవ స్థానంలో ఉంది. ఇరవై అయిదు వార్డులలో కాంగ్రెస్‌కు కనీసం వెయ్యి ఓట్లు కూడా రాలేదు. కొన్నింటిలో ఐదువందలకు లోపే వచ్చాయి ? కొన్ని చోట్ల బీజేపీ వంద ఓట్ల కంటే తక్కువ మెజారిటీతో గెలిచింది. దీని అర్థం ఏమిటి? పార్లమెంటు, స్థానిక సంస్థల ఎన్నికలో ఓటర్ల తీరులో తేడా ఉంటుందన్నది వాస్తవం. అక్కడ గెలిచిన కాంగ్రెస్ నేత శశిథరూర్ ఆ పార్టీలో ఉంటూనే బీజేపీతో చెలిమి చేస్తున్న సంగతి బహిరంగ రహస్యం. తన పార్టీ తీరుతెన్నులను మరిచిపోయి బీజేపీ చారిత్రాత్మక విజయం సాధించిందని పొగిడారంటే ఏం జరిగిందో చెప్పనవసరం లేదు. అనేక చోట్ల రెండు పార్టీలు సీపీఎంకు వ్యతిరేకంగా కుమ్మక్కు కావటం గతంలో జరిగింది, ఇప్పుడు కూడా పునరావృతం అయినట్లు కనిపిస్తోంది!

మనుస్మృతిని అంబేద్కర్ ఎందుకు తగలబెట్టారు?



డాక్టర్ దేవరాజు మహారాజు

పైకి ఎదగడానికి ఏమాత్రం వీలులేని కుటుంబంలో పుట్టి, ఏ అవకాశమూ లేని సామాజిక పరిస్థితుల్లో పెరిగి, అస్పృశ్యుడిగా అవమానాల పాలవుతూ కూడా నిబ్బరంగా ఉంటూ, ఆత్మ విశ్వాసంతో, మొక్కవోని దీక్షతో ఒక్కొక్క మెట్టూ ఎక్కుతూ విశ్వమానవుడిగా ఎదిగిన వారు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్. ఆ కాలంలో అన్ని పుస్తకాలు చదివి, అన్ని డిగ్రీలు సంపాదించి అత్యున్నత స్థాయికి చేరిన మేధావి కదా ఆయనా? మరి, మనుస్మృతి లాంటి గ్రంథాన్ని బహిరంగంగా, బాహాటంగా, ధైర్యంగా ఎందుకు తగులబెట్టారూ? అలా తగులబెట్టాల్సిన ప్రమాదకరమైన విషయాలు, సమాజానికి హాని కలిగించే విషయాలు అందులో ఏమున్నాయి? - అని పరిశీలిస్తే... ఉన్నాయి! ఈ అత్యాధునిక వైజ్ఞానిక సమాజాన్ని వెనక్కి నడిపించే చెత్తంతా అందులో ఉంది. అంబేద్కర్ ఆ గ్రంథాన్ని తిరస్కరించడంలో న్యాయముంది. మనువాద భావజాలాన్ని వదులుకోవాల్సి ఉందన్న సందేశం ఈ దేశ ప్రజలకు ఇవ్వడం కోసం ఆయన అలా ఆ గ్రంథాన్ని తగలబెట్టి చూపించారు. అయినా, సమాజంలో రావల్సినంత మార్పు రాలేదు. అణగారిన వర్గాలకు చెందిన వారే మూర్ఖంగా మనువాద భావజాలంలో కొట్టుకుపోతున్నారు. వైదిక ధర్మ ప్రబోధాలకు ప్రభావితులై, వాటిని పాటిస్తూ తాము అగ్రవర్ణాల వారి స్థాయికి చేరుకున్నామని సంతృప్తి పడుతున్నారు. కానీ, అది అర్థం లేనిది. ఏ వర్గం వారైనా, ఏ వర్ణం వారైనా తమ తమ స్థాయి భేదాల్ని వదులుకుని, అందరం మనుషులమేనని గుర్తుంచుకున్న నాడే మానవత్వం పరిమళిస్తుంది. ఆధునిక జన్యుశాస్త్ర సారాంశం గ్రహించిన నాడే మానవవాదం బలపడుతుంది. మనుస్మృతిని అంతా ఇక్కడ పరిచయం చేయబోవడం లేదుగానీ, మానవీయ విలువలకు విఘాతం కలిగించే అంశాలు ఏమేమున్నాయో కొన్నిటిని విశ్లేషించుకుందాం! మతిలేని సూక్తులు ఆ గ్రంథంలో ఇంతగా ఉన్నాయా? అని ఆశ్చర్యపోవాల్సి వచ్చినా... ఏ మాత్రం ఆశ్చర్యపోవద్దు! డా.బి.ఆర్. అంబేద్కర్‌ను అనుసరిస్తే చాలు!!

బ్రాహ్మణుడు మూడు రోజులు పాలు అమ్మితే గనక, అతను శూద్రుడయి పోతాడు (మనుస్మృతి 10/92) అంటే పాల వ్యాపారం చేసేవారు ఎవరైనా బ్రాహ్మణుల దృష్టిలో శూద్రులే - యజ్ఞంలో కొడుకును బలి ఇచ్చినా బ్రాహ్మణుడు బ్రాహ్మణుడిగానే ఉంటాడు (మనుస్మృతి 10/105) బ్రాహ్మణుడు కుక్కమాంసం భుజించినా బ్రాహ్మణుడిగానే ఉంటాడు (మనుస్మృతి 10/106 - 10/108) ఇతరులు గనక ఏ మాంస భక్షణ చేసినా పతితులైపోతారు. ఇదేం న్యాయం? ఇక మనుస్మృతి 10 వ అధ్యాయంలోని 95 నుంచి 98 వరకు నాలుగు శ్లోకాల సారాంశమేమంటే- బ్రాహ్మణ వర్గానికి చెందని తక్కువ స్థాయి వ్యక్తులెవరూ బ్రాహ్మ ణులు చేసే పనులు చేయగూడదు. పైనున్న బ్రాహ్మణ వర్గం వారు మాత్రం అవసరమైనప్పుడు జీవిక కోసం తక్కువ స్థాయి వారి పనులు చేసుకోవచ్చు. ఆ విధంగా కొంచెం నిలదొక్కుకున్న తర్వాత మళ్లీ వారు, వారి కులవృత్తిని స్వీకరించవచ్చు. ఇలాంటి అవకాశం కింది కులాల వారికి లేదు. అంటే బ్రాహ్మణులు బతకడానికి నిమ్న వర్గాల వారి వృత్తులు చేసుకోవచ్చు. నిమ్న వర్గాల వారి బతుకుదెరువు మీద దాడి చేయొచ్చు. వారికి పుట్టగతులు లేకుండా చేసే అధికారం బ్రాహ్మణులకు ఉంది. కానీ, ఎట్టి పరిస్థితుల్లోనూ నిమ్న వర్గాల వారు పై వర్గం వారి కులవృత్తిని దెబ్బ తీయకూడదు. తమ వర్గం వారికి అనుగుణంగా మనుస్మృతి రాసుకుని, దాన్ని బలవంతంగా జనం మీద రుద్దారు - అని అనడానికి ఇంత కన్నా ఏ సాక్ష్యాలు కావాలీ? ఇందులో ఏ న్యాయముందీ? ఏ మానవీయ విలువలున్నాయీ?

లోకంలో ఉన్న వాస్తవానికీ - మనుధర్మ శాస్త్రంలో వారు రాసుకున్నది పూర్తి వ్యతిరేకం. పూజలు, వ్రతాలు, యాగాలు, కర్మకాండలు వగైరా చేసి భూరి సంభావనలు స్వీకరించి, సంపాదించుకున్నది వారి స్వంత ఆస్తి అని భ్రమ పడుతున్నారు పాపం! బ్రాహ్మణార్యులకు ఉన్న బ్రహ్మ జ్ఞానమేమిటో వివరంగా చెప్పుకుంటే బావుండేది.

ఉత్పత్తి రేవ విప్రస్య మూర్తిర్ధర్మస్య శాశ్వతీ,
సహి ధర్మార్థముత్పన్నో బ్రహ్మభూయాయకల్పతే. 98
బ్రాహ్మణో జాయమానో హి పృథివ్యామధి జాయతే,
ఈశ్వరస్సర్వభూతానాం ధర్మకోశస్య గుప్తయే. 99
సర్వం స్వం బ్రాహ్మణస్యేదం యత్కించి జ్జగతీగతం!
శ్రేష్ఠ్యే నాభిజనేనేదం సర్వం వై బ్రాహ్మ ణో ర్హతి. 100

ఈ సృష్టి యందు ప్రాణులు గొప్పవి. ప్రాణుల యందు బుద్ధి వల్ల జీవించు జీవులు గొప్పవి. ఆ జీవుల యందు మానవులు మిక్కిలి గొప్పవారు. వారిలో బ్రాహ్మణులు గొప్పవారు. ఆ బ్రాహ్మణులలో విద్యాంసులు శ్రేష్ఠులు. ఆ విద్యాంసుల యందు యుక్తాయుక్త విచక్షణ కలవారు శ్రేష్ఠులు. కాగా వారి కంటే బ్రహ్మ జ్ఞానము కలవారు మిక్కిలి గొప్పవారు. ఈ బ్రాహ్మణుడు ధర్మ రక్షణకై పుట్టినాడు. ధర్మాన్ని ఆచరిస్తున్నందు వల్లనే అతడు బ్రహ్మత్వాన్ని పొందుతున్నాడు. ఆతడు సర్వశ్రేష్ఠుడు. అందరకు సమీపస్థుడు కావున, ఈ ప్రపంచమంతయు అతని సొత్తుగానే పరిగణింపబడుచున్నది.

(25 డిసెంబర్ 1927: అంబేద్కర్ మనుస్మృతిని తగలబెట్టిన రోజు.)

పై శ్లోకాలకు తాత్పర్యం అలా ఉంటే, అందులో మనుషులందరిలో బ్రాహ్మణుడు ఎందుకు శ్రేష్ఠుడయ్యాడో వివరణ లేదు. ఇక్కడ ధర్మ రక్షణ అంటే తమ పూట తాము గడుపుకోవడమేనని అర్థం చేసుకోవాలి! వారు కష్టపడిందీ లేదు. ఇతరులకు సహాయపడిందీ లేదు. సామాజిక కార్యాచరణ లోగడ ఏమీ లేదు. ఇప్పుడూ లేదు. భవిష్యత్తులోనూ ఉండదు. పూజలు చేయకపోతే అరిష్టం అని బ్లాక్ మెయిల్ చేసి, భయపెట్టి సొమ్ము లాగేసుకోవడం తప్ప, మరొకటి లేదు కదా? అది అక్రమార్జన అవుతుంది తప్ప సక్రమార్జన కాదు. ఈ దేశం మూఢ నమ్మకాల్లో కూరుకుపోవడానికి వీళ్లే ముఖ్య కారణం! వీరితో పాటు అన్ని మతాల మత బోధకులు కూడా కారణం!!

స్వ మేవ బ్రాహ్మణో భుఙ్క్తే స్వం వస్తే స్వం దదాతి చ,
అనృశంస్యా ద్బ్రాహణస్య భుంజతే హీతరే జనా: 101

బ్రాహ్మణుడు తన సొత్తును తానే అనుభవించుచున్నాడు. తన వస్త్రమును తానే ధరించుచున్నాడు. తన వస్తువులనే దానము చేయుచున్నాడు పైగా అతని దయా దాక్షిణ్యముల వలన ఇతరులు బ్రాహ్మణుని సొత్తు ననుభవించుచున్నారు.

ఈ శ్లోకాన్ని, దాని తాత్పర్యాన్ని అర్థం చేసుకుని, కొంచెం ఇంగిత జ్ఞానంతో ఆలోచిస్తే విషయం బోధపడుతుంది. సరే - ఇంగిత జ్ఞానమంటే ఏమిటీ? అని అడిగే వారే ప్రస్తుతం అధికారంలో ఉన్నారు. అందుకే కదా జనాన్ని ఆలోచింపజేయడానికి ఈ ప్రయత్నం?

శ్రమజీవుల్ని అదిరించి, బెదిరించి సంపాదించిన సొత్తు శతాబ్దాలుగా అన్యాయంగా అనుభవిస్తున్నారన్నది వాస్తవం. వారు తినే తిండి వారు పండించుకున్నది కాదు. వారు కట్టుకునే గుడ్డ వారు నేసుకున్నది లేదు. కాళ్లకు వేసుకునే చెప్పులు వారు కుట్టుకున్నవి కావు. మాసిన గుడ్డలు వారు ఉతుక్కున్నది లేదు. వారు వాడుకునే ఏ వస్తువూ వారు తయారు చేసుకున్నది కాదు. ఒళ్లు వంచింది లేదు. చమట కార్చిందీ లేదు. అప్పనంగా వచ్చింది కూర్చుని ఆరగించడం తప్ప, శ్రమశక్తి విలువ ఏమిటో వారికేమి తెలుసూ? యదార్థం ఆలోచిస్తే, దానాలు వీరు స్వీకరించడమే గానీ, మరొకరికి వీరిచ్చిందెపుడూ? ఒకసారి గతాన్ని నెమరు వేసుకుని చూడండి.

తోటి మనుషుల పట్ల మనువాదుల అభిప్రాయాలు, ఆలోచనలు ఎంత నీచంగా ఉంటాయో గమనించండి-

పంది వాసన చూచుట చేతను, కోడి రెక్కల గాలి చేతను, కుక్క చూపు పడుట వలనను, శూద్రుడు తాకుట చేతను పదార్థములు అపరిశుద్ధమగును. (మనుస్మృతి 3-24) ఇది ఒప్పుకోదగ్గదేనా?

అసలైన పరిణామవాదం మనుధర్మ శాస్త్రంలో ఉంది- చూస్కోండి! ఒకటవ అధ్యాయం 9-12 శ్లోకాలలోనే అంతా ఉంది. బ్రహ్మ అండం నుంచి పుట్టాడు. పుట్టి ఆ అండాన్ని తనే స్వయంగా రెండుగా విడగొట్టాడు. ఆ రెండు భాగాల నుంచి ఇంకా ఏమేమి సృష్టించాడో 13 వ శ్లోకంలో ఉంది. ఆ పదమూడవ శ్లోకం ప్రకారం ఆకాశం, పృథ్వి, ఆ రెండింటి మధ్య స్వర్గం ఏర్పరిచాడు. ఇంకా వాటి వెంట ఎనిమిది దిక్కులు, ఎనిమిది సముద్ర జలాలు సృష్టించాడు. ఇంత అత్యద్భుతమైన పరిణామ సిద్ధాంతం మనకు మనువాదులు ఇస్తే, దాన్ని గుర్తించకుండా అనవసరంగా డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం వెనక పడ్డారెందుకూ? పాపం! ఈ ప్రస్తుత ప్రభుత్వాన్ని మనం అనవసరంగా ఆడిపోసుకుంటున్నామా? ప్రపంచం ఆమోదించిన డార్విన్ సిద్ధాంతం పాఠ్య గ్రంథాల్లోంచి తీసేసి భావి భారత పౌరుల జీవితాల్లో చీకటి నింపకండని అనవసరంగా గగ్గోలు పెడుతున్నామా? ఒక్కసారి ఇంగిత జ్ఞానంతో ఆలోచిస్తే ఎవరి జవాబు వారికే లభిస్తుంది. మనమేమంటున్నామనీ? ప్రభుత్వం వారు అతిగా స్పందిస్తున్నారూ? ఉన్నది ఉన్నట్టుగా చెప్పి, ఆలోచించుకునే స్వేచ్ఛ జనానికి ఇవ్వండని అంటున్నాం! అంతే- కల్లబొల్లి కబుర్లు చెప్పి జనాన్ని మభ్యపెట్టకండని అంటున్నాం. అయినా జనం గతంలో లాగా అమాయకత్వంలో ఏమీ కూరుకుపోలేదు. వారు తెలుసుకుంటున్నారు. ఆలోచిస్తున్నారు. విశ్లేషించుకుంటున్నారు. వాస్తవాల వైపు, నిజాల వైపు ఆకర్షితులవుతున్నారు. అలాంటి ఆరోగ్యకరమైన 'పరిణామాన్ని' మనం ఆహ్వానించాలి!

ఈ ఆధునిక వైజ్ఞానిక యుగానికి సరిపడే విధంగా మనుషుల ఆలోచనా ధోరణిలో మార్పు రావాలన్న తపన తప్ప, మనుస్మృతి పేరుతో ఒక వర్గం వారిని ఉద్దేశించి, వారిని ఎద్దేవా చేయడానికి రాస్తున్నది కాదు. ఇందులోని అమానవీయమైన విషయాలని మన రాజ్యాంగం, కోర్టులు ఒప్పుకుంటాయా అన్న ఆవేదన, ఆందోళన తప్ప ఎవరినో తక్కువ చేసి చూపడానికి కాదు! గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దే బాధ్యత ఈ దేశ పౌరులందరిది - అని గుర్తు చేయడం కోసమే ఈ విషయాల్ని ఇక్కడ సమీక్షించడం జరిగింది. శతాబ్దాలుగా ద్వేషం పెంచి పోషించి, మనుషుల్ని విభజించింది చాలదా? ఇకనైనా దృక్పథాలు మార్చుకోవాల్సిన అవసరం లేదా?

"నువ్వు ఆనందకరమైన జీవితం గడపాలనుకుంటే, దాన్ని వ్యక్తులతోనో లేక వస్తువులతోనో గాక, ఒక లక్ష్యంతో ముడి పెట్టుకో-" ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్త, -అల్బర్ట్ ఐన్‌స్టీన్.

రచయిత: కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత, జీవశాస్త్రవేత్త

మోదీ విధ్వంస పాలన

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖడ్గే ధ్వజం

న్యూఢిల్లీ: ఈ ఏడాది(2025) కూడా బీజేపీ 'దోపిడీ, అవినీతి, దుర్మార్గపాలన' సాధారణ పౌరుల జీవితాలను శాసించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే సంవత్సరం చివరి రోజున అన్నారు. 2025లో మోదీ ప్రభుత్వ హయాంలో భారతదేశంలో జరిగిన పరిణామాలపై కాంగ్రెస్ ఒక జాబితా విడుదల చేసింది. సోషల్ మీడియా వేదికగా అధికార పార్టీపై సుదీర్ఘ ఆరోపణల జాబితాను ఖడ్గే బుధవారం వెల్లడించారు. ఆర్థిక వ్యవస్థ, ఉపాధి, సామాజిక న్యాయం, జాతీయ భద్రత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను ప్రభుత్వం నిర్వహించిన తీరుపై ఆయన మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'సంవత్సరం చివరి రోజున బీజేపీ పాలనలో 11వ సంవత్సరమైన 2025లో దేశాన్ని ఎలా పరిపాలించారో అందరికీ గుర్తు చేయడం చాలా అవసరం' అని ఖడ్గే (గతంలో ట్విట్టర్) లో హిందీలో పేర్కొన్నారు. వివిధ రంగాలలో ప్రభుత్వ వైఫల్యాలుగా ఆయన అభివర్ణించిన అనేక అంశాలను ఆయన జాబితా చేశారు. ఎన్నికల ప్రక్రియలు, జాతీయ భద్రత, విదేశాంగ విధానం, సంక్షోభ నిర్వహణలో వైఫల్యాలను, అలాగే అణగారిన వర్గాలపై పెరుగుతున్న అకృత్యాలు, తీవ్రమవుతున్న పర్యావరణ, వాయు కాలుష్య సమస్యలను కూడా ఆయన ఎత్తి చూపారు. 'ఎంజీఎన్ఆర్ఈజీఏను రద్దు చేయడం ద్వారా, లక్షలాది మంది పేదల నుంచి 'పని హక్కు'ను లాక్కున్నారు. ఎలాంటి సన్నాహం లేకుండా, బీఎల్ఓలకు శిక్షణ ఇవ్వకుండా, ఎస్ఐఆర్ ద్వారా లక్షలాది మంది నుంచి 'ఓటు హక్కు'ను లాక్కున్నారు. బీజేపీ ఓట్ల దొంగతనంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడింది. ఆర్థిక అసమానతల అగాధం మరింతగా పెరిగింది. భారతదేశ సంపద 40 శాతం అగ్రశ్రేణి 1 శాతం మంది చేతిలో ఉంది. రూపాయి పాతాళానికి పడిపోతోంది. ఆర్‌బీఐ 32 బిలియన్ డాలర్లు (2.8 లక్షల కోట్ల రూపాయలు) విలువైన అమెరికన్ డాలర్లను విక్రయించినప్పటికీ, దానివల్ల ఎలాంటి మార్పు రాలేదు. యువతలో నిరుద్యోగం గరిష్ట స్థాయిలో ఉంది. ప్రశ్నపత్రాల లీక్ మాఫియా ఆట నిరాటంకంగా కొనసాగుతోంది. మోదీ స్నేహితుడు 'నమస్తే ట్రంప్' మన దేశంపై ప్రపంచంలోనే అత్యధిక సుంకాలను విధించారు. పుల్వామా ఉగ్ర దాడి తర్వాత మన శక్తివంతమైన సైన్యం తగిన ప్రతీకారం తీర్చుకుంది. కానీ బీజేపీ మంత్రులు మన కల్నల్ గురించి సిగ్గుచేటయిన వ్యాఖ్యలు చేశారు. అధ్యక్షుడు ట్రంప్ కనీసం 60 సార్లు 'మధ్యవర్తిత్వం' గురించి చెప్పారు. ఇప్పుడు చైనా కూడా 'మధ్యవర్తిత్వం' గురించి మాట్లాడుతోంది. కానీ మోదీ మౌనంగా ఉన్నారు' అని విమర్శించారు. 'పెరుగుతున్న సామాజిక, ఆర్థిక సంక్షోభానికి కారణమవుతూనే, పరిపాలనా లోపాలు, మానవ విషాదాలకు ప్రభుత్వం జవాబుదారీతనం నుంచి తప్పించుకుందని ఖడ్గే ఆరోపించారు. మణిపూర్‌లో మోదీ-షా వైఫల్యం చెందారు. దానిని కప్పిపుచ్చడానికే రాష్ట్రపతి పాలన విధించారు. ద్రవ్యోల్బణం నుంచి ఎలాంటి ఉపశమనం లేదు. జీఎస్టీ నుంచి తగ్గింపు కేవలం లెక్కల గారడీ అని తేలింది. దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలపై అకృత్యాలు పెరిగిపోయాయి. చివరికి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా వదల్లేదు. దేశ రాజధాని ఢిల్లీతో పాటు ఉత్తర భారతదేశమంతా విషపూరిత వాయు కాలుష్యంతో సతమతమవుతోంది. ఎలాంటి కార్యాచరణ ప్రణాళిక లేదు. కేవలం డొల్ల మాటలే. అరావళి పర్వతాలను మైనింగ్ మాఫియాకు అప్పగించే కుట్ర. నికోబార్, హస్డియో, ముంబై మడ అడవులపై దాడులు. కుంభమేళా తొక్కిసలాట అయినా, ఢిల్లీ స్టేషన్ గందరగోళం అయినా, దగ్గు మందు వల్ల అమాయక ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. అయినా ఎవరూ బాధ్యత వహించడం లేదు' అని పేర్కొన్నారు. తన విమర్శలను ముగిస్తూ 'మొత్తం మీద, 2025లో కూడా బీజేపీ దోపిడీ, అవినీతి, దుర్మార్గపు పాలన దేశ ప్రజలపై తీవ్రంగా కొనసాగింది' అని ఖడ్గే తెలిపారు.

ఉత్తరాఖండ్‌లో ఢీకొన్న రైళ్లు

90 మందికి గాయాలు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో పెను ప్రమాదం తప్పింది. టీహెచ్‌డీసీ నిర్మిస్తున్న విష్ణుగఢ్-పీపల్‌కోటి జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణ పనుల కోసం ఏర్పాటు చేసిన పీపల్‌కోటి సొరంగంలో మంగళవారం అర్ధరాత్రి రెండు లోకోమోటివ్ రైళ్లు ఢీకొన్నాయి. షిఫ్ట్ మారుతున్న సమయంలో కార్మికులు, అధికారులను తీసుకువెళ్తున్న రైలు... మెటీరియల్‌తో వస్తున్న మరో రైలును ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. లోకోమోటివ్ రైళ్లు ఢీకొన్న సమయంలో రైల్లో మొత్తం 109 మంది ఉన్నారు. ఒక్కసారిగా జరిగిన ఈ ఘర్షణతో సొరంగం లోపల కార్మికులు భయాందోళనకు గురై కేకలు వేశారు. చీకటిగా ఉండే సొరంగం లోపల ఈ ప్రమాదం జరగడంతో కాసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ ఘటనలో మొత్తం 90 మందికి గాయాలు కాగా, వారిలో 10 మందిని గోపేశ్వర్‌లోని జిల్లా ఆసుపత్రికి, మరో 17 మందిని పీపల్‌కోటిలోని వివేకానంద ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారికి ప్రాథమిక చికిత్స అందించారు. సమాచారం అందిన వెంటనే జిల్లా మెజిస్ట్రేట్ గౌరవ్ కుమార్ అధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టారు. లోపల చిక్కుకున్న కార్మికులందరినీ సురక్షితంగా బయటకు తీసుకువచ్చామని, ప్రస్తుతం ఎవరికీ ప్రాణాపాయం లేదని ఆయన స్పష్టం చేశారు. సాధారణంగా పొడవైన సొరంగాల్లో కార్మికులను, మెటీరియల్‌ను చేరవేయడానికి ఇలాంటి లోకోమోటివ్ రైళ్లను ఒకే ట్రాక్‌పై ఉపయోగిస్తుంటారు. అయితే, సిగ్నలింగ్ లోపమా లేక మరేదైనా కారణమా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. అలకనంద నదిపై 444 మెగావాట్ల సామర్థ్యంతో ఈ విష్ణుగఢ్-పీపల్‌కోటి జలవిద్యుత్ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది నాటికి దీనిని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

సరిహద్దు ప్రాంతాల్లో అప్రమత్తం

శ్రీనగర్: కొత్త ఏడాది వేడుకల నేపథ్యంలో దేశంలో భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. ఢిల్లీ నుంచి కన్యాకుమారి వరకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఈక్రమంలో జమ్మూకశ్మీర్ సరిహద్దు ప్రాంతాలతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా పెంచారు. ఎలాంటి ఉగ్రదాడులు జరగకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు పెంచారు. వివిధ చోట్లు ఆయా సరిహద్దుల వద్ద ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసి స్థానిక పోలీసులు, ఆర్మీ దళాలు కలిసి వాహనాల తనిఖీలు చేపట్టాయి. ఎముకలు కొరికే ప్రాంతం దోడాలోని భలేసా అనే ఎత్తైన ప్రదేశాల్లో సైతం భద్రతను బలగాలు కట్టుదిట్టం చేశాయి. సరిహద్దుల వెంబడి ఉగ్రవాదుల చొరబాటును నిలువరించేందుకు డేగ కన్నులతో పహరా కాస్తున్నారు. దోడాలోని గడ్డకట్టిన అడవులు, దాచిన్ పర్వత గుహలలో దళాలు గస్తీకాస్తున్నాయి.

రైతు కళ్లల్లో కారం కొట్టి రూ.25 లక్షల దోపిడీ

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని అశోక్ నగర్ జిల్లా తమోయియా చక్ గ్రామంలో దొంగలు దారి కాచి ఓ రైతు కళ్లల్లో కారం కొట్టి అతడి నుంచి రూ.25లక్షలు దోచుకున్నారు. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. లఖ్విందర్ (47) అనే రైతు అశోక్‌నగర్‌లోని బంధువుకు ఇవ్వడానికి రూ.25 లక్షలు తీసుకొని ద్విచక్రవాహనంపై ఇంటి నుంచి బయల్దేరాడు. మార్గంమధ్యలో ముగ్గురు దొంగలు రైతును అడ్డగించారు. తమ వెంట తెచ్చుకున్న కారం లిఖ్విందర్ కళ్లలో కొట్టి అతడి వద్ద ఉన్న రూ.25 లక్షల నగదు బ్యాగును తీసుకొని అక్కడి నుంచి ఉడాయించారు. తమోయియా చక్-మోహ్రి గ్రామాల మధ్య ఈ ఘటన చోటు చేసుకుంది. కొద్దిసేపటికి తేరుకున్న రైతు... పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు. నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సబ్-డివిజనల్ పోలీస్ ఆఫీసర్ వివేక్ శర్మ తెలిపారు.

కత్తులు పంచుతున్న 10 మంది అరెస్టు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో కత్తులు పంచుతున్న 10 మందిని అరెస్టు చేశారు. హిందూ రక్షా దళ్‌కు చెందిన కార్యకర్తలు ఘజియాబాద్‌లో కత్తులు పంపిణీ చేస్తున్నట్లు ఓ వీడియో వైరల్ అయింది. ఈ నెల 29న జరిగిన ఈ ఘటనకు సంబంధించి 46 మందిపై కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహితలోని 191(2), 191(3), 127(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఘజియాబాద్‌లోని షాలిమార్ గార్డెన్‌లో ఉన్న ఆఫీసులో కత్తులను పంపిణీ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆ కార్యాలయం నుంచి ఎనిమిది కత్తులను స్వాధీనం చేసుకున్నారు. హిందూ రక్షా దళ్ జాతీయ అధ్యక్షుడు పింకీ చౌదరీ కత్తులను పంచుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ ఘటనపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. దీంతో విపక్షాలు తీవ్ర స్థాయిలో ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాయి.

కలుషిత నీరు తాగి 8 మంది మృతి

భోపాల్: బీజేపీ పాలిత రాష్ట్రం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ భగీరత్‌పుర కాలనీలో కలుషిత నీరు తాగి ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 100 మందికిపైగా ఆసుపత్రి పాలయ్యారు. అధికారుల వివరాల ప్రకారం... ఈ నెల 25న మున్సిపల్ అధికారులు సరఫరా చేసిన కొళాయి నీటిలో ఓ విధమైన వాసన రావడాన్ని స్థానికులు గుర్తించారు. ఆ నీటిని తాగి పలువురు అస్వస్థతకు గురవడంతో అధికారులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న అధికారులు ఆ కాలనీకి చేరుకొని నీటిని పరిశీలించారు. నమూనాలను సేకరించి పరీక్షలకు పంపారు. అస్వస్థతకు గురైన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే, అక్కడ పరిస్థితి విషమించి ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 100 మందికిపైగా ప్రజలు నగరంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వారి పరిస్థితి ప్రస్తుతం ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, తాగునీటి పైపులైన్లలో మురుగునీరు కలవడంతోనే ఈ ఘటన చోటు చేసుకున్నట్లు స్థానిక మేయర్ తెలిపారు.

చైనా వాదనపై ప్రధాని స్పందించాలి

కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్



న్యూఢిల్లీ: భారత్, పాకిస్థాన్ మధ్య మధ్యవర్తిత్వం వహిస్తున్నట్లు చైనా చేస్తున్న వాదనలపై భారత ప్రజలకు స్పష్టత అవసరమని కాంగ్రెస్ బుధవారం పేర్కొంది. ఈ వాదనపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన మౌనం వీడాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కోరారు. ఈ ఆరోపణ దేశ జాతీయ భద్రతను అపహాస్యం చేసేలా ఉందని అన్నారు. 'అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మే 10, 2025న ఆపరేషన్ సిందూర్‌ను ఆపడానికి తాను వ్యక్తిగతంగా జోక్యం చేసుకున్నానని చాలా కాలంగా చెబుతున్నారు. కనీసం ఏడు వేర్వేరు దేశాలలోని వివిధ వేదికలలో 65 వేర్వేరు సందర్భాలలో ఆయన అలా చేశారు. తన మంచి స్నేహితుడు అని చెప్పుకునే వ్యక్తి చేసిన ఈ వాదనలపై ప్రధాన మంత్రి ఇప్పటికీ మౌనం వీడలేదు' అని జైరాం రమేశ్ 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ఇప్పుడు చైనా విదేశాంగ మంత్రి కూడా ఇలాంటి వాదనే చేస్తున్నారు. చైనా కూడా మధ్యవర్తిత్వం వహించిందని చెబుతున్నారు. జులై 4, 2025న డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ ఆపరేషన్ సిందూర్ సమయంలో భారతదేశం వాస్తవానికి చైనాను ఎదుర్కొంటోందని, పోరాడుతోందని బహిరంగంగా ప్రకటించారు. 'చైనా పాకిస్థాన్‌తో నిర్ణయాత్మకంగా పొత్తు పెట్టుకున్నందున, భారతదేశం, పాకిస్థాన్ మధ్య మధ్యవర్తిత్వం వహించినట్లు చైనా వాదనలు ఆందోళన కలిగిస్తున్నాయి. అవి మన దేశ ప్రజలు నమ్ముతున్న దానికి ప్రత్యక్షంగా విరుద్ధంగా ఉండటం వల్లనే కాదు. వారు మన జాతీయ భద్రతనే ఎగతాళి చేస్తున్నట్లు కనిపిస్తున్నందున' అని ఆయన తెలిపారు. చైనాతో మన సంబంధం సందర్భంలో కూడా ఈ వాదనను అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. 'మేము వారితో తిరిగి చర్చలు ప్రారంభించాము. కానీ దురదృష్టవశాత్తు అది చైనా నిబంధనలపై ఉంది. జూన్ 19, 2020న చైనాకు ప్రధాన మంత్రి క్లీన్ చిట్ ఇవ్వడం భారతదేశం చర్చల స్థానాన్ని గణనీయంగా బలహీనపరిచింది' అని ఆయన అన్నారు. మన వాణిజ్య లోటు రికార్డు స్థాయిలో ఉందని, దేశ ఎగుమతులలో ఎక్కువ భాగం చైనా నుండి దిగుమతులపై ఆధారపడి ఉన్నాయని తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌కు సంబంధించి చైనా రెచ్చగొట్టే చర్యలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయన్నారు. 'ఇటువంటి అసమానమైన, శత్రుత్వంతో కూడిన సంబంధాల మధ్య ఆపరేషన్ సిందూర్‌కు ఆకస్మికంగా అంతరాయం కలగడంలో చైనా పోషించిన పాత్రపై భారతదేశ ప్రజలకు స్పష్టత అవసరం' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ ఏడాది చైనా మధ్యవర్తిత్వం వహించిన కీలక సమస్యల జాబితాలో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కూడా ఉన్నాయని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మంగళవారం అన్నారు. మే 7-10 తేదీల మధ్య భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన సంఘర్షణ రెండు దేశాల సైన్యాల డీజీఎంఓల (డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్) మధ్య ప్రత్యక్ష చర్చల ద్వారా పరిష్కరించబడిందని న్యూఢిల్లీ చెబుతూ వస్తోంది. అయితే భారత్, పాకిస్థాన్‌కు సంబంధించిన విషయాలలో ఏ మూడవ పక్షం జోక్యానికి తావు లేదని కూడా భారతదేశం నిలకడగా చెబుతోంది.

ఎవరి జోక్యం లేదు

పాక్‌తో కాల్పుల విరమణపై భారత్

న్యూఢిల్లీ: భారత్-పాకిస్థాన్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతల సడలింపునకు తామే మధ్యవర్తిత్వం నడిపామని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ చేసిన ప్రకటనను భారత విదేశాంగ శాఖ ఖండించింది. పాక్‌తో కాల్పుల విరమణ విషయంలో ఎవరి జోక్యం లేదని స్పష్టం చేసింది. ఇది రెండు దేశాల సైనిక డీజీఎంవోలు చర్చలు జరిపి తీసుకున్న నిర్ణయమని, ఇందులో మూడో పక్షం పాత్ర లేదని పునరుద్ఘాటించింది. పాకిస్థాన్‌తో కాల్పుల విరమణపై ఇప్పటికే పలు సందర్భాల్లో తమ వైఖరి స్పష్టం చేసినట్లు వెల్లడించింది. ఈ ఏడాది భారత్-పాకిస్థాన్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతల సడలింపునకు తామే మధ్యవర్తిత్వం నడిపామని చైనా మంత్రి వాంగ్ యీ మంగళవారం ప్రకటించారు. ఉత్తర మైన్మార్ సంక్షోభం, ఇరాన్ అణు సమస్య, ఇజ్రాయిల్-పలస్తీనా ఉద్రిక్తతల పరిష్కారాని కూడా తాము మధ్యవర్తిత్వం వహించామని చెప్పారు. మరోవైపు పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాక్ మధ్య జరిగిన కాల్పుల విరమణ అంగీకారం కుదిర్చారంటూ భారతీయ మూలాలున్న ట్రంప్ సహాయకుడు రికీ గిల్‌ను అమెరికా ప్రభుత్వం తాజాగా సత్కరించి, అవార్డు ప్రదానం చేసింది.

రిపబ్లిక్ డే పరేడ్‌లో యానిమల్ కంటింజెంట్

న్యూఢిల్లీ: ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో జనవరి 26న నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ కవాతులో ఈసారి ఓ అరుదైన కంటింజెంట్ చేరనుంది. గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో తొలిసారిగా యానిమల్ కంటింజెంట్‌ను తీసుకురావడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. రీమౌంట్ అండ్ వెటర్నరీ కార్ప్స్ విభాగానికి చెందిన శిక్షణ పొందిన జంతువులను ఈ కవాతులో ప్రదర్శించనున్నామని అధికారులు తెలిపారు. దేశంలోనే అత్యంత సవాళ్లతో కూడిన సరిహద్దుల వద్ద భద్రత కోసం సైనికులు ఉపయోగించే రెండు ఒంటెలు, నాలుగు గుర్రాలు, నాలుగు డేగలు, పది స్వదేశీ జాతి ఆర్మీకి చెందిన జాగిలాలు, ఇప్పటికే సేవల్లో ఉన్న మరో ఆరు జాగిలాలు ఈ బృందంలో ఉన్నాయి.

నారాయణ గురు సిద్ధాంతాల వక్రీకరణ: విజయన్

తిరువనంతపురం: ప్రముఖ సంఘ సంస్కర్త శ్రీనారాయణ గురు సిద్ధాంతాన్ని వక్రీకరించి హైజాక్ చేసేందుకు యత్నిస్తున్న స్వార్థపూరిత శక్తులపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నారాయణ గురుని ఒక నిర్దిష్ట మతం లేదా సమాజానికి పరిమితం చేసే ఇటువంటి ప్రయత్నాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వర్కాలలో నారాయణ గురు స్థాపించిన శివగిరి మఠంలో బుధవారం 93వ శివగిరి యాత్రను ప్రారంభించిన అనంతరం సీఎం మాట్లాడారు. కుల, మతాలకు అతీతంగా మానవత్వం, ఐక్యత, సౌభ్రాతృత్వం, స్నేహ మార్గాన్ని మానవాళికి చాటి చెప్పిన నిజమైన ప్రపంచ గురువు శ్రీనారాయణ గురు అని అన్నారు. వివిధ కుల, మత సమూహాలను చిన్నాభిన్నం చేయడం ప్రజాస్వామ్య, లౌకిక భావాలను బలహీనపరుస్తుందని హెచ్చరించారు. సమానత్వం... సామాజిక న్యాయాన్ని బలోపేతం చేసేందుకు, దేశ రాజ్యాంగ విలువలను కాపాడేందుకు ప్రగతిశీల శక్తుల దృక్పథంతో నారాయణ గురు సందేశాన్ని అనుసంధానం చేయాల్సిన అవసరాన్ని పునరుద్ఘాటించారు. గుర్తింపు ప్రాతిపదికన ప్రజలను విభజించే యత్నాలను ప్రతిఘటించడానికి, నారాయణ గురు బోధనల్లో కీలకమైన ప్రజాస్వామ్య ...లౌకిక విలువలను బలోపేతం చేయడానికి సమిష్టి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

నటి నుస్రత్ 'మహాకాల్' సందర్శన

ముస్లిం పెద్దల ఆగ్రహం



న్యూఢిల్లీ: ఉజ్జయినిలోని శ్రీ మహాకాళేశ్వర జ్యోతిర్లింగ ఆలయాన్ని సందర్శించిన ప్రముఖ నటి నుస్రత్ భరూచాపై ముస్లిం పెద్దలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆమె ఇటీవల మహాకాళేశ్వరుడి భస్మ హారతిలో పాల్గొన్నారు. ఆలయ పూజారులు ఆమెను శాలువాతో సత్కరించారు. ఆ పరమేశ్వరుడి ఆశీర్వాదం పొందాలనే ఉద్దేశంతో నుస్రత్ ఆలయాన్ని సందర్శించారు. ముస్లిం మహిళ అయిన నుస్రత్ మహాకాల్‌ను సందర్శించడంపై కొందరు ప్రశ్నించారు. ముఖ్యంగా, నుస్రత్‌పై ముస్లిం మత పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆల్ ఇండియా ముస్లిం జమాత్ జాతీయ అధ్యక్షుడు మౌలానా షహబుద్దీన్ రజ్వీ బరేల్వి మాట్లాడుతూ షరియా చట్టం ప్రకారం ఆమె పూజలు చేయడం, గంధం పూసుకోవడం ఘోర పాపం అని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు ఇస్లాం ప్రాథమిక సూత్రాలకు విరుద్ధమని ఆయన అన్నారు. నటి పశ్చాత్తాపం చెంది... కల్మా పఠించాలని మౌలానా డిమాండ్ చేశారు. అయితే, నుస్రత్ భరూచా తన మత విశ్వాసాలపై తన ఉదారవాద అభిప్రాయాలను బహిరంగంగా వెల్లడించారు. శుభంకర్ మిశ్రాతో ఒక ఇంటర్వ్యూలో ఆలయం, మసీదు లేదా చర్చి వంటి ప్రార్థనా స్థలాలలో శాంతిని పొందడాన్ని తాను నమ్ముతానని అన్నారు. 'మీకు ఎక్కడ శాంతి లభిస్తే, అది మందిరంలో అయినా, గురుద్వారాలో అయినా, చర్చిలో అయినా మీరు అక్కడికి వెళ్లాలి. నేను ఈ విషయాన్ని బహిరంగంగా చెబుతున్నాను. నాకు సమయం దొరికితే రోజుకు ఐదుసార్లు నమాజ్ చేస్తాను. ఒకే దేవుడు ఉన్నాడని, ఆయనతో అనుసంధానం కావడానికి వేర్వేరు మార్గాలు ఉన్నాయని నేను ఎప్పుడూ నమ్ముతాను. నేను ఆ మార్గాలన్నింటినీ అన్వేషించాలనుకుంటున్నాను' అని ఆమె అన్నారు.

కశ్మీర్ లోయలో మంచు దుప్పటి

శ్రీనగర్: కశ్మీర్ లోయలో మంచు దుప్పటి పరుచుకుంది. కశ్మీర్ వ్యాలీలోని ప్రసిద్ధ టూరిస్ట్ ప్రాంతమైన సోనామార్గ్‌లో తెల్లటి దూది వెదజల్లినట్టుగా మంచు కనిపిస్తోంది. దాంతో కశ్మీర్ వ్యాలీ పరిస రాలన్నీ అందంగా, ఆహ్లాదకరంగా, అద్భు తంగా కనిపిస్తున్నాయి. ఆ సుందర దృశ్యాలు టూరిస్టులకు కనువిందు చేస్తు న్నాయి. కశ్మీర్ వ్యాలీలో పగటి ఉష్ణోగ్రతలు పడిపోవడంతో గత కొన్ని రోజుల నుంచి మంచు విపరీతంగా కురుస్తుంది. సన్నని దూది పింజాల్లా రాలుతున్న మంచును యాత్రికులు తెగ ఎంజాయ్ చేస్తున్నారు. కశ్మీర్ వ్యాలీ పరిసరాలన్నీ తెల్లని మంచు పరుచుకోవడంతో అక్కడి వాతావరణం ఆహ్లాదకరంగా మారింది.

కారులో మహిళపై గ్యాంగ్‌రేప్

ఫరీదాబాద్‌లో దారుణం

చండీగఢ్: హర్యానా రాష్ట్రం ఫరీదాబాద్‌లో ఓ యువతి(25)పై ఇద్దరు వ్యక్తులు అఘాయిత్యానికి ఒడిగట్టారు. కదులుతున్న కారులో దాదాపు రెండు గంటల పాటు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం రోడ్డుపై పడేసి వెళ్లిపోయారు. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకోగా... ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ మహిళ తన తల్లితో గొడవపడి స్నేహితురాలి ఇంటికి వెళ్లింది. సోమవారం రాత్రి 8.30 గంటల సమయంలో తన సోదరికి ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పింది. మూడు గంటల్లో ఇంటికి వచ్చేస్తానని తెలిపింది. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ఇంటికి వెళ్లేందుకు రోడ్డుపై వాహనం కోసం ఎదురుచూస్తోంది. అదే సమయంలో కారులో వచ్చిన ఇద్దరు వ్యక్తులు మహిళను కారులో బలవంతంగా ఎక్కించుకుని వెళ్లిపోయారు. అనంతరం దాదాపు రెండున్నర గంటలపాటూ కదులుతున్న కారులోనే ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. తెల్లవారుజామున రాజ్‌చౌక్ వద్ద రోడ్డుపై పడేసి వెళ్లిపోయారు. ఈ దారుణ ఘటనలో ఆమె ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. మహిళ ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో యువతి తన సోదరికి ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పింది. సమాచారం తెలియగానే కుటుంబ సభ్యులు హుటాహుటిన అక్కడికి చేరుకొని బాధితురాలిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆమె ముఖంపై 12 కుట్లు వేశారు. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆ వివాహిత మహిళకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. గొడవల కారణంగా భార్యా భర్తలు విడివిడిగా ఉంటున్నట్లు బాధితురాలి సోదరి తెలిపింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితుల్ని పట్టుకున్నారు. అఘాయిత్యానికి పాల్పడిన ఇద్దరిని అరెస్ట్ చేసి కారును సీజ్ చేశారు.

ఆశల పల్లకిలో భారత వృద్ధిరేటు

న్యూఢిల్లీ: అభివృద్ధి విషయంలో భారత్ అగ్రదేశాలతో పోటీ పడుతోంది. జీడీపీ విషయంలో ఇప్పటికే జపాన్‌ను వెనక్కు నెట్టింది. నాల్గవ అతి పెద్ద దేశంగా నిలిచింది. భారత్ జీడీపీ 4.18 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. మొదటి మూడు స్థానాల్లో అమెరికా, చైనా, జర్మనీ దేశాలు ఉన్నాయి. భారత్ 2030 నాటికి జర్మనీని దాటేసి మూడో స్థానంలో నిలిచే అవకాశం ఉంది. 2025-2026 రెడో త్రైమాసికంలో భారత వాస్తవ జీడీపీ 8.2కు చేరింది. అంచెలంచెలుగా ముందుకు దూసుకుపోతోంది. 2030 నాటికి భారత జీడీపీ 7.3 ట్రిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం మొదటి స్థానంలో అమెరికా ఉండగా... రెండో స్థానంలో చైనా ఉంది. ఈ రెండింటిని దాటి మొదటి స్థానంలో నిలిచే దిశగా భారత్ అడుగులు ముందుకు వేస్తోంది. అంతర్జాతీయ సంస్థలు కూడా భారత ఆర్థిక వ్యవస్థపై గట్టి నమ్మకంతో ఉన్నాయి. భారత వృద్ధిరేటు 2026లో 6.5కు చేరే అవకాశం ఉందని ప్రపంచ బ్యాంక్ చెబుతోంది. మూడీ అంచనా ప్రకారం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న జీ20 ఎకానమీ దేశంగా భారత్ నిలవనుంది. వృద్ధిరేటు 2026లో 6.4 శాతం, 2027లో 6.5 శాతంగా ఉండనుంది. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు భారత్ వృద్ధి అంచనాలు పెంచుతున్నాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి 2025 సంవత్సరానికిగాను భారత వృద్ధి రేటును 6.6 శాతంగా, 2026కి 6.2 శాతంగా అంచనా వేసింది. సీఈసీడీ కూడా 2025లో 6.7 శాతం, 2026లో 6.2 శాతం వృద్ధి నమోదు అవుతుందని వెల్లడించింది. ఎస్ అండ్ పీ సంస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం, వచ్చే ఏడాదిలో 6.7 శాతం వృద్ధి ఉంటుందని అంచనా వేస్తోంది. ఆసియా అభివృద్ధి బ్యాంక్ 2025కి తన అంచనాను పెంచుతూ 7.2 శాతం వృద్ధి ఉంటుందని చెప్పింది.

ఇదిలా ఉండగా దేశంలోని ప్రధాన ఆర్థిక సూచీలు సానుకూలంగానే ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ద్రవ్యోల్బణం అనుమతించిన కనిష్ట స్థాయికి దిగువన కొనసాగుతుండగా... నిరుద్యోగం క్రమంగా తగ్గుముఖం పడుతోందని, ఎగుమతులు కూడా స్థిరంగా మెరుగుపడుతున్నట్లు ప్రభుత్వం చెప్పుకొచ్చింది. వాణిజ్య రంగానికి బలమైన రుణ ప్రవాహం కొనసాగుతుండటంతో ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉన్నాయని, పట్టణ ప్రాంతాల్లో వినియోగం పెరుగుతుండటం వల్ల ఆర్థిక వృద్ధికి మరింత ఊతం లభిస్తోందని ప్రభుత్వం గొప్పగా చెబుతోంది.

మద్యం ప్రియులను ఇంటిదగ్గర దించుతాం

కర్నాటక మంత్రి పరమేశ్వర

బెంగళూరు: నూతన సంవత్సర వేడుకల్లో మునిగిపోయి మితిమీరి మద్యం సేవించినవారితో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసేందుకు కర్నాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విచ్చలవిడిగా తాగిన వారిని తమ ఇళ్ల దగ్గర దింపుతామని రాష్ట్ర హోంమంత్రి జి.పరమేశ్వర వెల్లడించారు. బెంగళూరు పోలీసులు ఈ బాధ్యతలు చూసుకుంటారని చెప్పారు. ప్రతి ఒక్కరిని ఇంటివద్ద వదలడం వీలుకాదు కాబట్టి... మత్తు దిగేవరకు వారిని ఉంచడానికి 15 ప్రాంతాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. తాగినమైకంలో అసభ్యంగా ప్రవర్తించేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బార్లు, పబ్‌లో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. 'కొన్ని జిల్లాలతో సమస్య లేదు కానీ... రద్దీ ఎక్కువగా ఉండే బెంగళూరు, మైసూర్, హుబ్బళి, బెలగావి, మంగళూరులో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశాం' అని మంత్రి చెప్పారు. ఈ ఏర్పాట్లపై ఇప్పటికే డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మాట్లాడారు. 'ట్రాఫిక్, మహిళల భద్రతను దృష్టిపెట్టుకొని బెంగళూరు వ్యాప్తంగా 20 వేలమంది పోలీసు సిబ్బందిని మోహరించాం. వారిలో ప్రత్యేకంగా శిక్షణ పొందిన మహిళా బృందం కూడా ఉంది. అధునాతన సాంకేతికతను వినియోగిస్తున్నాం' అని డీకే వెల్లడించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

యూరియా సరఫరాపై నిరంతర పర్యవేక్షణ : మంత్రి తుమ్మల

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో ఎరువుల సరఫరాపై ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణ చేపడుతోందని, అన్ని జిల్లాల్లో సమృద్ధిగా నిల్వలు ఉన్నప్పటికీ రైతులలో అనవసర ఆందోళనలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రబీ సీజన్‌కు అవసరమైన మొత్తం 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాలో ఇప్పటికే సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేసినట్లు మంత్రి తెలిపారు. గత సంవత్సరం డిసెంబర్ నెల అమ్మకాలతో పోలిస్తే, ఈ డిసెంబర్‌లో రైతులు లక్ష మెట్రిక్ టన్నుల మేరకు అదనంగా యూరియా కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో గత ఏడాది రబీ సీజన్‌లో 79.54 లక్షల ఎకరాల్లో పంటలు సాగవగా, ఈ సంవత్సరం ఇప్పటివరకు 13.89 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగైనట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఇందులో ప్రధాన పంటలైన వరి 3.94 లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తవగా, మొక్కజొన్న 5.45 లక్షల ఎకరాల్లో సాగైనట్లు తెలిపారు. ప్రస్తుతం దుక్కిలో వేసుకునే డి.ఏ.పీ మరియు కాంప్లెక్స్ ఎరువులను రైతులు అధికంగా కొనుగోలు చేస్తున్నారని, మొక్కజొన్న సాగు చేస్తున్న జిల్లాలలో మరియు కొన్నిచోట్ల రైతులు ముందస్తు జాగ్రత్తగా యూరియా బస్తాలు కూడా కొనుగోలు చేస్తున్నారని మంత్రి చెప్పారు. అయితే ముందుగానే అవసరమైన మేరకు ఎరువులను రాష్ట్రానికి తెప్పించి నిల్వ ఉంచినందున రైతులకు ఎక్కడా కొరత లేకుండా సరఫరా చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని, ఇప్పటికే రైతులకు సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. సొసైటీకి గానీ, రిటైల్ షాప్‌కు గానీ వచ్చే ప్రతి రైతుకూ యూరియా బస్తాలు అందుతున్నాయని చెప్పారు. మండల అధికారులు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, సహాయ సంచాలకులు అన్ని మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా యూరియా సరఫరా చేయాలని మంత్రి ఆదేశించారు. డీలర్ల వద్ద ఉన్న నిల్వల సమాచారాన్ని ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేయాలని, అందరూ ఒకే కేంద్రానికి వచ్చి ఇబ్బందులు పడకుండా మండలాల్లో ఉన్న అన్ని రిటైల్ కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంచాలని సూచించారు. యాప్ అమలవుతున్న జిల్లాలలో యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తడం లేదని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 5 జిల్లాల్లో దాదాపు లక్ష మంది రైతులు యాప్ ద్వారా 3.19 లక్షల యూరియా బస్తాలు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.

ప్రజలకు కలెక్టర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : నూతన సంవత్సరంలో మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ప్రజలు అన్ని రంగాల్లో రాణించి సుఖసంతోషాలతో విలసిల్లాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. ఈ సంవత్సరంలో ప్రతి ఒక్కరూ తమకంటూ ఒక లక్ష్యాన్ని ఏర్పర్చుకొని ప్రణాళికాబద్ధంగా వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. ఆంగ్ల నూతన సంవత్సరం-2026లో ప్రజలు కొత్త ఆలోచనలు, సరికొత్త నిర్ణయాలు, మంచి ఆశయాలతో ముందుకెళ్ళాలని సూచించారు. నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితానికి వారి శ్రేయస్సుతో పాటు ఆనందాన్ని తీసుకువస్తుందని ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలకు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం మరింత ఉన్నతాశయాలను ఏర్పర్చుకొని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. అలాగే ప్రభుత్వం సూచించిన నిబంధనలను పాటిస్తూ కొత్త సంవత్సర వేడుకలను సంయమనంతో జరుపుకోవాల్సిందిగా కలెక్టర్ కోరారు. జిల్లా ప్రజలందరు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అభిలషించారు. కొత్త ఏడాదిలో ఎల్లవేళలా అందరికీ మంచి జరగాలని ఆకాంక్షిస్తూ, కలెక్టర్ మను చౌదరి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పరిశుభ్రనగరంగా గ్రేటర్ హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలి

విశాలాంధ్ర, హైదరాబాద్ : పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా చేపడుతూ... గ్రేటర్ హైదరాబాద్‌ను పరిశుభ్రనగరంగా తీర్చిదిద్దాలని కమిషనర్ ఆర్.వి.కర్ణన్ జోనల్, డిప్యూటీ కమిషనర్‌లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ విభాగం ఇంజనీర్లకు కమిషనర్ ఆర్.వి.కర్ణన్ సూచించారు. బుధవారం గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా చేపట్టిన జీహెచ్ఎంసీ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా మూడోరోజు రోడ్లకు ఇరువైపుల క్లీనింగ్, డివైడర్లు, సెంట్రల్ మీడియం, కెర్బ్‌ల క్లీనింగ్ నిర్వహించారు. శంషాబాద్ జోనల్ పరిధిలో ఆదిభట్ల, కొంగర కలాన్, బోంగుళూరులలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం అమలును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మొదటి రోజు ఫుట్ ఓవర్ బ్రిడ్జి క్లీనింగ్ చేపట్టగా, రెండో రోజు ఫ్లై ఓవర్‌ల క్లీనింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ మాట్లాడుతూ... గ్రేటర్ హైదరాబాద్ నగరంలో పారిశుధ్యం మరింతగా మెరుగుపరచడానికి జోనల్, డిప్యూటీ కమిషనర్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ విభాగం ఇంజనీర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర?న్ ఆదేశించారు. రానున్న రోజుల్లో చెరువులు, నాలాలు,ఫుట్‌పాత్‌లు, పార్కులు, నిర్మాణ-కూల్చివేత వ్యర్థాల తొలగింపు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల వద్ద పేరుకుపోయిన చెత్త తొలగింపు వంటి కార్యక్రమాలు షెడ్యూల్ ప్రకారం పారిశుధ్య కార్యక్రమాలు ప్రభావంతంగా చేపట్టాలన్నారు. క్షేత్ర తనిఖీలో కమిషనర్ వెంట జోనల్ కమిషనర్ చంద్రకళ తదితరులు ఉన్నారు.

అదనపు కమిషనర్‌లు బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర, హైదరాబాద్ : జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్లుగా ఐఏఎస్ అధికారులు జి. శ్రీజన, వినయ్ కృష్ణారెడ్డిలు బుధవారం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ లో బాధ్యతలు స్వీకరించారు. వినయ్ కృష్ణారెడ్డి అదనపు కమిషనర్‌గా మల్కాజిగిరి, ఎల్.బి.నగర్, ఉప్పల్ జోన్లలో కార్యకలాపాలను మానిటరింగ్ చేస్తారు. జి.శ్రీజన అదనపు కమిషనర్‌గా కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి జోన్లలో కార్యకలాపాలను మానిటరింగ్ చేస్తారు. బాధ్యతల స్వీకరణకు ముందు జి.శ్రీజన, వినయ్ కృష్ణారెడ్డిలు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆం. వి.కర్ణన్‌తో కలిశారు.

పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ ధరఖాస్తు గడువు పొడిగింపు

విశాలాంధ్ర, హైదరాబాద్ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ నుంచి ఆపై చదువులు చదువుతున్న అర్హులైన ఎస్సీ విద్యార్థిని విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరంలో పోస్టుమెట్రిక్ (రెన్యువల్/ఫ్రెష్) స్కాలర్‌షిప్ కోసం మార్చి 31, 2026లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి ఉపసంచాలకులు యు.ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తులు https://telanganaepass.cgg.gov.in ద్వారా చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులందరూ దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని కళాశాలల ప్రిన్సిపల్స్ ను ఆయన ఒక ప్రకటనలో సూచించారు.



ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు

విశాలాంధ్ర, హైదరాబాద్ : ప్రతి ఉద్యోగికి తాము అందించిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని అడిషనల్ కమిషనర్ వేణుగోపాల్ అన్నారు. జిహెచ్ఎంసి పరిధిలో వివిధ కేటగిరీలలో పనిచేసిన 9 మంది ఉద్యోగులకు ఉద్యోగ వయోపరిమితి పూర్తయిన నేపథ్యంలో జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం పదవీ విరమణ వీడ్కోలు సభను నిర్వహించి, వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ వేణుగోపాల్ మాట్లాడుతూ... పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులందరూ తమ ఉద్యోగ జీవితంలో ఎంతో నిబద్ధత, అంకిత భావంతో సేవలందించారన్నారు. వారి కృషి, అందించిన సేవలు తమ సహచర ఉద్యోగులకు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. రిటైర్మెంట్ అన్నది జీవితంలో కొత్త అధ్యాయం లాంటిదని, రిటైర్మెంట్ పొందిన వారు వారి కుటుంబ సభ్యులతో సమయం గడుపుతూ, తమ ఆసక్తులకు ప్రాధాన్యం ఇస్తూ ఆరోగ్యంతో, ఆనందంగా గడపాలని ఆయన సూచించారు. వారి మున్ముందు జీవితం ఆయురారోగ్యాలతో ఆనందంగా గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.ఆర్.ఓ దశరథం, ఏ.ఎం.సి శారద, పర్యవేక్షకులు మహేశ్వరి, సహ ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పూర్తి స్థాయిలో కృషి

45 సభ్యులతో డీసీసీ పునర్వ్యవస్థీకరణ, ఆన్‌లైన్ దరఖాస్తు పోర్టల్ ప్రారంభం

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్‌లో తన సంస్థాగత బలాన్ని మరింత పెంచేందుకు కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ)కి కొత్తగా 45 మంది సభ్యులతో కూడిన నిర్మాణాన్ని ప్రకటించింది. ఆసక్తి ఉన్న అభ్యర్థుల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియను కూడా ప్రారంభించింది. ఇది సమావేశిత్వం, సాంకేతికత ఆధారిత విధానానికి సూచనగా భావించవచ్చు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ, హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు సయ్యద్ ఖాలిద్ సైపుల్లా మాట్లాడుతూనగరంలో కాంగ్రెస్‌కు బలమైన మద్దతుదారులు ఉన్నప్పటికీ, పునాది స్థాయిలో సంస్థాగత బలం స్థిరంగా లేకపోయిందని అన్నారు. 'ఇప్పుడు మా పూర్తి దృష్టి సంస్థను తిరిగి బలంగా నిర్మించడంపైనే ఉంది. కాంగ్రెస్ విలువలకు కట్టుబడి, చురుకైన, అంకితభావంతో పనిచేసే బృందాన్ని మేము కోరుకుంటున్నాం, అని తెలిపారు. ఈ కొత్త డీసీసీ నిర్మాణం దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంస్థాగత బలోపేత కార్యక్రమంలో భాగంగా రూపొందించబడుతోంది. ఇది హైదరాబాద్‌లోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు బహదూర్‌పురా, చంద్రయణగుట్ట, చార్మినార్, మలక్‌పేట్, యాకుత్‌పురా అలాగే పది బ్లాకులను కవర్ చేస్తుంది. ఈ నిర్మాణంలో 1 ట్రెజరర్, 5 ప్రతినిధులు (స్పోక్‌పర్సన్స్), 10 ఉపాధ్యక్షులు, 5 ప్రధాన కార్యదర్శులు, 9 కార్యదర్శులు, 15 కార్యనిర్వాహక కమిటీ సభ్యులు ఉంటారు. కోర్ టీమ్‌తో పాటు, జిల్లా మొత్తం మీద పార్టీ కార్యకలాపాలు చురుకుగా సాగేందుకు 44 మంది డివిజన్ అధ్యక్షులను నియమించనున్నారు. ఈ కొత్త ప్రణాళిక కింద 44 డివిజన్లలో కాంగ్రెస్ కార్యకలాపాలకు కొత్త ఊపు రానుంది. ఎంపిక ప్రక్రియను సులభతరం చేయడానికి మరియు ఎక్కువ మంది పాల్గొనేలా చేయడానికి ఆన్‌లైన్ దరఖాస్తు పోర్టల్‌ను ప్రారంభించారు. దరఖాస్తు లింక్ https://join.hyderabadcongress.in/dcc జనవరి 4 వరకు అందుబాటులో ఉంటుంది. పార్టీ సభ్యులు దరఖాస్తు చేయాలని, అలాగే ఈ లింక్‌ను ఇతరులతో పంచుకొని విస్తృత భాగస్వామ్యం మరియు ప్రతినిధిత్వం కల్పించాలని కోరారు. ఎంపిక పూర్తిగా ప్రతిభ ఆధారంగా జరుగుతుందని ఖాలిద్ సైపుల్లా స్పష్టం చేశారు. అంకితభావం, నిజాయితీ, మరియు కాంగ్రెస్ పార్టీ పట్ల దీర్ఘకాలిక కట్టుబాటు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. 'హైదరాబాద్ ఆత్మను ప్రతిబింబించేలా, కాంగ్రెస్ విలువలను ప్రతినిధ్యం చేసే బలమైన, విభిన్న బృందాన్ని మేము నిర్మించాలనుకుం టున్నామన్నారు. డీసీసీ పునర్నిర్మాణ ప్రక్రియను పర్యవేక్షించేందుకు నియమితులైన ఏఐసీసీ పరిశీలకులు మొహమ్మద్ జవీద్ మరియు సుబ్రమణ్యం మహిళలు, యువత, ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనారిటీ వర్గాలకు తగిన ప్రతినిధిత్వం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కొత్త డీసీసీలో మహిళలకు తప్పనిసరిగా 20%-%25 శాతం ప్రతినిధిత్వం ఇవ్వాలని వారు సిఫార్సు చేశారు. ఈ పునర్వ్యవస్థీకరణ మరియు డిజిటల్ అవుట్‌రీచ్ ద్వారా, హైదరాబాద్‌లో పట్టణ స్థాయిలో కాంగ్రెస్ ఉనికిని తిరిగి బలోపేతం చేయడం, పునాది స్థాయిలో కేడర్ నెట్‌వర్క్‌ను మళ్లీ నిర్మించడం పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది.

సీపీగా డాక్టర్ రమేశ్ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: సైబరాబాద్ పోలీస్ కమీషనర్‌గా 2005 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ ఎం. రమేశ్, ఐపీఎస్., ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ప్రొవిజనింగ్ అండ్ లాజిస్టిక్స్, పోలీస్ ట్రాన్స్ పోర్ట్ ఆర్గనైజేషన్ ఐజీ గా పని చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతలను కాపాడడం, పారదర్శకత, ప్రజా పోలిసింగ్, ప్రజలందరికీ నిష్పక్షపాతంగా సేవలు అందించడానికి అధిక ప్రాధాన్యాన్ని ఇస్తామన్నారు. రానున్న నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 'జీరో ఇన్సిడెంట్ డే' గా జరుపుకోవాలన్నారు.

జాతివివక్ష మానవత్వానికే గొడ్డలిపెట్టు

కఠినమైన జాతీయ వివక్ష వ్యతిరేక చట్టాలు తీసుకురావాలి : కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : జాతివివక్ష అనేది మానవత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఘోరమైన నేరమని, ఇది భారత రాజ్యాంగ విలువలకే విఘాతమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు తీవ్రంగా ఖండించారు. జాతివివక్ష ఏ రూపంలో ఉన్నా దానిని సహించకూడదని ఆయన స్పష్టం చేశారు. డెహ్రాడూన్‌లో త్రిపురకు చెందిన ఎంబీఏ విద్యార్థిని ఏంజెల్ చక్మా దారుణ హత్యను ప్రస్తావిస్తూ.. ఈ ఘటన పట్ల కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వివక్ష, అధికార దుర్వినియోగం కలిస్తే ఎంతటి ఘోరమైన పరిణామాలు ఎదురవుతాయో ఈ సంఘటన గుర్తు చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి నేరాలు కేవలం విడిగా జరిగిన సంఘటనలు కావని, ద్వేషాన్ని, వివక్షను సహించడం వల్ల కలిగే ముప్పుకు ఇవి ఒక హెచ్చరిక అని పేర్కొన్నారు. "భారతదేశం ఇటువంటి విషాన్ని భరించలేదు," అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. "భిన్నత్వంలో ఏకత్వం అనే పునాదిపై నిర్మించబడిన మన దేశం, ఇలాంటి విద్వేషాలను భరిస్తూ మనుగడ సాగించలేదు. న్యాయం అందించడంలో ఎటువంటి రాజీ ఉండకూడదు. జాతివివక్ష అది ప్రత్యక్షంగా ఉన్నా లేదా పరోక్షంగా ఉన్నా.. దానిపై 'జెరో టాలరెన్స్' (కఠిన వైఖరి) పాటించాలని కెటిఆర్ అన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వంపై నైతిక మరియు రాజ్యాంగపరమైన బాధ్యత ఉందని కేటీఆర్ గుర్తు చేశారు. జాతి వివక్షతో కూడిన మాటలు, ప్రవర్తన మరియు రెచ్చగొట్టే చర్యలను నేరంగా పరిగణిస్తూ కఠినమైన, స్పష్టమైన చట్టాలను తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. తక్షణ అరెస్టులు, విచారణ మరియు శిక్షలు పడేలా చట్టంలో నిబంధనలు ఉండాలని కోరారు. "చట్టం తన పని తాను చేయాలి, బాధ్యత అనేది పక్షపాతంగా ఉండకూడదు," అని ఆయన నొక్కి చెప్పారు. భారత రాజ్యాంగం పౌరులందరికీ సమానత్వం మరియు గౌరవాన్ని వాగ్దానం చేసిందని, జాతి వివక్ష నుండి పౌరులను రక్షించడం అనేది కేవలం శాంతిభద్రతల సమస్య మాత్రమే కాదని, అది దేశం యొక్క మానవ హక్కుల నిబద్ధతకు నిదర్శనమని కేటీఆర్ అన్నారు. "వివక్షను పెంచి పోషిస్తే అది వ్యవస్థలను భ్రష్టు పట్టించి, ప్రాణాలను ప్రమాదంలో పడేస్తుంది," అని ఆయన హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం కేవలం మాటలతో సరిపెట్టకుండా.. ఇలాంటి నేరాలు మళ్లీ పునరావృతం కాకుండా కఠినమైన చట్టపరమైన రక్షణలు, పకడ్బందీ అమలు చేయాలని కోరారు.

మొదటి గంటలోపు గోల్డెన్ అవర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : రోడ్డు ప్రమాద బాధితులకు మొదటి గంటలోపు (గోల్డెన్ అవర్) వైద్య సహాయం అందిస్తే, ప్రస్తుత రోడ్డు ప్రమాద మరణాలు చాలా వరకు తగ్గుతాయని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న జాతీయరోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ మిని మీటింగ్ హాల్ లో ఏర్పాటు చేసిన జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశానికి రోడ్డు సేఫ్టీ డిసిపి మనోహర్‌తో కలిసి అదనపు కలెక్టరు హాజరైనారు. జిల్లాలోని సమస్యాత్మకమైన, మరమ్మత్తులు అవసరమైన రోడ్ల వివరాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అదనపు కలెక్టరు తెలుసు కున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులకు మొదటి గంటలోపు (గోల్డెన్ అవర్) వైద్య సహాయం అందిస్తే, రోడ్డు ప్రమాద మరణాలు చాలా వరకు తగ్గుతాయని అన్నారు. ప్రమాదంలో గాయపడిన వారిని మొదటి గంటలో ఆసుపత్రికి చేర్చిన వారికి 25 వేల నగదు బహుమతితోపాటు (రాహ్ వీర్) ప్రశంసాపత్రాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. గత సమావేశంలోని సమస్యలను ఎంత వరకు పరిష్కరించారు, ఇంకాఎన్ని పెండింగ్ లో ఉన్నవి అని సంబంధిత అధికారులను, మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చోట ఎలక్ట్రిక్ పోల్స్ ను షిఫ్ట్ చేసిరోడ్డు విస్తీర్ణం పెంచాలని, రోడ్డు ఇరు వైపుల ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టరు ఆదేశించారు. జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి అక్కడ అవసరమైన నివారణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్ల పై వర్షం నీరు నిలువకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్ల పై ఎక్కువ ప్యాచ్ వర్క్ చేయకుండా అవసరమైన మేరకు కొత్త రోడ్లను నిర్మించాలని తెలిపారు. రోడ్ సేఫ్టి డిసిపి మనోహర్ మాట్లాడతూ రోడ్డు ప్రమాద బాధితులకు 7రోజుల వరకు నగదు రహిత ఉచిత వైద్య చికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులలో గోల్డెన్ అవర్‌లో చికిత్స అందించి బాధితుల ప్రాణాలు కాపాడటమే ప్రధాన లక్ష్యమన్నారు. ఈ అంశాల పై ప్రజలలో అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆర్.టి.ఎ కమిటి సభ్యులు జయ్ పాల్ రెడ్డి మాట్లాడుతూరోడ్డు భద్రత మాసోత్సవాల పై ప్రజలకు అవగహాన కల్పించాలని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. హాకీంపేట, తూంకుంటలో బ్లాక్ స్పాట్స్ ను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బిఈఈ శ్రీనివాస మూర్తి, పోలీస్, ట్రాఫిక్ అధికారులు, నేషనల్ హై వే, వైద్య, విద్యా, టిజిఆర్టిసి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కమిషనర్‌ను కలిసిన రాగం

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి జిహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ హేమంత్ భోర్కడేని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించిన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ . అనంతరం డివిజన్ లోని పెండింగ్ పనులను అలాగే చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులను త్వరగా పూర్తయ్యేలా అధికారులను ఆదేశించాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రాజు యాదవ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రజల జీవితాల్లో శాంతి, సౌభాగ్యం, సమృద్ధి నింపాలి : మహేష్ గౌడ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజల జీవితాల్లో శాంతి, సౌభాగ్యం, సమృద్ధి నింపాలని ఆకాంక్షించారు. గత ఏడాది ప్రజాస్వామ్య విలువలను మరింత బలపరిచేలా, సామాజిక న్యాయం, సంక్షేమం, అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగిన సంవత్సరమని పేర్కొన్నారు. ముఖ్యంగా రైతులు, కార్మికులు, మహిళలు, యువత ఆశలు నెరవేర్చే దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చాయని అన్నారు. పేదల సంక్షేమం, విద్య, వైద్య సేవల విస్తరణ, ఉపాధి అవకాశాల కల్పన వంటి రంగాల్లో చేపట్టిన చర్యలు కొత్త ఆశలను రేకెత్తించాయని వివరించారు. కొత్త సంవత్సరంలో తెలంగాణ మరింత ప్రగతి పథంలో సాగాలని, గ్రామాల నుంచి పట్టణాల వరకూ సమాన అభివృద్ధి జరగాలని కోరారు. రైతులకు న్యాయం, యువతకు ఉపాధి, మహిళలకు భద్రత, సామాజిక వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని స్పష్టం చేశారు. ప్రజల భాగస్వామ్యంతో పాలన మరింత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా కొనసాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే, రాష్ట్ర అభివృద్ధికి ప్రజలంతా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. కుల, మత, ప్రాంత భేదాలకు అతీతంగా సమైక్యతతో ముందడుగు వేస్తేనే బలమైన తెలంగాణ సాధ్యమని అన్నారు. నూతన సంవత్సరంలో ప్రతి కుటుంబానికి ఆనందం, ఆరోగ్యం, ఆర్థిక భద్రత కలగాలని ఆకాంక్షిస్తూ, రాష్ట్ర ప్రజలందరికీ మరోసారి హృదయపూర్వక నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ముఖ్యమంత్రి నూతన సంవత్సర శుభాకాంక్షలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్? 2047 లక్ష్య సాధన దిశగా ఈ ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం మరింత ముందుకు సాగుతుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులతో పాటు మహిళలు, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని గుర్తు చేశారు. కొత్త సంవత్సరంలో ప్రతి కుటుంబం తాము ఆశించిన ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని, ప్రజలందరూ ఆనందంతో, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర ప్రజలందరికీ మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు

విశాలాంధ్ర - హైదరాబాద్ :రాష్ట్ర ప్రజలకు రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.2025 సంవత్సరంలోని తీపి జ్ఞాపకాలు, సాధించిన అంశాలను ,ఈ 2026 నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరికి మరిన్ని విజయాలు సాధించాలని ప్రార్థించారు. కొత్త సంవత్సరం ప్రతి కుటుంబానికి ఆరోగ్యం, ఆనందం, శాంతి, సమృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు.ప్రజా పాలన ప్రభుత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో యువతకు మరిన్ని అవకాశాలు పెరిగి, రైతులు, కార్మికులు, మహిళలు, విద్యార్థులు అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ముందుకు సాగాలని కోరుకుంటున్నాను. అందరం ఐక్యతతో, ఆశావహ దృక్పథంతో కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ, రాష్ట్ర ప్రగతికి కలిసికట్టుగా కృషి చేద్దామని పేర్కొన్నారు.

జీహెచ్ఎంసీ రికార్డు విజయాలు

విశాలాంధ్ర, హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) 2025 సంవత్సరంలో పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ప్రజారోగ్యం, మౌలిక వసతులు, పర్యావరణ పరిరక్షణ రంగాల్లో కీలక విజయాలు సాధించిందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. స్వచ్ఛతే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం, జీహెచ్ఎంసీ చేపట్టిన చర్యల వల్ల స్వచ్ఛసర్వేక్షణ-2025లో దేశవ్యాప్తంగా 6వ ర్యాంకు, 7 స్టార్ గార్బేజ్ ఫ్రీ సిటీ గుర్తింపు, వాటర్ ప్లస్, ఓడీఎఫ్ రీ-సర్టిఫికేషన్‌తో పాటు 'ప్రామిసింగ్ స్వచ్ఛ హర్-తెలంగాణ' అవార్డు హైదరాబాద్‌కు దక్కిందని కమిషనర్ పేర్కొన్నారు.

వ్యర్థాల నిర్వహణలో ఆధునిక సదుపాయాలు...

జవహర్‌నగర్‌లో 24 మెగావాట్ల ఆర్‌డిఎఫ్ ఆధారిత వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ (ఫేజ్-2), రోజుకు 1000 టన్నుల సామర్థ్యం గల ఆర్‌డిఎఫ్ తయారీ యూనిట్ ప్రారంభించినట్లు తెలిపారు. ఖైతలాపూర్‌లో 300 టన్నుల బయో-మెథనేషన్ ప్లాంట్, బయో-సీఎన్‌జీ ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా నగర వ్యర్థాల ప్రాసెసింగ్ సామర్థ్యం రోజుకు 10 వేల టన్నులకు చేరిందన్నారు. పారిశుధ్య నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 10,752 చలాన్లు జారీ చేసి రూ.2.34 కోట్ల జరిమానా వసూలు చేసినట్లు తెలిపారు. పారిశుద్యానికి సంబంధించిన ఫిర్యాదుల్లో 99 శాతం పైగా పరిష్కారం జరిగిందన్నారు.

మెగా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్...

పారిశుద్ధ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు నగరం అంతటా మెగా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టామని, ప్రస్తుతం ఇది మూడో రోజుకు చేరిందని కమిషనర్ తెలిపారు. ఈ డ్రైవ్‌లో భారీ చెత్త, లెగసీ వ్యర్థాలు, నిరుపయోగ వాహనాల తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరుతూ, భారీ చెత్త లేదా నిరుపయోగ వాహనాల సమాచారం కోసం జీహెచ్ఎంసీ వాట్సాప్ నంబర్ 81259 66586, కాల్ సెంటర్ 040-2111 1111, లేదా సంబంధిత వార్డు/సర్కిల్ ఫీల్డ్ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

ప్రజారోగ్యంలో పురోగతి...

2025లో డెంగ్యూ కేసులు 2024తో పోలిస్తే 30 శాతం తగ్గి 2,806 నుంచి 1,977కు చేరాయని తెలిపారు. ఆహార భద్రత చర్యల్లో భాగంగా వేలాది తనిఖీలు నిర్వహించి, నిబంధనల ఉల్లంఘనపై జరిమానాలు విధించినట్లు వివరించారు.

మౌలిక వసతులు-ఇంజినీరింగ్ పనులు...

2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.2,706 కోట్ల వ్యయంతో 9,993 ఇంజినీరింగ్ పనులు చేపట్టామని, వీటిలో రూ.1,023 కోట్ల విలువైన 4,872 పనులు పూర్తయ్యాయని తెలిపారు. రహదారుల అభివృద్ధి, స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్, ఫ్లైఓవర్లు, రోడ్ ఓవర్ బ్రిడ్జ్‌ల నిర్మాణంతో నగర మౌలిక వసతులు మరింత బలపడ్డాయని పేర్కొన్నారు.

డిజిటల్ గవర్నెన్స్, ఆదాయ వృద్ధి... డ్రోన్ సర్వే ఆధారిత జిఎస్ఐ మ్యాపింగ్, ఆస్తి పన్ను సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. 2025 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు రూ.1,512 కోట్ల ఆస్తి పన్ను వసూలు జరిగిందని, ఇది గత ఏడాదితో పోలిస్తే 8 శాతం అధికం అని వెల్లడించారు.

పర్యావరణం-పట్టణ జీవ వైవిధ్యం...

వనమహోత్సవంలో 25 లక్షల మొక్కలు నాటడం, 40 కొత్త పార్కుల అభివృద్ధి, కేంద్ర డివైడర్లు, ఫ్లైఓవర్ల సుందరీకరణతో నగరానికి హరిత శోభ పెరిగిందని తెలిపారు. పౌరుల భాగస్వామ్యమే విజయానికి మార్గం 27 పట్టణ స్థానిక సంస్థల విలీనంతో జీహెచ్ఎంసీ పరిధి 300 వార్డులు, 60 సర్కిళ్లు, 12 జోన్లకు విస్తరించిందని పేర్కొంటూ, "నగరాన్ని శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచాలంటే ప్రజల సహకారం తప్పనిసరి. పారిశుధ్యం ప్రతి ఒక్కరి బాధ్యత" అని కమిషనర్ ఆర్.వి. కర?న్ పిలుపునిచ్చారు.

జాతరకు అన్ని ఏర్పాట్లు : ఎమ్మెల్యే కేపీ

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: చిత్తరమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 - జీడిమెట్ల డివిజన్ పెట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గాజులరామారం చిత్తారమ్మ దేవాలయం కమిటీ సభ్యులు బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు.జనవరి 23 నుంచి నిర్వహించే చిత్తారమ్మ జాతర ఏర్పాట్లపై వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా జాతర సమయంలో గుడి ఆవరణలో వీధి దీపాలతో పాటు ఫ్లడ్ లైట్ ల ఏర్పాటు,పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా అంటువ్యాధులు ప్రబలకుండా గేమాక్సిన్ పౌడర్ చల్లించడంతోపాటు భక్తులకు వాటర్ ట్యాంకర్లతో మంచినీటిని అందించేలా ఏర్పాట్లు కల్పించాలని కోరారు.అనంతరం బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని అతిపెద్ద జాతర్లలో చిత్తారమ్మ దేవాలయం జాతర ఒకటని,ప్రతి ఏడు మాదిరిగానే ఈ సంవత్సరం కూడా జాతరను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లను ఏర్పాటు చేద్దామని,త్వరలోనే అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించి జాతర విజయవంతంకు కావలసిన అన్ని ఏర్పాట్లను పూర్తిచేసి జాతరను జయప్రదం చేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్య గౌడ్,కమిటీ సభ్యులు నరసింహ,కూన హరి గౌడ్,డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి,మాజీ పాక్స్ డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్,సీనియర్ నాయకులు సంపత్ మాధవ రెడ్డి, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర, మల్కాజిగిరి : మల్కాజిగిరి మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను బుధవారం మిర్జాల్‌గూడలో గల ఎస్వీ కన్వెన్షన్ హాల్లో మున్నూరు కాపు సంఘం ప్రతినిధి ఆదం విజయ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదం విజయ్ కుమార్ మాట్లాడుతూ మున్నూరు కాపులు అన్ని రంగాలలో రాణించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం మల్కాజిగిరి అధ్యక్షులు గుండా నిరంజన్, ప్రధాన కార్యదర్శి శశాంక్, రాములు, జ్ఞానేశ్వర్, మల్లికార్జున్, తోట కృష్ణ, సిరిగిరి రాజు, శ్రీకాంత్, రఘువీర్, నరేష్, గుండా నరేందర్, శశికాంత్, మధు, హరీష్, కిషోర్, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర, హైదరాబాద్ : జలమండలిలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల, కార్మికుల బదిలీలు, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర ఉపాధ్యక్షులు, హెచ్ఎండబ్ల్యూఎస్, ఎస్.బి కార్మిక సంఘాల జెఏసి చైర్మన్ మొగుళ్ళ రాజిరెడ్డి విజ్ఞప్తి చేసారు. హైదరాబాద్, ఖైరతాబాద్ జలమండలి కార్యాలయంలో బుధవారం హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డ్, ఎండీ, కే.అశోక్ కుమార్ రెడ్డిను కలసి మొగుళ్ళ రాజిరెడ్డి విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. క్షేత్రస్థాయిలో జల సంరక్షణలో ప్రజలు, సంఘాలు, కార్పొరేట్ సంస్థలను భాగస్వాములను చేసే లక్ష్యంతో ప్రారంభించిన జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన హైదరాబాద్ మెట్రో నీటి సరఫరా, మురుగునీటి బోర్డు మున్సిపల్ కార్పొరేషన్ల విభాగంలో రెండో ర్యాంకు సాధించి, జాతీయ అవార్డును స్వీకరించినందుకు కే.అశోక్ కుమార్ రెడ్డిని అభినందించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసారు. 3 లక్షల రూపాయల హెల్త్ ఇన్సూరెన్స్‌ను పెంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్న 10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్‌ను జలమండలి ఉద్యోగులకు కూడా వర్తింపజేయాలని, అలాగే 20 ఏళ్ళు పైబడి పనిచేస్తున్న వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డ్, గార్డెనింగ్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, జలమండలిలో ఉద్యోగ సంఘాల గుర్తింపు ఎన్నికలను వెంటనే నిర్వహించాలని కే.అశోక్ కుమార్ రెడ్డి ని కోరారు. అనంతరం మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ 2014 నుండి పెండింగ్‌లో ఉన్న జలమండలి కార్మికుల అనేక సమస్యలు పలు సార్లు ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, అయన ప్రత్యేక చొరవ తీసుకొని చాల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేసాడని, ఇంకా పెండింగ్‌లో ఉన్న కొన్ని సమస్యలను కూడా హెచ్ఎండబ్ల్యూఎస్, ఎస్.బి కార్మిక సంఘాల జెఏసి పరిష్కరించడానికి పోరాటాలు చేస్తూనే ఉన్నదని తెలిపారు. ఈ సందర్భంగా జలమండలి ఉద్యోగ, కార్మికులందరికీ 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్య నగర్, సుభాష్ చంద్రబోస్ నగర్, భిక్షపతి నగర్, కృష్ణ నగర్,శిల్ప హిల్స్, ఇజ్జత్ నగర్,అయ్యప్ప సొసైటీ, మాతృ శ్రీ నగర్, సైబర్ హిల్స్, హనుమాన్ నగర్,జూబ్లీ గార్డెన్, దీప్తి హిల్స్ ,నవ భారత్ నగర్, సిద్ధివినాయక నగర్ కాలనీలలో రూ. 14 కోట్ల 35 లక్షల 40 వేల రూపాయలతో నూతనంగా చేపట్టబోయే , సీసీ రోడ్ల, రోడ్లు, స్మశానం వాటికలు, వరద నీటి కాల్వ నిర్మాణము పనులకు కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ గౌడ్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గం, కాలనీ ల అభివృద్దే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం ఆదిత్య నగర్, సుభాష్ చంద్రబోస్ నగర్, భిక్షపతి నగర్,కృష్ణ నగర్,శిల్ప హిల్స్, ఇజ్జత్ నగర్,అయ్యప్ప సొసైటీ, మాతృ శ్రీ నగర్, సైబర్ హిల్స్,హనుమాన్ నగర్,జూబ్లీ గార్డెన్, దీప్తి హిల్స్ ,నవ భారత్ నగర్, సిద్ధివినాయక నగర్ కాలనీలలో రూ. 14 కోట్ల 35 లక్షల 40 వేల రూపాయలతో నూతనంగా చేపట్టబోయే, సీసీ రోడ్ల, రోడ్లు, స్మశానం వాటికలు, వరద నీటి కాల్వ నిర్మాణము పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగినది అని, సీసీ, బీటీ రోడ్ల పనులకు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, కాలనీ వాసులకు ఉపశమనం లభించింది అని, మౌళిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తానని అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ,అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని ,మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానన్నారు. పైన పేర్కొన్న సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, స్మశాన వాటికల అభివృద్ధి పనులకు,వరద నీటి కాల్వ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేయడం జరిగినది అని గాంధీ తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు,మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి : కమిషనర్

విశాలాంధ్ర-దుండిగల్: దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో పనిచేస్తున్న పర్మినెంట్,ఔట్ సోర్స్ ఉద్యోగులంతా సమయం పాటించి విధుల్లో చేరాల్సిందేనని జిహెచ్ఎంసి కమిషనర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాలను జారీ చేశారు. కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ గా శనివారం బాధ్యతలు స్వీకరించిన సందీప్ కుమార్ ఝా బుధవారం మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయంలో ఆయన అన్ని విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిహెచ్ఎంసి కమిషనర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ముఖ్యమైన,అవసరమైన ఫైళ్లను కార్యాలయంలోనే జాగ్రత్తగా భద్రపరచాలన్నారు.కార్యాలయ ఆవరణతోపాటు మరుగుదొడ్లను కూడా పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.కార్యాలయంలోకి గాలి,వెలుతురు సక్రమంగా వచ్చేలా ఏర్పాట్లు చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.ఉద్యోగులు,సిబ్బంది పనిచేసేందుకు అవసరమైన వాతావరణం ఉండేలా జాగ్రత్త వహించాలని వ్యక్తం చేశారు.కార్యాలయంలోని ఖాళీ ప్రదేశాల్లో మంచి నీడను ఇచ్చే మొక్కలను నాటాలని శానిటేషన్ విభాగం అధికారులకు తెలిపారు.ప్రజలకు నాణ్యమైన జీవన పరిస్థితులు కల్పించడంతోపాటు,వారి సమస్యలను ప్రత్యక్షంగా గుర్తించేందుకు కమాండ్ కంట్రోల్ రూమ్ సేవలను వినియోగించుకోవాలన్నారు.ప్రకృతి విపత్తులు,అత్యవసర సమాచారాన్ని నగర ప్రజలకు తక్షణం చేరవేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కమిషనర్ తో పాటు డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్,శానిటేషన్,ఇంజనీరింగ్ విభాగాల అధికారులు,టౌన్ ప్లానింగ్ ఔట్ సోర్స్ సిబ్బంది రాము ఉన్నారు.

డిప్యూటీ కమిషనరేట్ ఏర్పాటుతో పలు మార్పులు : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ ప్రాంతం డిప్యూటీ కమిషనరేట్ ఏర్పాటుతో పలు మార్పులు కేశంపేట మండలం కూడా షాద్ నగర్ పరిధిలోనే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ... ఈ మార్పు కారణంగా నేరాల నిరోధానికి పూర్తి అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. అదేవిధంగా ఇప్పటిదాకా శంషాబాద్ పరిధిలో ఉన్న నియోజక వర్గంలోని కొత్తూరు, నందిగామ మండలాలు షాద్ నగర్ పరిధిలోకే వస్తాయన్నారు. దీనివల్ల అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు దూరం అవుతాయని వెల్లడించారు. అదేవిధంగా కేశంపేట మండలం ఆమనగల్ ఏసీబీ పరిధిలోకి వెళ్లినట్లుగా ప్రచారం జరిగిందని, ఇది వాస్తవం కాదని అన్నారు. మొదట పోలీసు శాఖ ఆ విధంగా రూట్ మ్యాప్ ఏర్పాటు చేసినప్పటికీ తాను అభ్యంతరం చెప్పడం జరిగిందన్నారు. ప్రస్తుతం కేశంపేట కూడా షాద్ నగర్ కమిషనరేట్ పరిధిలోకి వస్తుందని వెల్లడించారు. దీనివల్ల పోలీసులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి విలువైన సేవలు అందిస్తారని ఆయన స్పష్టం చేశారు.షాద్ నగర్ పారిశ్రామిక ప్రాంతంగా, వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెంది ఉండటం వల్ల నేరాలకు అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. అదేవిధంగా 44వ నెంబరు జాతీయ రహదారి ఉండడం వల్ల రోడ్డు ప్రమాదాలకు కూడా ఆస్కారం ఎక్కువగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో పోలీసు శాఖ మరింత పటిష్టం కావడం వల్ల నేరాలను, ఘోరాలను నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. నియోజకవర్గాన్ని నేరాలకు దూరంగా ప్రశాంతంగా ఉంచడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. తమ మనసులో ఉన్న సమస్యను తాము అడగకముందే తీర్చి ఊరట కలిగించారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు మాజీ జెడ్పిటిసి తాంద్ర విశాల, శ్రవణ్ రెడ్డిలు కృతజ్ఞతలు తెలిపారు. కేశంపేట మండలం ఆమనగల్ ఏసిపి పరిధిలోకి వెళుతుందన్న దీనివల్ల ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, ఈ ప్రయత్నాన్ని ఆపాలని చెప్పేందుకు వారు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను కలుసుకున్నారు. అయితే అంతకుముందే ఎమ్మెల్యే పోలీస్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించినట్లు చెప్పడంతో ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

యూరియా పంపిణీకి చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర ప్రతినిధి - రంగారెడ్డి : జిల్లాలో యూరియా పంపిణీ సజావుగా నిర్వహించడానికి తీసుకోవలసిన చర్యలు పై అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ చంద్రా రెడ్డి ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారులు డివిజనల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లాకు నోడల్ ఆఫీసర్గా నియమించబడిన ఆశకుమారి, (జాయింట్ డైరెక్టర్, కమిషనర్ కార్యాలయం), జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా కోపరేటివ్ అధికారి మరియు డిఎం మార్కెడ్‌లు పాల్గొన్నారు.ఈ సమావేశంలో, అడిషనల్ కలెక్టర్ వీడియో కాన్ఫరేస్ ద్వారా వ్యవసాయ శాఖ మాత్యులు మరియు రాష్ట్ర చీఫ్ సెక్రటరీ యూరియా పంపిణీ పై ఇచ్చిన ఆదేశాల పై వ్యవసాయ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అవసరమైన యూరియా నిల్వలను ముందుగానే డీలర్లు మరియు పిఎసిఎస్‌ల అమ్మక కేంద్రాలలో ఏర్పాటు చేయాలి. రైతుల రద్దీ ఎక్కువ ఉన్నచోట్ల అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలి. రైతుల సౌకర్యార్థం పిఎసిఎస్ కేంద్రాలలో షామియానాలు ఏర్పాటు చేయాలి. ప్రతి పిఎసిఎస్ లో కనీసం మూడు కౌంటర్లు పనిచేసే విధంగా చూసుకోవాలి. మండల వ్యవసాయ అధికారులు మరియు డివిజనల్ సహాయ వ్యవసాయ అధికారులు యూరియా పంపిణీని నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారులుగా నియమింపబడ్డారు. జిల్లాస్థాయి హెల్ప్ లైన్ నెంబర్లు 040 24547507/040 24547506 మరియు రాష్ట్ర హెల్ప్ లైన్ నెంబర్ 18005995779. యూరియా సరఫరా తగినంతగా మరియు నిరంతరంగా ఉన్నందున రైతులు ఆందోళన చెందకూడదని సూచించారు. భూమి విస్తీర్ణం మరియు పండించిన పంట ఆధారంగా యూరియాని పంపిణీ చేస్తారని తెలియచేశారు.

ప్రజావసరాలకు అనుగుణంగా నూతన పోలీస్ స్టేషన్లు, సబ్ డివిజన్లు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర, పటాన్ చెరువు: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు నియోజకవర్గంలో నూతనంగా చేపడుతున్న పోలీస్ స్టేషన్ల విభజన ప్రక్రియను ప్రజల అవసరాలకు, అభిప్రాయాలకు అనుగుణంగా చేపట్టాలని కోరుతూ రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డిని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఉదయం హైదరాబాదులోని డీజీపీ కార్యాలయంలో డిజిపి శివధర్ రెడ్డితో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలను డిజిపి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా.. పటాన్ చెరువు నియోజకవర్గ కేంద్రంగా పనిచేయాల్సిన ఏసిపి కార్యాలయాన్ని. ఆర్సీపురం పేరుతో ఆర్ సి పురం కేంద్రంగా ఏర్పాటు చేశారని.. దీని మూలంగా స్థానిక ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. పటాన్ చెరువు పట్టణంలో జాతీయ రహదారికి అనుకొని.. ప్రజలందరికీ అనువుగా అధునాతన సౌకర్యాలతో ఇటీవల 40,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో డీఎస్పీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామని.. పనులు సైతం ప్రారంభమయ్యాయని తెలిపారు. నూతన భవనంలో పటాన్చెరు పేరుతో ఏసిపి కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని కొల్లూరు పోలీస్ స్టేషన్ ను నార్సింగి ఏసిపి కార్యాలయం పరిధిలోకి చేర్చారని.. రామచంద్రపురం ఏసిపి పరిధిలోని చందానగర్ పోలీస్ స్టేషన్ కి బదులుగా కొల్లూరు పోలీస్ స్టేషన్ ను చేర్చాలని కోరారు. దీని మూలంగా పరిపాలనా పరంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని తెలిపారు. మినీ ఇండియా గా పేరుందిన బొల్లారం పోలీస్ సర్కిల్ కార్యాలయం తో పాటు పోలీస్ స్టేషన్ ను రద్దు చేసి.. బొల్లారం డివిజన్ ను పూర్తిగా అమీన్పూర్ పోలీస్ సర్కిల్ పరిధిలోకి చేర్చారని.. దీని మూలంగా స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తే పరిస్థితులు ఏర్పడబోతున్నాయని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమల సైతం బొల్లారం పరిధిలో పనిచేస్తున్నాయని డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే బొల్లారం పరిధిలో 17వేల చదరపు అడుగుల సామర్థ్యంతో నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులు సైతం. కొనసాగుతున్నాయని తెలిపారు. బొల్లారం పరిధిలోని పోలీస్ స్టేషన్ ను యధావిధిగా కొనసాగించాలని కోరారు. పటాన్ చెరువు కేంద్రంగా పనిచేసిన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ విభజన ప్రక్రియలో ఇస్నాపూర్ పరిధిలోకి వెళ్లడం జరిగిందని.. పటాన్చెరు కేంద్రంగా నూతన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన డీజీపీ శివధర్ రెడ్డి.. త్వరలోనే ఇందుకు సంబంధించి సానుకూల నిర్ణయాలు తీసుకోవడంతోపాటు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు.

'వర్కర్ టు ఓనర్' పథకం సంక్రాంతి లోపల అమలు చేయాలి : కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : సిరిసిల్ల శాసనసభ్యుడిగా బీఆర్ఎస్ తరపున రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. 'వర్కర్ టు ఓనర్' అనే విప్లవాత్మక కార్యక్రమాన్ని సంక్రాంతి లోపలే వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లుగా ఉద్దేశపూర్వకంగా తాత్సారం చేస్తూ, పూర్తిస్థాయిలో నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించిందని ఆరోపించారు. ఇకనైనా ప్రభుత్వం మొద్దు నిద్ర నుంచి మేల్కొని, సంక్రాంతి లోపలే 'వర్కర్ టు ఓనర్' పథకాన్ని ప్రారంభించాల్సిందే అని స్పష్టం చేశారు. ఈ పథకం సమర్థవంతంగా అమలవ్వాలంటే, గతంలో రూపొందించిన ప్రణాళికలకు అనుగుణంగా పవర్ లూమ్‌లను సబ్సిడీపై కొనుగోలు చేయడానికి అవసరమైన నిధులను వచ్చే బడ్జెట్‌లో పూర్తిస్థాయిలో కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే సంక్రాంతి లోపలే ఆసాముల లిస్టును ఫైనల్ చేసి, అర్హులైన నేత కార్మికులకు లెటర్లు కేటాయించాలి అని కోరారు. ఒకవేళ సంక్రాంతి లోపల ఈ ప్రక్రియ పూర్తిచేయకపోతే, సంక్రాంతి అనంతరం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సిరిసిల్లలోని నేతన్నలందరినీ, నేత కార్మికులందరినీ సమీకరించి ఆందోళనకు దిగుతామన్నారు. కేసీఆర్ ఈ బృహత్తర కార్యక్రమాన్ని కెసిఆర్ ప్రారంభించారని, ఆ కార్యక్రమాన్ని నిర్వీర్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం నేతన్నల వ్యతిరేక విధానాలకు నిరసనగా ఇక్కడే మహా ధర్నా కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. దాదాపు 10,000 మంది నేతన్నలతో సిరిసిల్ల పట్టణం మొత్తం కదిలే స్థాయిలో ఈ ఉద్యమం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను, నేతన్నల జీవితాలను కాపాడేందుకు తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చూపిన దూరదృష్టి, మానవీయత, రాజకీయ సంకల్పం చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. కేసీఆర్ కరీంనగర్ ఎంపీగా ఉన్న 2005లోనే సిరిసిల్ల నేతన్నల దుస్థితిని, వస్త్ర పరిశ్రమలో నెలకొన్న తీవ్ర సంక్షోభాన్ని గుర్తించి స్పందించిన నాయకుడని గుర్తు చేశారు. ఒక్క వారం వ్యవధిలో తొమ్మిది మంది నేతన్నలు ఆత్మహత్య చేసుకున్న ఘటనలతో చలించిపోయిన కేసీఆర్, రాష్ట్ర ప్రభుత్వానికి సోయి రావాలనే ఉద్దేశంతో పార్టీ తరఫున 50 లక్షల రూపాయలను సిరిసిల్ల పద్మశాలి సమాజానికి అందజేసి, నేతన్నలను ఆదుకునే ప్రయత్నం చేశారని తెలిపారు. ఆ రోజే సిరిసిల్లలో కేసీఆర్ "తెలంగాణ వచ్చే వరకు ధైర్యంగా ఉండండి, తెలంగాణ వచ్చిన తర్వాత నేను మిమ్మల్ని ఆదుకుంటాను, కాపాడుకుంటాను" అని ఇచ్చిన మాటను, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్షరాలా నిలబెట్టుకున్నారని బీఆర్ఎస్ స్పష్టం చేసింది. వస్త్ర పరిశ్రమను, ముఖ్యంగా సిరిసిల్ల నేత కార్మికులను కంటికి రెప్పలా కాపాడిన నాయకత్వం కేసీఆర్ దేనని కొనియాడింది. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు 3,400 కోట్ల రూపాయల విలువైన బతుకమ్మ చీరల ఆర్డర్లను అందించి నేతన్నల బతుకులను మార్చడమే కాకుండా, తెలంగాణ ఆడబిడ్డలకు పండుగ కానుకగా చీరలు అందించిన గొప్ప ఆలోచన కూడా కేసీఆర్ దేనని పేర్కొన్నారు. సంవత్సరానికి కోటి మంది మహిళలకు బతుకమ్మ పండుగ సందర్భంగా చీరలు అందించిన ఏకైక ప్రభుత్వం కేసీఆర్ గారి ప్రభుత్వమేనని గుర్తు చేశారు. బతుకమ్మ చీరల పథకం వెనుక ఉన్న లోతైన ఆలోచనను వివరిస్తూ, అప్పటివరకు నేత కార్మికులు నెలకు 8 నుంచి రూ. 10 వేలు సంపాదిస్తూ జీవన కష్టాలు పడుతున్నారని, వారి కుటుంబాల్లో మహిళలు బీడీలు చుడుతూ తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అందుకే బీడీ కార్మికులకు నెలకు 2,000 రూపాయల పెన్షన్‌ను 4.5 లక్షల మందికి అమలు చేయడమే కాకుండా, నేత కార్మికుల ఆదాయం 15-20 వేల రూపాయలకు పెరగాలనే లక్ష్యంతో బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇచ్చారని వివరించారు. ఈ చర్యలతో సిరిసిల్ల దశ తిరిగిందని, నేతన్నలకు స్థిరమైన ఆదాయం లభించిందని పేర్కొన్నారు. తదుపరి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో ఉన్న మూడంచెల వ్యవస్థను అధ్యయనం చేయాలని కేసీఆర్ గారు అధికారులను ఆదేశించారని, కార్మికులు-ఆసాములు-సేట్లు అనే వ్యవస్థలో కార్మికుడు కార్మికుడిగానే మిగిలిపోవాల్సిన పరిస్థితి ఎందుకు ఉండాలని ప్రశ్నిస్తూ, కార్మికుడిని ఆసామిగా మార్చే విప్లవాత్మక ఆలోచనతో 'వర్కర్ టు ఓనర్' కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. ఇది దేశంలోనే కాక, బహుశా ప్రపంచంలోనే ఎక్కడా లేని వినూత్న పథకమని పేర్కొన్నారు. బీడీలు చుడుతూ ఆరోగ్యాన్ని కోల్పోతున్న మహిళలకు మంచి వాతావరణంలో ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో సిరిసిల్ల పట్టణం పక్కనే 200 ఎకరాల్లో అపెరల్ పార్కును, దానికి అనుసంధానంగా వర్కర్ టు ఓనర్ కార్యక్రమాన్ని 400 కోట్ల రూపాయలతో కేసీఆర్ గారు ప్రారంభించారని వివరించారు. దాదాపు 50 షెడ్ల నిర్మాణాలు రెండేళ్ల కిందటే పూర్తయ్యాయని, పవర్ లూమ్‌లను సబ్సిడీపై అందించి కార్మికులనే యజమానులుగా మార్చాలనే అదుతే ఆలోచన దీనిలో ఉందని తెలిపారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని బీఆర్ఎస్ తీవ్రంగా విమర్శించింది. కేసీఆర్ ఆలోచన ప్రకారం నేత కార్మికులు ఆసాములుగా, వర్కర్ ఓనర్లుగా మారాలని, సిరిసిల్ల ఒక తిరుపూర్ మాదిరిగా వేల కోట్ల రూపాయల వస్త్ర ఉత్పత్తి కేంద్రంగా ఎదగాలని బీఆర్ఎస్ ఆకాంక్షగా పేర్కొన్నారు.

ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలి : సీఐ

విశాలాంధ్ర - మొయినాబాద్: నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మొయినాబాద్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ పవన్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 31 రాత్రి ప్రధాన రహదారులపై తిరగరాదు.

ఏఎంసీలను నియమించిన కమిషనర్

విశాలాంధ్ర -నాగారం : నాగారం మున్సిపాలిటీ రెవెన్యూ అసిస్టెంట్ కమిషనర్ గా బి నాగేశ్వరరావు నియమితులైనారు. జిహెచ్ఎంసి. పరిధిలోని ఉప్పల్ జోనల్ పరిధి ఉన్న, ఘట్కేసర్ సర్కిల్. నాగారం రెవెన్యూ అసిస్టెంట్ కమిషనర్లు గా బి. నాగేశ్వరరావు, బి సురేష్ రెడ్డి , ఘట్కేసర్ ఏఎంసీగా, డి వేణుగోపాల్ రెడ్డి, పోచారం ఏఎంసీగా పి.శశి కుమార్‌లు నియమితులైనట్లు జిహెచ్ఎంసి కమిషనర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అయ్యప్పలకు అన్న ప్రసాదం

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్: డైనమిక్ లీడర్ మహిళా నాయకురాలు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట మండలం మాజీ జడ్పిటిసి విశాల, ఆమె వెన్నంటే ఉంటూ ఎల్లవేళలా రాజకీయంగా సహాయ సహకారాలు అందిస్తున్న తాంద్ర శ్రవణ్ రెడ్డి దంపతుల వివాహ వార్షికోత్సవం శుభ సందర్భంగా షాద్నగర్ పట్టణంలోని ప్రముఖ దేవాలయం శివమూర్తి గీత అయ్యప్ప మందిరంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించగా, కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి హాజరయ్యారు. ప్రత్యేక పూజల అనంతరం శివ మారుతీ అయ్యప్ప గీతా మందిరంలో అయ్యప్ప స్వాములకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా ఈరోజు 44వ రోజున తమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని గావించారు. తాంద్ర విశాల శ్రవణ్ రెడ్డి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీ శివ మారుతీ గీతా దేవాలయం అధ్యక్షులు లష్కర్ ఆంజనేయులు, ప్రతాప్ రెడ్డి, రాయికల్ శ్రీను, శ్రీదర్ రెడ్డి, జంగ నర్సింహులు, రేటికల్ నందీశ్వర్, అనసూయమ్మ, దాస కృష?య్య, వెంకటేష్ గౌడ్ స్వామి, కోటిలింగం గౌడ్ స్వామి, మార్గం రాజేష్, గోలేపు రాఘువేందర్, తొండుపల్లి శ్రీ చరణ్ రెడ్డి, దిలీప్, గంగమోని సత్తయ్య, శ్రీధర్ రెడ్డి, నవీన్, రమేష్, మహేష్ గౌడ్, ప్రకాష్ చారి, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ

విశాలాంధ్ర-కొత్తూరు: తెలంగాణ ప్రభుత్వం త్వరలో భర్తీ చేయనున్న 14 వేల కానిస్టేబుల్ పోస్టుల నేపథ్యంలో ఆర్థికంగా వెనుకబడిన నిరుద్యోగ యువతకు కొత్తూరు మండలం, ఎస్ బి పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్ అండగా నిలువనున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మారుతున్న రాజకీయ కాలంలో సేవ అంటే కేవలం ప్రసంగాలు మాత్రమే కాదని, చేతల్లో చూపించాలని ఆయన పేర్కొన్నారు. కోచింగ్ సెంటర్లకు వెళ్లి చదువుకోలేని పేద యువతి,యువకుల కోసం ఉచిత స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కానిస్టేబుల్ కావాలనే ఆశయం ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాలని ఆయన సూచించారు.స్టడీ మెటీరియల్ పొందవలసిన కొత్తూరు మండల యువత జనవరి 15 లోపు ఈ వాట్సప్ o9195530 56784 నెంబర్ ద్వారా ఆధార్ వివరాలు పంపించగలరని ఆయన కోరారు.

లారీ -బైకు ఢీ : యువకుడి మృతి

విశాలాంధ్ర - మొయినాబాద్ : లారీ - బైకు ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...చేవెళ్ల మున్సిపల్ పరిదిలోని మల్కాపూర్ వార్డుకి చెందిన బక్కారెడ్డి శ్రీనివాస్ రెడ్డి కుమారుడు బక్కారెడ్డి రఘునాథ్ రెడ్డి(24) వృత్తిరీత్యా వ్యవసాయం పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. రఘునాథ్ రెడ్డి మొయినాబాద్ నుండి రాయల్ ఇన్ ఫీల్డ్ (టీఎస్11ఈఆర్3145)పై చేవెళ్ల వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా ఓ గుర్తుతెలియని లారీ అతనిన్నీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రఘునాథ్ రెడ్డికి తలకు, శరీరభాగాలకు తీవ్ర రక్తగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎన్నికల్లో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి అభినందనలు : కలెక్టర్

విశాలాంధ్ర ప్రతినిధి - రంగారెడ్డి : ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలలో పని చేసిన అధికారులను, సిబ్బందిని అందరినీ జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అభినందించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా పంచాయతీ శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఇటీవల నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలల్లో తమకు కేటాయించిన విధులను ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిర్వహించి విజయవంతంగా నిర్వహించారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం, ఎక్కడ ఎలాంటి సమస్యలు రాకుండా కింది స్థాయి నుండి పై అధికారుల వరకు ప్రతి ఒక్కరూ ఎంతో నిబద్ధతతో పని చేయడం ద్వారా ఎన్నికలను విజయవంతంగా నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ఎన్నికలలో భాగస్వాములైన ప్రతి ఒక్కరినీ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభినందించారు. రాబోయే ఎన్నికలలో కూడా ఇదే విధంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించుటకు జిల్లా కలెక్టర్ గారు ముందుండి దిశానిర్దేశం చేయడం వలనే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించి విజయవంతం అయ్యేలా చేయడం జరిగినదని ఈ సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, శ్రీనివాస్, డీఆర్ఓ సంగీత, జెడ్పీ సిఇఓ కృష్ణా?రెడ్డి, డిపిఓ సురేశ్ మోహన్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, తహసిల్దారులు, తదితరులు పాల్గొన్నారు.

పటాన్ చెరువు కేంద్రంగానే సర్కిల్ కార్యకలాపాలు



విశాలాంధ్ర, పటాన్ చెరువు : దశాబ్దాల చరిత్రతో పాటు నియోజకవర్గ కేంద్రంగా కలిగిన పటాన్ చెరువు డివిజన్ పరిధిలోని జిహెచ్ఎంసి పటాన్ చెరువు సర్కిల్ కార్యాలయాన్ని స్థానికంగానే కొనసాగించాలని. లేనిపక్షంలో ప్రజలతోపాటు పాలనాపరంగా తీవ్ర ఇబ్బందులు నెలకొంటాయని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్‌ను పటాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. బుధవారం హైదరాబాదులోని బల్దియా ప్రధాన కార్యాలయంలో జిహెచ్ఎంసి కమిషనర్ తో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశమయ్యారు. బల్దియా పునర్విభజన ప్రక్రియలో భాగంగా పటాన్ చెరువు కేంద్రంగా ఏర్పాటుచేసిన బల్దియా సర్కిల్ కార్యాలయాన్ని ఇటీవల పరిపాలన సౌలభ్యం పేరుతో తెల్లాపూర్ పరిధిలోని మున్సిపల్ కార్యాలయం లోకి మార్చారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ కేంద్రంతో పాటు ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు మొత్తం పటాన్ చెరువు కేంద్రంగా సేవలు అందిస్తున్నాయని. సర్కిల్ కార్యాలయాన్ని తెల్లాపూర్ కి మార్చడం ద్వారా పరిపాలనాపరంగా ఇబ్బందులతో పాటు పటాన్ చెరువు, జేపీ కాలనీ, ముత్తంగి డివిజన్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొన్నారు.పరిపాలన పరంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా.. ఆధునిక వసతులతో ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా గతంలోనే పటాన్ చెరువు పట్టణంలో సర్కిల్ కార్యాలయాన్ని నిర్మించామని తెలిపారు. నూతన సర్కిల్ ఏర్పడే వరకు సైతం పటాన్ చెరువు కేంద్రంగానే పాత సర్కిల్ కార్యకలాపాలు కొనసాగాయని తెలిపారు తక్షణమే పటాన్ చెరువు కేంద్రంగా సర్కిల్ కార్యకలాపాలు నిర్వహించేలా ఆదేశాలు జారీచేయాలని కమిషనర్ కర్ణన్‌ను ఎమ్మెల్యే జిఎంఆర్ కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కమిషనర్.. ప్రజలకు మెరుగైన పరిపాలన సేవలు అందించడమే తమ లక్ష్యమని అతి త్వరలో పటాన్ చెరువు కేంద్రంగానే సర్కిల్ కార్యకలాపాలు కొనసాగుతాయని తెలిపారు.

కార్మిక కోడ్‌లతో బానిసత్వమే

ఫిబ్రవరి సమ్మె జయప్రదం చేద్దాం

విశాఖ సదస్సులో అమర్‌జీత్ కౌర్

విశాలాంధ్ర-విశాఖ: కార్మిక వర్గాన్ని బానిసత్వంలోకి నెట్టే విధంగా కొత్త లేబర్ కోడ్లను మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ విమర్శించారు. లేబర్ కోడ్ల రద్దు డిమాండ్‌తో వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మె చేపట్టబోతున్నట్లు తెలిపారు. దీనిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కొత్త కోడ్‌లు అమల్లోకి రాకుండా అడ్డుకోకపోతే ఫిబ్రవరిలో జరగబోయేది చివరి సమ్మె అవుతుందని హెచ్చరించారు. అమర్‌జీత్ కౌర్ బుధవారం విశాఖలో ఏఐటీయూసీ జిల్లా సమితి సదస్సుకు హాజరయ్యారు. 'కార్మిక చట్టాలు, దేశ ఆర్థిక రంగంపై ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ప్రభావం' అంశంపై ప్రసంగించారు. 11 కార్మిక సంఘాల పిలుపు మేరకు ఫిబ్రవరి 12న జరిగే సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు పాల్గొనాలని, కార్యక్రమాన్ని విజయవతం చేయాలని కోరారు. ఈ సమ్మెపై జనవరి 9న కార్మిక సంఘాల సమావేశం జరగనుందని తెలిపారు. కార్మిక చట్టాలకు, లేబర్ కోడ్‌లకు వ్యత్యాసం ఉందని, చట్టాలు సవరించాలంటే పార్లమెంటు ఆమోదించాలని, కోడ్‌ల సవరణకు కేబినెట్ ఆమోదిస్తే సరిపోతుందని అమర్‌జీత్ కౌర్ అన్నారు. ప్రధాని మోదీకి, హోంమంత్రి అమిత్‌షాతో చెప్పి తమకు వీలుగా కార్మిక కోడ్‌లను మార్చుకనేందుకు అదానీ, అంబానీలకు అవకాశం ఉందంటూ ఆందోళన వ్యక్తంచేశారు. యూనియన్ల ఏర్పాటు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ చాలా కష్టమవుతుందని, వేతన నిర్వచనం ఇప్పటికే మార్చేశారని, కార్మికుల భద్రతకు హామీలేదని అమర్‌జీత్ కౌర్ తెలిపారు. ఫ్యాక్టరీల అధికారులకు ఎటువంటి అధికారాలూ ఉండవని, వారు ఫెసిలిటేటర్లుగా వ్యవహరిస్తారని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలను నాశనం చేస్తే దేశ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసినట్టేనని హెచ్చరించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అప్పటి ప్రధాని నెహ్రూ... దేశంలో ఫ్యాక్టరీల ఏర్పాటుకు అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్ సహకారం కోరితే ఆ దేశాలు నిరాకరించాయని గుర్తుచేశారు. సీపీఐ సూచనతో సోవియట్ యూనియన్ సహకారాన్ని నెహ్రూ కోరారని, సోవియట్ యూనియన్ ఎటువంటి ప్రయోజనం ఆశించకుండా పూర్తిగా సహకరించిందని అమర్‌జీత్ కౌర్ వెల్లడించారు. 1920 అక్టోబర్ 31న ఏఐటీయూసీ ఆవిర్భవించగా, లాలా లజపత్ రాయ్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా వ్యవహరించారని, తరువాత కాలంలో నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, వీవీ గిరి, సరోజినీ నాయుడు ప్రధాన కార్యదర్శులయ్యారని తెలిపారు. 1921లో సంపూర్ణ స్వరాజ్యం కోసం ఏఐటీయూసీ పిలుపునిచ్చిందన్నారు. దేశంలో ఒప్పంద కార్మికులు పెరుగుతున్నారని, ఉద్యోగ భద్రత దెబ్బతింటోందని, అసంఘటిత రంగ కార్మికులకు పని భద్రత లేకుండా పోయిందని అమర్‌జీత్ కౌర్ వెల్లడించారు. ఏఐటీయూసి విశాఖ జిల్లా సమితి ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ, రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, జిల్లా అధ్యక్షుడు మన్మథరావు, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బూసి వెంకటరావు, కోశాధికారి సత్యాంజనేయ, పోర్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి బీసీహెచ్ మసేన్ పాల్గొన్నారు.

నిర్ణయాత్మక చర్యలకు ఇదే సమయం

ఆరావళికి పూర్తి రక్షణే పోరాటలక్ష్యం: ఏఐకేఎస్

న్యూఢిల్లీ: ఆరావళి పరిరక్షణకు అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) సంకల్పించింది. కార్పొరేట్ల ప్రయోజనార్థం కోర్టు తీర్పునే వక్రీకరించేందుకు ప్రయత్నించిన మైనింగ్ మంత్రి రాజీనామాకు డిమాండ్ చేసింది. ఆరావళి పర్వతాలపై మైనింగ్‌ను పూర్తి నిషేధించాలని కోరింది. స్వతంత్ర దర్యాప్తు కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. తమ డిమాండ్ల సాధన కోసం రాజీలేని పోరాటం చేస్తామని, తమతో కలిసి రావాలని రైతులు, పౌరులు, పర్యావరణవేత్తలకు పిలుపునిచ్చింది. ప్రభావిత రాష్ట్రాల్లో ప్రజలను చైతన్యపర్చి, మైనింగ్ ప్రయోజనాలపై ఉక్కుపాదం మోపేలా ఒత్తిడి పెంచుదామంటూ ఒక ప్రకటనను ఏఐకేఎస్ అధ్యక్ష-ప్రధాన కార్యదర్శులు రాజన్ క్షీరసాగర్, రావుల వెంకయ్య బుధవారం విడుదల చేశారు.ఆరావళికి శాశ్వత-సమగ్ర పరిరక్షణపై రాజీ ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. స్పష్టతలు... కమిటీల కాలం గడిచింది... నిర్ణయాత్మక చర్యలకు ఇదే సమయమని నొక్కిచెప్పారు. ప్రభుత్వం ఒత్తిళ్లకు తలొగ్గని ప్రతినిధులతో స్వతంత్ర కమిటీలో పర్యావరణవేత్తలు, భూగోళశాస్త్రవేత్తలు, ప్రజా ప్రతినిధులు, రైతు నాయకులు, గిరిజన తెగల ముఖ్యులు మాత్రమే సభ్యులుగా ఉండాలని... బ్యూరోక్రాట్లు ప్రభుత్వ అనుబంధ నిపుణులు ఉండరాదని సూచించారు. కమిటీ చర్చలు, డేటా పూర్తి పారదర్శకంగా, ప్రజల పర్యవేక్షణలో ఉండాలని వెల్లడించారు. మైనింగ్ కొత్త లీజులను నిషేధిస్తూ కేంద్ర పర్యావరణ శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీచేసిందని గుర్తుచేస్తూ ఇలాంటి పాక్షిక చర్యలతో ప్రయోజనం ఉండదని క్షీరసాగర్, రావుల వెంకయ్య అన్నారు. సుప్రీం విచారణ ముగిసేంత వరకు రాజస్థాన్, గుజరాత్, దిల్లీ గుండా ఆరావళిపై మైనింగ్ పూర్తి నిషేధానికి డిమాండ్ చేశారు. ప్రజలను, కోర్టును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించిన కేంద్ర పర్యావరణ, అటవీ, వతావరణ మార్పుశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌కు పదవిలో కొనసాగే నైతిక అర్హతలేదన్నారు. అడవులు, వన్యప్రాణుల కారిడార్లు, వాటర్‌షెడ్లు సహా ఆరావళి పర్వతశ్రేణి మొత్తాన్ని పరిరక్షించాలన్నారు. ఇది ఆరావళి కోసం జరిగే పోరాటం కాదని, రైతులు-ఆడవి బిడ్డల బతకు పోరాటమని రాజన్ క్షీరసాగర్, రావుల వెంకయ్య పేర్కొన్నారు. ఆరావళి పరిరక్షణ కోసం పాటుపడే పర్యావరణ సంఘాలకు, పౌరులకు ఏఐకేఎస్ తరపున సంపూర్ణ మద్దతు ఉంటుందని వెల్లడించారు.

కార్మిక కోడ్‌ల ముసాయిదా నియమాలు

నోటిఫై చేసిన కేంద్రం

న్యూఢిల్లీ: కొత లేబర్ కోడ్‌ల ముసాయిదా నియమాల (డ్రాఫ్ట్ రూల్స్)ను కేంద్రం నోటిఫై చేసింది. వేతనాలు, సామాజిక భద్రత, పారిశ్రామిక సంబంధాలు, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులకు సంబంధించిన నాలుగు కోడ్‌ల నిబంధనలపై అభిప్రాయ సేకరణ చేపట్టనుంది. 2026 ఏప్రిల్ 1 నుంచి నాలుగు కార్మిక కోడ్‌లు అమల్లోకి తెచ్చేందుకుగాను ఈ నిబంధనలను కేంద్రం ప్రచురించింది. ఉమ్మడి జాబితాలోకి వచ్చే అంశం కావడంతో ఆయా రాష్ట్రాలు కూడా ఈ నిబంధనలను నోటిఫై చేయాల్సి ఉంటుంది. ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్, 2020కి 30 రోజులు, మిగిలిన మూడు కోడ్‌లకు 45 రోజుల గడువు ఇచ్చింది. గతంలో రాష్ట్రాలు ముసాయిదా నిబంధనలను ప్రచురించినప్పటికీ.. కొన్ని నెలలు గడిచిన నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మళ్లీ నియమాలను ప్రచురించాలి. లేబర్ కోడ్‌లను నోటిఫై చేసేంత వరకు పాత చట్టాలు అమల్లో ఉంటాయి. ఈ కోడ్‌లలో వేజ్, అలవెన్స్, గ్రాట్యుటి నిబంధనలను పొందుపరిచారు.

'వేజ్' నిర్వచనం.....:కొత్త లేబర్ కోడ్‌లలో 'వేజ్' అనే దానికి నిర్వచనం ఇచ్చారు. ఇందులో బేసిక్ పే, డియర్‌నెస్ అలవెన్స్, రిటైనింగ్ అలవెన్స్... మిగిలినవి అలవెన్స్ (ప్రోత్సాహకం) రూపంలో ఉంటాయి. ఉద్యోగికి చెల్లించే మొత్తం జీతంలో ప్రోత్సాహకాలు 50 శాతాన్ని మించకూడదు. అంటే ఇకపై తక్కువ బేసిక్ పే చూపించడానికి వీల్లేదు. పర్ఫార్మెన్స్ బేస్డ్ ఇన్సెంటివ్స్, ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్స్, వేరియబుల్ పే, రీయింబర్స్‌మెంట్లు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి 50 శాతం నిబంధన పరిధిలోకి రావు. వీటిని వేజెస్‌గా పరిగణించరు. ఉదాహరణకు ఒక వ్యక్తి వేతనం రూ.70 వేలు అనుకుంటే... రూ.20 వేలు బేసిక్ డీఏ, మిగిలిన రూ.50వేలు అలవెన్సుల రూపంలో ఇస్తున్నారని భావిస్తే... అలవెన్సులపై 50 శాతం పరిమితి కారణంగా రూ.35వేలు వేతనంగా చెల్లించి... మిగిలిన రూ.15వేలు వేజెస్‌లో కలపాలి. పనిచేసిన కాలానికి ఏడాదికి 15 రోజుల చొప్పున చివరి వేతనాన్ని గ్రాట్యుటీ కింద చెల్లించాలి. ఉద్యోగి రాజీనామా, తొలగింపు, రిటైర్మెంట్, ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ముగిసినప్పుడు గ్రాట్యుటీని చెల్లించాలి. ఉద్యోగి మరణించినప్పుడు, వైకల్యానికి గురైనప్పుడు, కాంట్రాక్ట్ ముగిసినప్పుడు ఐదేళ్లు పని చేసివుండాలన్న నిబంధన వర్తించదు. 2025 నవంబర్ 21 నుంచి గ్రాట్యుటీ నిబంధనలు అమల్లోకి వచ్చాయి.

2027 నాటికి పోలవరం పూర్తి

రూ.456 కోట్లతో వెలిగొండ ఫీడర్ కెనాల్ పనులు: మంత్రి నిమ్మల

విశాలాంధ్ర - సచివాలయం: పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం ఇరిగేషన్ ప్రాజెక్టుల పనుల పురోగతిపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోలవరంను... డయాఫ్రం వాల్‌ను విధ్వంశం చేసిన వైసీపీ మాట్లాడటం దొంగే దొంగ అన్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. కేంద్రం రీయింబర్స్ చేసిన రూ.3,800 కోట్లను సైతం దారి మళ్లించి... జగన్ పోలవరం ప్రాజెక్టును ముంచేశాడని విమర్శించారు. కొత్త డయాఫ్రం వాల్ 1,034 మీటర్లు నిర్మించి ప్రాజెక్టు పనులు 87శాతం పూర్తి చేశామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఒక్క ఏడాదిలోనే నిర్వాసితులకోసం రూ.1,894 కోట్లు విడుదల చేశామని వివరించారు. 2026 సీజన్ మొదలయ్యే నాటికి వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తిచేసే లక్ష్యంతో పనులు జరుగుతున్నాయన్నారు. జనవరి మొదటి వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టును సందర్శిస్తారని పేర్కొన్నారు. రూ.456 కోట్లతో ఫీడర్ కెనాల్ పనులు ప్రారంభిస్తారని చెప్పారు. ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు సుపరిపాలనే లక్ష్యం: లంకా

విశాలాంధ్ర - సచివాలయం: రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయడం అభినందనీయమని 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ అన్నారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ... మార్కాపురం, పోలవరం కొత్త జిల్లాలు గా ఏర్పాటు చేయడం వల్ల ఆయా ప్రాంతాల చిరకాల కోరికను సీఎం చంద్రబాబు తీర్చారన్నారు. జిల్లాల ఏర్పాటుతో వెనుక బడిన ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఐదు రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు వల్ల సుపరిపాలన సాకారమవుతుందన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ సాకారంలో కొత్త జిల్లాలు, డివిజన్లు ఏర్పాటు ఎంతో ఉపకరిస్తాయన్నారు. గత వైసీపీ సర్కారు అడ్డగోలుగా జిల్లాల పునర్విభజన ప్రక్రియ చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వ తప్పిదాలను కూటమి ప్రభుత్వం సరిదిద్దిందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తికి కృషి చేస్తుందన్నారు. 2025లో డబుల్ ఇంజిన్ సర్కారు పాలనలో రాష్ట్రం గణనీయమైన అభివృద్ధి చెందిందని... పెట్టుబడులకు స్వర్గధామంగా సీఎం మార్చారని, రాష్ట్రానికి ప్రధాని మోదీ అన్ని విధాలా సహకరిస్తున్నారన్నారు.పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ చేస్తోన్న దుష్ప్రచారాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ హయాంలో వైద్య కళాశాలల్లో 42శాతం సీట్లు మాత్రమే పేదలకు వచ్చాయని, పీపీపీ విధానంలో 50శాతం సీట్లు పేదలకు వచ్చేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. 108, ఆరోగ్యశ్రీని పీపీపీ విధానంలో వైఎస్ఆర్ ప్రారంభిస్తే జగన్ కొనసాగించిన విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు.

3, 4, 5 తేదీల్లో ప్రపంచ తెలుగు మహాసభలు

4న మారిషస్ దేశ అధ్యక్షుడు,

5న సీఎం చంద్రబాబు హాజరు



విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్వర్యంలో జనవరి 3, 4, 5 తేదీలలో శ్రీ సత్యసాయి ఆధ్యాత్మిక నగరంలో జరగనున్న ప్రపంచ తెలుగు మహాసభలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు మహాసభల అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక భారతీయ విద్యాభవన్ సమావేశ మందిరంలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ... ఈ సభలకు 'తెలుగువారి అనురాగ సంగమం'గా నామకరణం చేసినట్టు తెలిపారు. 42 దేశాలకు చెందిన 62 తెలుగు సంఘాలకు ఇప్పటికే ఆహ్వానాలు పంపినట్టు చెప్పారు. మూడు రోజుల పాటు 22 సాహితి సదస్సులు జరుగుతాయని తెలిపారు. బుర్రకథ, 1000 మంది కవులు కవి సమ్మేళనానికి తమ పేర్లు నమోదు చేసుకున్నట్టు వివరించారు. దేశం నలుమూలల నుంచి మూడు రోజుల్లో సుమారు లక్ష మంది హాజరవుతారని చెప్పారు. హరికథ, తోలు బొమ్మలాట, కత్తి సాము వంటి ప్రాచీన కళారూపాల ప్రదర్శనలు నిర్వహిస్తారని తెలిపారు. నాల్గవ తేదీన మారిషస్ దేశ అధ్యక్షుడు, ఐదో తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతారని వెల్లడించారు. ఉత్తరాఖండ్ ఆదిశంకర పీఠాధిపతులు ప్రవచనం ఉంటుందని పేర్కొన్నారు. నాలుగు రాష్ట్రాల గవర్నరులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. ప్రధాన వేదికతో పాటు శ్రీనాథ కవి వేదిక(సదస్సులు), జాషువా కరుణశ్రీ వేదిక (కవి సమ్మేళనం), కొప్పరపు కవుల వేదిక(అవదానుల ప్రదర్శనలు), తూము నరసింహా దాసు వేదిక(ఆధ్యాత్మిక కార్యక్రమాలు), డాక్టర్ ఘంటసాల, డాక్టర్ ఎస్పీ బాలు వేదిక (పాడనా తెలుగు పాట), రామోజీ రావు ప్రదర్శనల ప్రాంగణం (పుస్తక, హస్తకళలు, ప్రాచీన తెలుగు వైభవ ప్రదర్శనలు) ఏర్పాటు చేసినట్టు వివరించారు. ప్రతి రోజు ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు సాంస్కృతిక... సభా కార్యక్రమాలు, పూర్ణకుంభ పురస్కారాలు, ప్రతిభా పురస్కారాలు, సాహిత్య సేవా పురస్కారాల ప్రదానోత్సవం, గ్రంథావిష్కరణలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆంధ్రమేవ జయతే ప్రత్యేక సంచిక ఆవిష్కరణ, ముఖ్యఅతిథులు, ప్రముఖుల సందేశాలు, తాను రూపొందించిన తెలుగు తోరణం, క్షేత్ర దర్శిని ప్రత్యేక నృత్య రూపక ప్రదర్శన ఉంటుందన్నారు. మహాసభలు ముఖ్య సమన్వయ కర్త పి.రామచంద్రరాజు మాట్లాడుతూ దేశ విదేశాలలో ఉన్న తెలుగువారందరూ మహాసభలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కొత్త ఏడాదిలో అందరికీ మంచి జరగాలి: సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు అందుకున్న లక్షలాది మంది లబ్ధిదారులకు, రాష్ట్ర ప్రజలకు సీఎం చంద్రబాబు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా సందేశం ఇచ్చారు. అలానే రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రభుత్వ అధికారులకు, గ్రామ సచివాలయ సిబ్బందికి, గ్రామ స్థాయి ఉద్యోగులకు సీఎం అభినందనలు తెలియజేశారు. నూతన సంవత్సరం సందర్భంగా పేదల ఇళ్లల్లో సంతోషం నింపేందుకు ఒక రోజు ముందుగానే పింఛన్లు ఇవ్వాలని ప్రభుత్వ ఆలోచనను చక్కగా అమలు చేశారని ప్రశంసించారు. ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల ద్వారా ఆర్థిక భరోసా ఇవ్వాలనేదే ప్రభుత్వ సంకల్పమన్నారు.

రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉండాలి: జగన్

నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. 2026 లో రాష్ట్ర ప్రజలంతా సంతోషంగా ఉండాలని, ప్రతి ఇంటా సుఖ శాంతులు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. 2026వ సంవత్సరం ప్రతి ఒక్కరి ఇంట్లో ఆనందం నింపాలని, అందరికీ ఆరోగ్యం అందించాలని, ప్రతి కుటుంబంలో ప్రతి ఒక్కరికీ దైవానుగ్రహం సంపూర్ణంగా లభించాలని వైఎస్ జగన్ అభిలషించారు.

ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు పవన్ శుభాకాంక్షలు

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్... 2026 నూతన సంవత్సర సందర్భంగా రాష్ట్ర ప్రజలతో పాటు ప్రత్యేకంగా ఐఏఎస్, ఐపీఎస్ ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ సహా అన్ని విభాగాల అధికారులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పాలనకు అధికారులే వెన్నెముక అని ఆయన అభివర్ణించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చి తమ సొంత ఊళ్లను వదిలి ఏపీలో ప్రజలకు సేవ చేస్తున్న అధికారుల త్యాగాలను తాము గుర్తిస్తున్నామని, వారి సేవలకు కృతజ్ఞతలు అని పవన్ పేర్కొన్నారు.2026లో అధికార యంత్రాంగం మరింత వేగంగా, మానవీయ కోణంలో పని చేయాలని పవన్ ఆకాంక్షించారు.

నూతన వత్సరంలో నవ సంకల్పం

డి.రాజా పిలుపు

న్యూదిల్లీ: దేశంలో బీజేపీ-ఆర్ఎస్ఎస్ దుష్పరిపాలన సాగుతోందని, దీని వల్ల అనేక సంక్షోభాల్లో భారత్ చిక్కుకుపోయిందని, ఇలాంటి సమయంలో కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టబోతున్నామని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా వ్యాఖ్యానించారు. నూతన సంవత్సరంలో నవ సంకల్పంతో ముందుకెళ్లాలని ఆయన బుధవారం సామాజిక మాధ్యమం వేదికగా పిలుపునిచ్చారు. ఐక్యంగా, దృఢంగా, ధైర్యంగా నిరంకుశత్వాన్ని ఎదిరించాలని... ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని పరిరక్షించాలని... న్యాయం, సమానత్వం, గౌరవం కోసం సమ్మిళిత పోరాటాలను మరింత బలంగా చేపట్టాలని డి.రాజా నొక్కిచెప్పారు. ఐక్య పోరాటాలతో ముందుకెళదామంటూ పిలుపునిచ్చారు. దేశంలో ఆర్థిక సంక్షోభం నెలకొందని... నిరుద్యోగం, వ్యవసాయ సమస్యలు వెంటాడుతున్నాయని అన్నారు. కార్మిక హక్కులపై దాడులు, సమాఖ్యవాదం తుడిచిపెట్టుకుపోతోందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజాస్వామిక వ్యవస్థలు నిర్వీర్యమవుతున్నాయని, మతం పేరిట సమాజం విభజనకు గురవుతోందన్నారు. గణతంత్రానికి, రాజ్యాంగ విలువలకు పెద్ద ముప్పు ఏర్పడిందని రాజా పేర్కొన్నారు. ఈ సంక్షోభాలన్నింటిని అధిగమించేందుకుగాను నవ సంకల్పంతో నూతన సంవత్సరంలో పోరాటాలను మరింత ఉధృతంగా చేపట్టేందుకు ఏకమవుదామంటూ డి.రాజా పిలుపునిచ్చారు. అందరికీ నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ మ్యూజియంలో పురావస్తు విభజనకు కొత్త కమిటీ

ఏపీ ప్రభుత్వం జీవో విడుదల

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం తెలంగాణ మ్యూజియంలో ఉన్న పురావస్తువుల విభజన ప్రక్రియకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేగం పెంచింది. యువజన అభివృద్ధి, పర్యాటకం, సంస్కృతిక శాఖ కొత్త కమిటీని ఏర్పాటు చేస్తూ జీవో 187 విడుదల చేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య పురావస్తువుల గుర్తింపు, ఎంపిక, పంపిణీ బాధ్యతలను ఈ కమిటీ నిర్వర్తించనుంది. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ మ్యూజియంలో ఉన్న అనేక పురావస్తువులు విభజనకు నోచుకోలేదన్న నేపథ్యంలో, వాటిని చట్టప్రకారం ఏపీకి తరలించి సంరక్షణ, డాక్యుమెంటేషన్, ప్రదర్శనకు చర్యలు తీసుకునే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఏపీ చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రజల ముందు పదర్శించేందుకు ఈ కమిటీ కీలక పాత్ర పోషించనుంది. కమిటీ చైర్‌పర్సన్‌గా ఏపీ రాష్ట్ర సృజనాత్మక-సంస్కృతి కమిషన్ (ఏపీ స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్) చైర్‌పర్సన్ స్మితా తేజస్వి పొడపాటిని నియమించారు. పురావస్తు, మ్యూజియం శాఖ కమిషనర్ (ఏపీ) కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన విశ్రాంత ప్రొఫెసర్ వాకులాభరణం రామకృష్ణ, విశ్రాంత స్థపతి డాక్టర్ ఏమని శివనాగి రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ (మ్యూజియమ్స్), రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ కేఎస్‌బీ కేశవ, విశ్రాంత ఏడీ బీ వాసుదేవాచారి, ఫైనాన్స్ శాఖ సెక్రటరీని కమిటీలో సభ్యుడిగా ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ తెలంగాణ ప్రభుత్వ కమిటీతో సమావేశాలు నిర్వహిస్తూ పురావస్తువుల స్థితిగతులను సమీక్షించనుంది. చట్ట నిబంధనల మేరకు రెండు రాష్ట్రాల మధ్య పంపిణీ పూర్తి చేయడం కమిటీ ప్రధాన బాధ్యతగా పేర్కొంది. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పురావస్తు మరియు మ్యూజియం శాఖ కమిషనర్‌కు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

మూడు మున్సిపాలిటీలకు గ్రేడ్ పెంపు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలోని మూడు మున్సిపాలిటీల స్థాయిని పెంపు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు, పశ్చిమ గోదావరి జిల్లా తణుకు, శ్రీసత్యసాయి జిల్లా కదిరి మున్సిపాలిటీల స్థాయిని ప్రభుత్వం పెంచింది. గ్రేడ్ 3లో కొవ్వూరు మున్సిపాలిటీని గ్రేడ్ 1కి, తణుకు, కదిరి మున్సిపాలిటీ హోదాను సెలక్షన్ గ్రేడ్‌కు పెంపు చేస్తూ పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

మహారాష్ట్ర డీజీపీ సదానంత్ దాతే

ముంబై: మహారాష్ట్ర డీజీపీగా సీనియర్ ఐపీఎస్ సదానంద్ దాతే నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయి. డీజీపీ రష్మీ శుక్లా పదవీ కాలం జనవరి 3న ముగుస్తుంది. సదానంత్ అదే రోజు పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. డీజీపీగా రెండేళ్లు కొనసాగుతారు. సదానంత్ దాతే 26/11 ముంబై దాడులప్పుడు వీరోచితంగా పోరాడి ప్రశంసలు అందుకున్నారు. సదానంద్ దాతే1990 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) డైరెక్టర్ జనరల్‌గా ఉన్నారు. మహారాష్ట్ర ఏటీఎస్ చీఫ్‌గా పనిచేసిన ఆయన సీబీఐ, సీఆర్‌పీఎఫ్‌లలోనూ సేవలందించారు. ముంబై సెంట్రల్ జోన్ అదనపు కమిషనర్‌గా ఉన్నప్పుడు ఉగ్రదాడులు జరిగాయి. ఆర్థిక నేరాలపై పరిశోధనలకు పూనే వర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు

ఉక్రెయిన్ బఫర్ జోన్ విస్తరణకు పుతిన్ ఆదేశాలు

మాస్కో: ఉక్రెయిన్‌లో బఫర్ జోన్ పెంచమని రష్యా దేశాధ్యక్షుడు పుతిన్ ఆదేశించినట్లు ఆ దేశ జనరల్ వాలేరి గెరసిమోవ్ వెల్లడించారు. దీంతో రష్యా దళాలు సుమీ, ఖర్కీవ్ ప్రాంతాల్లోని గ్రామాలను వరుసగా ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నట్లు తెలిపారు. పుతిన్ ఇంటిపై డ్రోన్ల దాడికి సంబంధించిన వీడియోను రష్యా బయట పెట్టింది. ఇలాంటి సమయంలో తాజా ఆదేశాలకు ప్రాధాన్యత ఏర్పడింది. శాంతి చర్చలు వేళ కీవ్-మాస్కో పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఉక్రెయిన్ 91 డ్రోన్లను రష్యాపై ప్రయోగించినట్లు ఆ దేశ విదేశాంగ శాఖ మంత్రి లావ్రోవ్ ఈ మధ్యనే వెల్లడించారు.

ఫాదర్ అరెస్ట్ రాజ్యాంగ స్వేచ్ఛ హరించడమే

కేరళ సీఎం పినరయి విజయన్

కొట్టాయం: బలవంతపు మతమార్పిడి ఆరోపణలపై ఫాదర్ అరెస్ట్ రాజ్యాంగ స్వేచ్ఛను హరించడమేనని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫాదరర్ సుధీర్, ఆయన భార్యతో పాటు 10 మంది సహచరుల అరెస్ట్‌పై విజయన్ బుధవారం ఎక్స్ వేదికగా స్పందించారు. వారి అరెస్ట్ తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. ఈ అరెస్ట్ మైనారిటీలు లక్ష్యంగా విభజనకు ఆజ్యం పోసేందుకు సంఘ్ పరివార్ అనుసరిస్తున్న ఆందోళనకరమైన విధానానికి చిహ్నమని, గతంలో జబల్‌పూర్‌లో ఇదే తరహా ఘటనను చూశామని అన్నారు. ఇటువంటి చర్యలు రాజ్యాంగ స్వేచ్ఛను హరిస్తున్నాయని తెలిపారు. ఫాదర్ సుధీర్ గత ఐదేళ్లుగా మహారాష్ట్రలో ఉంటున్నారు. క్రిస్మస్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు, ఇతర మిషనరీలతో కలిసి స్థానికంగా ఒక నివాసానికి చేరుకున్నారు. ఆహ్వానించిన వ్యక్తి పుట్టినరోజు కూడా కావడంతో అక్కడ వేడుకలు జరుపుకుంటున్నారు. అయితే ఫాదర్ బలవంతపు మతమార్పిడులకు పాల్పడుతున్నారంటూ భజరంగ్ దళ్ కార్యకర్త ఫిర్యాదుతో నాగపూర్ పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. ఆయన భార్య, 10 మంది సన్నిహితులను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనను చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా (సిఎస్ఐ) బిషప్ సాబు మలై కౌషు ఖండించారు. ఇది రాజ్యాంగ స్వేచ్ఛకు విఘాతమని అన్నారు. సుధీర్ మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో గత 12 సంవత్సరాలుగా సేవలందిస్తున్నారని చెప్పారు. పిల్లలకు విద్యను అందించడం, స్థానిక సంఘాలకు మద్దతునిస్తారని అన్నారు. అనేక గ్రామాల అభివృద్ధికి సహకారం అందిస్తున్నారని అన్నారు. క్రిస్మస్‌లో భాగంగా చిన్న కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

డిసిసి కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు

విశాలాంధ్ర- ఖమ్మం : ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్కు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నాగల దీపక్ చౌదరి జిల్లా కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య కేక్ తినిపించారు. వివిధ ప్రజా సంఘాల నాయకులు పార్టీలోని వివిధ హెూదాల్లో పనిచేస్తున్న కాంగ్రెస్ నాయకులు వారితో పాటు మాజీ శాసనసభ్యులు కొండపాల కోటేశ్వరరావు సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొత్త సీతారాములు దితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని అందరికీ మంచి ఆరోగ్యం దేవుడు ప్రసాదించాలని , పార్టీ కార్యకర్తలు నాయకులు, అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.

డిపిఓగా ఆశాలత ప్రజల మన్ననలు పొందారు

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

విశాలాంధ్ర -ఖమ్మం : పంచాయతీరాజ్ గ్రామీణాభివ ృద్ధి శాఖలో గత 31 సంవత్సరాలుగా డిపిఓ ఆశాలత వివిధ హెూదాలలో పనిచేస్తూ అత్యంత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించారని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఎన్ఎస్పీ క్యాంప్‌లోని డి.పి.ఆర్.సి. మీటింగ్ హాల్‌లో ఉద్యోగ విరమణ పొందిన జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత ఆత్మీయాభినందన సన్మాన మహెూత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి డిపిఓ దంపతులు ఆశాలత కమల్ రాజ్ లను జిల్లా కలెక్టర్ పూలమాలలు, శాలువతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, ప్రభుత్వ విధానాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంలో ఆశాలత చూపిన నిబద్ధత, క్రమశిక్షణ ఇతర అధికారులకు ఆదర్శప్రాయమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివ ృద్ధి, పంచాయతీల బలోపేతం, ప్రజలకు మెరుగైన సేవలతో ఆమె చేసిన క ృషి ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ అన్నారు. ఉద్యోగ జీవితం అంతటా అంకితభావంతో పనిచేస్తూ శాఖకు మంచి పేరు తెచ్చారని, ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్నారని గుర్తుచేశారు. విధినిర్వహణలో నిరంతరం తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యుల సహకారం కూడా ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆశాలత కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఆనందభరితమైన భావి జీవితాన్ని గడపాలని కలెక్టర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సిపిఓ శ్రీనివాస్, హౌసింగ్ పిడి బి. శ్రీనివాస్, వెంకటపతిరాజు, రాజేంద్ర ప్రసాద్, డివిజనల్ పంచాయతీ అధికారులు రాంబాబు, విజయలక్ష్మి, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలు, త్యాగాలతో సిపిఐ నూరేళ్లుగా అజరామరం

ఈనెల జనవరి 18న ఖమ్మంలో ముగింపు సభ : సాబీర్ పాషా

విశాలాంధ్ర - చర్ల : వందేళ్ల నుంచి నిరంతర ఉద్యమాలు, త్యాగాలతో భారత భూమిపై ప్రజల్లో పునీతమై సిపిఐ పార్టీ అజరామరంగ నీటారుగా నిలిచిందని జిల్ ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు. సిపిఐ నూరేళ్ల వేడుకను ఘనంగా నిర్వహించుకుందామని ఆయన బుధవారం చర్ల మండల కౌన్సిల్ సమావేశంలొ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పాలెం సత్యనారా యణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భారతదేశ స్వతంత్రాని కంటే ముందే సిపిఐ ఆవిర్భవించిందన్నారు. ఆనాటి నుండి నేటి వరకు ప్రజాక్షేత్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటాలు సాగిస్తోందన్నారు. ఈ నూరేళ్ల త్యాగాలు ఉద్యమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సిపిఐ చరిత్రను వాడవాడల వివరించాలని సూచించారు. శత వసంత ఉత్సవ ముగింపు సభ జనవరి 18వ తేదీన ఖమ్మం నగరంలో 5 లక్షల మందితో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రపంచం యావత్తు నేడు కమ్యూనిస్టుల పాలనను కోరుకుంటుందన్నారు. ప్రచార జాత ఈ నెల 3 తేదీన చర్ల మండల కేంద్రం నుండి ప్రారంభమై 7 న సుజాతనగర్ మండల కేంద్రంలో ముగుస్తుందన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ, మండల కార్యదర్శి నూప పోతయ్య, సహాయ కార్యదర్శులు కోటి ముత్యాలరావు, చల్లా లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు నూప తిరుపతిరావు, నానిపల్లి భద్రం, మండల ఆర్గనైజర్ ఎస్కె జాకీర్ హుసేన్, సర్పంచులు నూప సునీత, కుర్నాపల్లి శ్యామల, తిరుపతి రావు, ఉపసర్పంచులు, మడివి శ్రీనివాస్, కల్లూరి సీతారాములు, వెంకట నరసింహ, సీతారావమ్మ, అనుసూర్య తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం పాఠశాలలో ముగ్గులేసి విద్యార్థుల 'నూతన' సందడి

విశాలాంధ్ర- దమ్మపేట : మండలంలోని గోపాలపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా రంగ వల్లులు పరచి విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. నూతన 2026 ఏడాదికి స్వాగతం పలుకుతూ విద్యార్థులు ఒకరోజు ముందుగానే పాఠ శాల ఆవరణలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు ప్రాంగణంలో రంగురంగుల ముగ్గులు వేసి 'హ్యాపీ న్యూ ఇయర్' పేర శుభాకాంక్షలు తెలుపుతూ వేసిన చిత్రాలు చూపరులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులంతా కలిసి కేక్ కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బ ృందం పాల్గొని విద్యార్థులకు నూతన సంవత్సర సందేశాన్ని అందించారు. చదువుతో పాటు ఇలాంటి స ృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో ఉత్సాహం పెరుగుతుందన్నారు. ఈ సంబరాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని పిల్లలను ఉత్సాహపరిచారు. పాఠశాల ఆవరణ అంతా విద్యార్థుల కేరింతలతో కోలాహలంగా మారింది.

మెడికల్ మాఫియాను కట్టడి చేయాలి..

రోగం ఖర్చుల కంటే మందుల పేర దోపిడే అధికం : కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గురిజాల గోపి

విశాలాంధ్ర - మణుగూరు : మణుగూరు ప్రాంతంలో కొనసాగుతున్న మెడికల్ మాఫియాపై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. రోగం కంటే ఖర్చుల కంటే మందుల ధరలు అధికంగా ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారని ప్రజల్లో ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇష్టారాజ్యంగా ధరలు పెంచి అమ్ముతున్న మెడికల్ షాపులను నియంత్రించాల్సిన జిల్లా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని సర్వత్ర విమర్శలు ఉన్నాయి. నెలవారి మామూలు అందుకే చాలు అనే ధోరణిలో అధికారులు ఉన్నట్లు ప్రజల ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గురిజాల గోపి విశాలాంధ్రతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మెడికల్ మాఫియా పై తీవ్ర విమర్శలు చేశారు. వందకు 80 శాతం వరకు మెడికల్ షాపుల్లో పనిచేసేవాళ్లే డాక్టర్లుగా అవతారం ఎత్తి ఇష్టారాజ్యంగా ఔషధాలు అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. ప్రజల మధ్య దైవంగా భావించే వైద్యులు కూడా ఏ మాత్రం మానవ విలువలకు ప్రాధాన్యత ఇవ్వకుండా సంపాదన లక్ష్యంగా పనిచేస్తున్నారని విమర్శించారు. వైద్యుల పట్ల ఉండాల్సిన ఆరాధన గౌరవభావం కాస్త దుష్టశక్తుల్లా నేటి ప్రజలు చూసే పరిస్థితులు దాపురించా యన్నారు. డాక్టర్ల వద్దకు ఎంతో నమ్మకంతో రోగుల ఆర్థిక స్థితిగతులు ఏమాత్రం పట్టించుకోకుండా కనికరం లేకుండా వ్యవహరిస్తున్నారని అనేక వదంతాలు వివరించారు. ప్రైవేట్ వైద్యులపై మెడికల్ షాపులపై జిల్లా అధికారులకు కానీ ప్రజా ప్రతినిధుల కానీ ఏమాత్రం అదుపు లేకుండా పోతున్నట్లు జనం నుంచి విమర్శలు వస్తున్నాయన్నారు సామాన్యులకు అందుబాటులో ఉండాల్సిన జనరిక్ మెడిసన్ ను కూడా మూడింత ధరలు పెంచి అమ్ముతూ దోపిడీకి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవస్థ లోపాలు, అధికార యంత్రాంగం అవినీతి వెరసి మెడికల్ షాపుల తోపాటు కొందరు ప్రైవేట్ వైద్యుల ఇష్టారాజ్యం కొనసాగుతుందని గోపి విమర్శించారు. డాక్టర్ ఫీజు వంద నుంచి ముదువందలు మాత్రమే ఉంటుందని రాసే మందుల ధరలు వేల రూపాయలకు చేరుకోవడం అన్యాయమన్నారు. ఎంతో నమ్మకంతో రోగులను వారి రోగస్థాయికి మించి మందులు రాయడం కూడా పక్క వ్యాపార దృ క్ప థాన్ని వెల్లడిస్తుందన్నారు. దీని వల్ల ప్రజల్లో రోగనిరోధక శక్తి క్షీణించి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా డ్రగ్స్ వ్యవహారాల అధికారులు ఏమాత్రం పట్టించుకోక పోవడానికి మామూళ్ల వ్యవహారమే అనేది ప్రజల్లో బహిరంగ రహస్యంగా మారిందన్నారు. ప్రజల సొమ్ముతో జీతాలు పొందుతున్న అధికారులు ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉందని హితవు పలికారు. అధికారుల తీరుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ప్రభుత్వం నిరయించిన ధరల జాబితాలను మెడికల్ షాపుల్లో, ఆసుపత్రుల్లో బహిరంగంగా ప్రదర్శించకుండా నిర్లక్ష్యం చేయడంపై జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సామాన్య ప్రజల మనిషిగా పేరు ఉన్న జిల్లా కలెక్టర్ మాత్రమే ఈ మాఫియాను నియంత్రించగలరని ఆశాభావం కూడా ప్రజల్లో వ్యక్తమౌవుతుందని గోపి స్పష్టం చేశారు. ఈ మాఫియా నియంత్రణకు జిల్లా స్థాయి విచారణ కమిటీ ఏర్పాటు చేసి, అధికారుల పనితీరుపై కూడా సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేసారు. ప్రజల అనారోగ్యాన్ని వ్యాపార దృక్పథంతో చూడకుండా వైద్యుల్లో సేవ భావజాలం రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దోపిడీ పరిణామాలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని విచారణ కోరారు.

2026 వాల్ క్యాలెండర్ ఆవిష్కరించిన జిల్లా జడ్జి వసంత్ పాటిల్

విశాలాంధ్ర -కొత్తగూడెం క్రైమ్ : ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన 2026 వాల్ కేలండర్ ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత్ పాటిల్ ఆవిష్కరించారు. బుధవారం కొత్తగూడెం బార్ అసోసియేషన్ లైబ్రరీ హాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. గత నాలుగేళ్ల నుంచి ఐలు కోర్టు కేలండర్ తీసుకురావటం అభినందనీయమని జడ్జి కొనియాడారు. ఈ సందర్భంగా కోర్టు పాకెట్ కేలండర్ ను కూడా జిల్లా జడ్జి చేతుల మీదుగానే విడుదల చేశారు. కేలండర్ ఆవిష్కరణ అనంతరం ఐలు ఆధ్వర్యంలో నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ కేక్ కటింగ్ చేసారు. ఈ కార్యక్రమానికి ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ మక్కడ్ అధ్యక్షత వహించారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కిరణ్ కుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కవిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుచరిత, రెండవ అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ రవి కుమార్, మణుగూరు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ సూరెడ్డి, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి భాగం మాధవ రావు, ఐలు నేషనల్ కౌన్సిల్ సభ్యులు జలసూత్రం శివరాం ప్రసాద్, జిల్లా అధ్యక్షులు యమ్.వీ. ప్రసాద రావు, ఐలు రాష్ట్ర కార్యదర్శి పొనుగోటి కిషన్ రావు, కటికం పుల్లయ్య మీసాల వెంకటేశ్వర్లు, మహిళా వింగ్ కమిటీ సభ్యులు గాదె సునంద, జి.కే.అన్నపూర?, కొత్తగూడెం కోర్టు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు రావిలాల రామా రావు, కిలారు పురుషోత్తం రావు, కమిటీ నాయకులు దుంద్రు రమేష్, నంబూరి రామక ృష్?, దూదిపాల రవి కుమార్, తెల్లబోయిన రమేష్, ఉప్పు అరుణ్, పగిడిపల్లి రవి, దేశబోయిన రాజేందర్, అభిషేక్, కోర్సా పాపా రావు, మణుగూరు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పోశం భాస్కర్, రామ్మోహన్ భద్రాచలం కమిటీ అధ్యక్షులు బందారు అరుణ్ చంద్ పాల్గొన్నారు

వాటర్ ట్యాంక్‌లను శుద్ధికరణ చేయుస్తున్న సర్పంచ్, ఉపసర్పంచ్

విశాలాంధ్ర - చంద్రుగొండ :మండల కేంద్రం మేజర్ గ్రామపంచాయతీ చంద్రుగొండ గ్రామంలో గ్రామపంచాయ తీలో ఎంతోకాలంగా అపరిశుభ్రంగా ఉన్న మంచినీటి ట్యాం కులను నూతన సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి ఉపసర్పంచ్ అంతటి రామక ృష్ణ తమ వార్డు సభ్యులతో వెళ్లి దగ్గరుండి శుభ్రం చేయించారు. సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని తపన సర్పంచ్ రుక్మిణికి ఉంటుందని పంచాయతీ ప్రజల్లో నమ్మకముంది. గతంలో ఈయన సర్పంచిగా చేసిన కాలంలోనూ వేగవంతమైన చర్యలతో బాధితులం దరికి అందుబాటులో ఉండే సర్పంచ్ గా మంచి పేరుంది. కాగా నూతన కార్యవర్గ సభ్యులు సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డు సభ్యులు కలిసి పంచాయతీలో ఉన్న మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయటంతో స్థానికులు అభినందిస్తున్నారు. చాలాకాలం అధికారుల పాలనలో ఉన్న పంచాయతీల్లో మంచినీటి ట్యాంకులను పట్టించుకోలేదని విమర్శలు కూడా ఉండేవి. అయితే ఇటీవల సర్పంచ్‌గా ఎన్నికైన రుక్మిణి తోపాటు మొదటిసారి ఉప సర్పంచ్ పదవి చేపట్టిన రామక ృష్ణ క్రియాశీలంగా వ్యవహరిస్తూ స్థానిక ప్రజలను ఆకట్టుకుం టున్నారు. కొత్త సంవత్సరంలో కొత్త పరిపాలన అందించాలని ఉద్దేశంతో ప్రజల సమస్యపై ద ృష్టి సారించారు. .ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉప సర్పంచ్ తో పాటు యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సంకా శంకర్, వార్డు సభ్యులు బుంగా శ్రీనివాసరావు, నునావత్ పంతులు, పవన్ సాయి, చాపల మడుగు మనోహర్, నరేష్ పాల్గొన్నారు.

వన సంరక్షణ సమితితో అటవీ సంరక్షణ..

రాష్ట్ర రెవెన్యూ, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వన సంరక్షణ సమితి బృందాల ఆర్థికాభివృద్ధికి చర్యలు

వన సంరక్షణ సమితి మీటింగ్ హాల్ను ప్రారంభించిన మంత్రి

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం/కల్లూరు : వన సంరక్షణ సమితి తో అటవీ సంరక్షణ, అభివ ృద్ధికి అటవీ శాఖ కు చక్కటి సహకారం లభిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు మండల పరిషత్ అభివ ృద్ధి అధికారి కార్యాలయ ఆవరణలో నిర్మించిన వన సంరక్షణ సమితి సమావేశ మందిరాన్ని మంత్రి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ, వన సంరక్షణ సమితిని ప్రోత్సహిస్తే, అడవికి మంచి జరుగుతుందని అన్నారు. కనకగిరి, పులిగుండాల తదితర అటవీ ప్రాంతాల్లో 4 నుండి 5 వన సంరక్షణ సమితులు క్రియాశీలకంగా పనిచేస్తున్నట్లు ఆయన అన్నారు. ఇందులో నుండి గుర్తించిన ఒక సమితిని పైలట్ ప్రాజెక్ట్ గా తీసుకొని వారిని ఆర్థికంగా ప్రోత్సహించడానికి రూ. 20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. విదేశాలకు విహారాలకు కోట్లు పెట్టి వెళతారని, మన చుట్టూ విహారానికి అద్భుతమైన ప్రదేశాలు ఉన్నాయని అన్నారు. జిల్లాలో పులిగుండాల, కనకగిరి హిల్స్ సుమారు 35 వేల ఎకరాలకు ఒకే బిట్ గా అటవీ ప్రాంతం విస్తరించివుందని తెలిపారు. ఈ ప్రాంతం ఎంతో బాగుందని, విదేశాల్లో ఉన్న పర్యాటక ప్రాంతాల రేంజ్ లో వీటిని తీర్చిదిద్దే అవకాశం ఉందని అన్నారు. అడవులను రక్షించుకుంటూ, వన్యప్రాణులను కాపాడుకుంటూ, వినోదానికి, గిరిజనులకు ఉపయోగ పడి, లబ్ధి కలిగే విధంగా ప్రోత్సహిస్తూ ప్రణాళిక చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి కార్యాచరణకు కావాల్సిన నిధులు మంజూరు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. అటవీ పరిరక్షణ చాలా అవసరమని, అటవీ పరిరక్షణలో పౌరులుగా మన అందరిపై బాధ్యత ఉందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, 13 లక్షల వ్యయంతో వన సంరక్షణ సమితి సమావేశ మందిరాన్ని నిర్మించి, ప్రారంభించుకున్నామన్నారు. 35 వేల ఎకరాల అటవీ ప్రాంతాన్ని కబ్జా, ఆక్రమణ నుండి కాపాడడంలో వన సంరక్షణ సమితి పాత్ర కీలకంగా ఉందన్నారు. వన సంరక్షణ సమితి ఆర్థికాభివ ృద్ధి కి జిల్లా యంత్రాంగం నుండి అన్ని విధాలా సహకారం ఇస్తామన్నారు. కనకగిరి, పులిగుండాల, నీలగిరి పార్క్ లలో వారాంతం గడిపేలా అభివ ృద్ధికి చర్యలు చేపడతామన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, అడవులు, చెట్లు లేకపోతే మానవ మనుగడ లేదన్నారు. పర్యావరణ పరిరక్షణకు అడవులు ఎంతో అవసరమన్నారు.

చెట్ల పెంపకం, వన సంరక్షణపై ప్రత్యేక ద ృష్టి పెట్టాలన్నారు. పులిగుండాల, కనకగిరి హిల్స్ ప్రాంతాలను ప్రోత్సహించి అభివ ృద్ధి చేస్తే, చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలకు ఆదాయంతో పాటు ఉపాధి లభిస్తుందని తెలిపారు. అంతకుముందు మంత్రి పులిగుండాల ఎకో టూరిజం విహారానికి రెండు వాహనాలను ప్రారంభించారు. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారిచే ఉచితంగా పంపిణీ జ్యూస్, సబ్బులు, విస్తరాకులు తయారీ యూనిట్లను వన సంరక్షణ సమితిలకు అందజేశారు. వన సంరక్షణ సమితి సభ్యులను మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర యాదవ్, ఎఫ్ డిఓ మంజుల, కల్లూరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నీరజ ప్రభాకర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ లో బిల్లు కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలి

బిసి సంఘాల జాక్ చైర్మన్ శ్రీనివాస గౌడ, కన్వీనర్ మదత వెంకట్

విశాలాంధ్ర - ఇల్లందు : రాష్ట్రంలో బిసి వర్గాల ప్రజల అభ్యున్నతికి రూపొందించిన 42 శాతం రిజర్వేషన్లు సాధించేవరకు విశ్రమించబోమని జాతీయ జాక్ చైర్మన్ రోజుల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర జాక్ కన్వీనర్ మదత వెంకట్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ ప్రయత్నంలో భాగంగా పార్ల మెంటు లో 42 శాతం బీసీలకు బిల్లు ప్రవేశ పెట్టేలా క ృషి చెయ్యాలని, ఆమోదం కోసం వత్తిడి చేయాలని బిసి సంక్షేమ సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారులు వేం నరేందర్ రెడ్డి ని వారు బుధవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. హైదరాబాదులో నరేందర్ రెడ్డిని కలిసిన నాయకులు మాట్లాడుతూ ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలు రిజర్వేషన్లు లేకపోవడంతో బీసీల ప్రాతినిధ్యానికి చాలా నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభాలో 60 శాతం పైబడి ఉన్న బిసి లకు రిజర్వేషన్లు తగ్గడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో ఎంత నష్టపోవాల్సి వస్తుందో నాయకులు చాలా వివరంగా నరేందర్ రెడ్డి కి లెక్కలు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన బిసి వర్గాల రిజర్వేషన్లు పార్ల మెంటు ఆమోదం పొందక పోతే ఈ వర్గాల ప్రయోజనాలు తీవ్రంగా దెబ్బతింటాయన్నారు. అందుకోసం కాంగ్రెస్ పార్టీ చొరవ తీసుకుని అఖిలపక్షాల మద్దతు కూడగట్టి పార్లమెంట్లో గళం వినిపించాలని అభ్యర్థించారు. బీసీ వర్గాలు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు రావలసిన సమయం ఆసన్నమైందని ఈ సందర్భంగా శ్రీనివాస గౌడ్, మదత వెంకట్ గౌడ్ లు పిలుపునిచ్చారు.

2026 ప్రజల్లో సుఖసంతోషాలు తేవాలి

సోయం వీరభద్రం

విశాలాంధ్ర, దమ్మపేట : నియోజకవర్గ ప్రజలకు అభిమానులతోపాటు సర్వ మానవాళికి 2026 సంవత్సరం ఆయురారోగ్యాలతో కూడిన సంతోషాలు తేవాలని బిఆర్ ఎస్ నాయకులు సోయం వీరభద్రం ఆకాంక్షించారు. బుధవారం ఆయన ఒక ప్రకటనలొ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. గత ఏడాది ఎదురైన చేదు జ్ఞాపకాలను విస్మరించి, సరికొత్త ఆశలు, ఆశయాలతో నూతన ఏడాదికి స్వాగతం పలకాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే నూతన సంవత్సరం అశ్వరావుపేట నియోజకవర్గ ప్రజలందరి జీవితాల్లో సంక్షేమ, అభివ ృద్ధి వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. స ృష్టి కర్త అయిన ఆ దైవం అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో సుఖశాంతులు నింపాలని ప్రార్థించారు. తనను ఆదరిస్తున్న మిత్రులు, బంధువులు, పార్టీ కార్యకర్తలకు క ృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి కూలీలకు పనిముట్ల పంపిణీ

పేదలకు ఉపాధి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యత : సర్పంచ్ రమాదేవి

విశాలాంధ్ర- దమ్మపేట: గ్రామీణ పేదలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఉద్దేశంతోనే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో దివంగత ప్రధాని మన్మోహన్ సింగ్ హాయంలో తీసుకురావటం జరిగిందని దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి అన్నారు. పేదల అభ్యున్నతి లక్ష్యంగా సుమారు 18 ఏళ్లుగా కొనసాగుతున్న పథకాన్ని ప్రధాని నరేంద్ర మోడీ సారధ్యంలోని ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరు తొలగించి నిర్వీర్యం చేసే కుట్రలు పన్నుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కాగా బుధవారంమండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వం తరపున ఉచితంగా మంజూరు చేసిన పారలను సర్పంచ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉపాధి కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం అన్నారు. పరికరాలు కూడా కొనుగోలు చేసుకోలేని కూలీలకు ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, బత్తులసాయి,రూపారాంబాబు, గ్రామస్తులు,పంచాయతీసిబ్బంది పాల్గొన్నారు.

కోతుల బెడద నివారించాలని మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం

జనంపై దాడులు చేస్తున్నాయి : యువజన నేతలు లక్ష్మణ్, మధు

విశాలాంధ్ర - ఇల్లందు : ఇల్లందు వ్యాప్తంగా కోతుల బెడద ప్రమాదకరంగా మారిందని అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోకుంటే జనానికి ప్రాణహాని జరిగే అవకాశం ఉందని యువజన కాంగ్రెస్ నాయకులు ఈసం లక్ష్మణ్, పూనెం మధు వెల్లడించారు. పట్టణంలో ఇటీవల కాలంలొ కోతుల బెడద ప్రతిరోజు తీవ్రంగా మారి ప్రజలకు ఘోర ఇబ్బందులకు గురిచేస్తున్న నేపథ్యంలో స్థానిక మున్సిపాలిటీ కమిషనర్ కు బుధవారం వినతి పత్రం అందించారు. వెంటనే స్పందించి చర్యలు తీసుకోకుంటే చాలా నష్టాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులపై కోతులు దాడులు చేసి గాయపరుస్తున్నాయని తమ వినతి పత్రంలో కమిషనర్ కు తెలిపారు. టిఫిన్ బాక్సులు లాగేయడంతోపాటు మీద పడి దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. ఈలాంటి పరిస్థితుల్లో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడానికి భయపడు తున్నట్లు చెప్పారు. ప్రజల భద్రత, విద్యార్థుల రక్షణ ద ృష్ట్యా కోతులను పట్టణ పరిధి నుంచి అటవీ ప్రాంతాలకు తరలించడం లేదా వాటి ఉత్పత్తిపై చర్యలు తీసుకోవాలని యువజన నాయకులు డిమాండ్ చేశారు. కోతుల బెడద తక్షణం నివారించుకుంటే ప్రజలను సమీకరించి ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. కమిషనర్ను కలిసిన వారిలో వీరా నాయుడు, రవి, రాకేష్, యశ్వంత్, రవితేజ లోకేష్ గౌతమ్, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

పనుల జాప్యంపై మంత్రి పొంగులేటి అసహనం

రెండు నెలల్లో పూర్తికావాలని ఆదేశం

పేరువంచ ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర ఖమ్మం /కల్లూరు : ప్రభుత్వ పాఠశాలల్లో అభివ ృద్ధి పనులు నత్తనడకన సాగడంపై రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బుధవారం కల్లూరు మండలం పేరువంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో గతంలో కంటే విద్యార్థుల సంఖ్య తగ్గడంపై అసంత ృప్తి వ్యక్తం చేసిన మంత్రి, అధికారుల పనితీరును ప్రశ్నించారు. ప్రహరీ గోడ సహా పెండింగ్‌లో ఉన్న పనులన్నీ రెండు నెలల్లోగా పూర్తి కావాలని, నిర్లక్ష్యం వహిస్తే కుదరదని స్పష్టం చేశారు. తాను మళ్లీ వచ్చేసరికి పనులు పూర్తికావాలని గడువు విధించారు. ప్రభుత్వ విద్యపై ప్రజల్లో నమ్మకం పెంచేలా అందరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

విశాలాంధ్ర

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీ నామ

విశాలాంధ్ర- ఖమ్మం : బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరం ప్రజల జీవితాల్లో ఆరోగ్యం, ఆనందం, విజయాలు, శాంతి నింపాలని ఆయన ఆకాంక్షించారు. గత సంవత్సరం ఎదురైన కష్టాలు, సవాళ్లు కొత్త సంవత్సరంలో తొలగిపోయి, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలని పేర్కొన్నారు. రైతులకు పంటలు సమృద్ధిగా పండాలని, కష్టానికి తగిన గిట్టుబాటు ధరలు లభించాలని, ఈ ఏడాది అయినా యూరియా కొరత సమస్యలు పూర్తిగా తొలగాలని నామ ఆకాంక్షించారు. యువతకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడాలని, వారి కలలు సాకారం కావాలని, మహిళలు అన్ని రంగాల్లో ముందంజ లో ఉండాలని, వారి భద్రత, గౌరవం కాపాడబడాలని పేర్కొన్నారు. విద్యార్థులు చదువులో రాణించి ఉత్తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరగాలని, అన్ని వర్గాల ప్రజలు ఐక్యతతో ముందుకు సాగాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతూ, ప్రజా సంక్షేమమే పరమావధిగా ముందుకు సాగుతానని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలుకాకపోవడం బాధాకరమని తెలిపారు. కనీసం ఈ ఏడాది అయినా ప్రజల ఆకాంక్షలను గౌరవించి, ఇచ్చిన హామీలను అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సంవత్సరం ప్రజలందరికీ శుభప్రదంగా ఉండాలని భగవంతున్ని నామ ప్రార్థించారు,

కోదాడ పెన్షనర్స్ భవన్‌లో ఘనంగా సామూహిక జన్మదిన వేడుకలు

కోదాడ-విశాలాంధ్ర : కోదాడ పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో నవంబర్, డిసెంబర్ నెలలో జరుపుకునే విశ్రాంత ఉద్యోగుల జన్మదిన వేడుకలను బుధవారం కోదాడ యూనిట్ అధ్యక్షులు వేనేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన సామూహికంగా కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బొల్లు రాంబాబుతో కలిసి జన్మదినం జరుపుకునే పెన్షనర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆనందంగా సంతోషంగా ఉంటేనే ఆరోగ్యానికి మంచిదని వృద్ధాప్యంలో సమస్యలకు దూరంగా ఉంటూ సంతోషంగా గడపాలన్నారు. ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత వైద్య సేవలు అందించడంతోపాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలన్నారు. సంఘ అభివృద్ధిలో సభ్యులందరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోదాడ యూనిట్ అధ్యక్షులు వేనేపల్లి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు బొల్లు రాంబాబు, విద్యాసాగర్ రావు, అసోసియేట్ ప్రెసిడెంట్ వరకాల జానయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి హాజీ నాయక్, పొట్ట జగన్మోహన్ రావు, భూపాల్ రెడ్డి, ఎస్ దాని,బాలేమియా, బిక్షం, నీరజ,భ్రమరాంబ, తిరుపతమ్మ,శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచిలో యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

విశాలాంధ్ర ఖమ్మం/ కూసుమంచి : యూరియాను రైతులకు సకాలంలో ఎలాంటి ఆంక్షలు, లింకులు లేకుండా అందజేయాలని డిమాండ్ చేస్తూ.. స్థానిక రైతులు కూసుమంచి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. యూరియా సరఫరాలో అమలవుతున్న యాప్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న వ్యవసాయ శాఖ అధికారులు మండల వ్యాప్తంగా రేపటి నుంచి మండలంలోని 17 సెంటర్లలో రైతులకు యూరియా అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

సంక్షేమానికి సింగరేణి సంస్థ పెద్దపీట: జీ.ఎం.లు

విశాలాంధ్ర- మంథని: సింగరేణి సంస్థ సంక్షేమానికి ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తుందని, సంక్షేమ కార్యక్రమాలకు ఏప్పుడు వెనుకాడదని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లు అన్నారు. స్థానిక జి.యం కార్యాలయ నందు సుమారు 10 లక్షల రూపాయల వ్యయము తో నిర్మించిన మల్టీ పర్పస్ హాల్ ను రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ సంక్షేమానికి ఎప్పుడు వెనకాడదని, జీ.యం కార్యాలయానికి వివిధ పనుల పై వచ్చే ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు, సంస్థ పరంగా నిర్వహించే కార్యక్రమాల కోసం, జి.యం కార్యాలయ ఆవరణలో నిర్మించిన విశాలమైన మల్టీ పర్పస్ హాల్ ను అందరూ కూడా ఉపయోగించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు శ్రీమతి అలివేణి సుధాకర రావు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్ర రెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఎస్వోటుజీఎంలు యం.రామ్మోహన్, బండి సత్య నారాయణ, ఏరియా ఇంజినీర్ సుధాకర్ రెడ్డి, ప్రాజెక్ట్ అధికారి జె.రాజశేఖర్, సివిల్ డిజీఎం రాజేంద్ర కుమార్, విభాగాధిపతులు రాజా రెడ్డి, మురళి కృష?, సుదర్శనం, జనార్ధనరెడ్డి, సురేఖ, ఐలయ్య, రాజేశ్వరి, లతో పాటు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన జి.ఎం కు ఆత్మీయ సన్మానం

విశాలాంధ్ర- మంథని: అడ్రియాల లాంగ్ వాల్ గని ఆవరణలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉద్యోగ విరమణ పొందిన రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు, సేవా అధ్యక్షురాలు శ్రీమతి అలివేణి సుధాకర రావు లను అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, ఇతర అధికారులు కలిసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జి.యం ఏ.పి.ఏ మాట్లాడుతూ నరేంద్ర సుధాకరరావు సింగరేణి సంస్థలో 40 సంవత్సరాల పాటు వివిధ ఏరియాలలో, వివిధ గనులు, విభాగాలలో, వివిధ హోదాలలో విధేయతతో, అంకితభావంతో అందించిన సేవలు అందరికీ ఆదర్శమన్నారు.పలు సంస్కరణలు చేపట్టి ఉన్నతాధికారుల మన్ననలు పొందారన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ కె.యాదయ్య, ఎస్వోటుజీఎం బండి సత్య నారాయణ, ప్రాజెక్ట్ ఇంజినీర్ రఘురామ్, మేనేజర్ పెంచలయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గెలిచిన వారే కాదు.. ఓడిన వారూ సర్పంచులే..

రూ. 22,500 కోట్లతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం..

నియోజకవర్గానికి 3,500 ఇళ్లు :అధికారం పోయినా విర్రవీగితే విజ్ఞత నేర్పుతాం

విపక్షాలకు మంత్రి హెచ్చరిక!

పాలేరు సర్పంచులకు మంత్రి పొంగులేటి ఆత్మీయ అభినందన..

విశాలాంధ్ర -బ్యూరో ఖమ్మం "పాలేరు నియోజకవర్గంలో వెల్లువెత్తిన ప్రజా చైతన్యం స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల్లో ప్రతిబింబించింది. ఈ విజయం అహంకారానికి తావు ఇవ్వకూడదు.. బాధ్యతను గుర్తు చేయాలి. గెలిచిన సర్పంచులు ప్రజల కష్టాల్లో తోడుండాలి. ఎన్నికల్లో గెలిచిన వారే కాదు, స్వల్ప తేడాతో ఓడిన వారు కూడా నా దృష్టిలో సర్పంచులే అంటూ రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణం సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆ నియోజకవర్గంలో గెలిచిన సర్పంచులకు ఆత్మీయ అభివందనం పలికారు.

బుధవారం ఖమ్మం వైరా రోడ్డులోని ఎస్. ఆర్. గార్డెన్స్‌లో పాలేరు నియోజకవర్గ నూతన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల 'ఆత్మీయ సన్మాన సభ' అట్టహాసంగా జరిగింది. కాంగ్రెస్ బలపరిచిన సర్పంచులతో పాటు మిత్ర పక్షాల నుంచి ఎన్నికైన వారికి మంత్రి పట్టువస్త్రాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

సభలో మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 134 పంచాయతీల్లో సుమారు 70 శాతం కాంగ్రెస్ మద్దతుదారులు జయకేతనం ఎగురవేయడం శుభపరిణామన్నారు. "మనలో మనకు ఉన్న చిన్నపాటి విభేదాల వల్ల కొన్ని చోట్ల ఇద్దరు ముగ్గురు పోటీ పడటంతో స్వల్ప తేడాతో సీట్లు చేజారాయి. అయినప్పటికీ, పదేళ్లు ఏలిన వారు నేడు వేళ్ల మీద లెక్కపెట్టే స్థాయికి పడిపోయారంటే ప్రజలు ఎవరి వైపు ఉన్నారో స్పష్టమైంది" అని విశ్లేషించారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇదే తరహా మెరుగైన ఫలితాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. "కేంద్రం సాయం లేకున్నా, రాష్ట్ర ప్రభుత్వమే రూ. 22,500 కోట్లతో ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల చొప్పున తెలంగాణ రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తోంది. పాలేరుకు తొలి విడతలో 3,500 ఇళ్లు కేటాయించాం. గత 20 ఏళ్లలో జరగని అభివృద్ధిని ఈ రెండేళ్లలో ప్రతి గ్రామంలో కంటికి కట్టినట్లు చూపించాం. సీసీ రోడ్లు, డ్రైన్లు, బీటీ రోడ్లు, అగ్రికల్చర్ కనెక్షన్లతో గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం. దేశ చరిత్రలోనే తొలిసారి సన్న బియ్యం పంపిణీ ద్వారా పేదవాడి ప్రభుత్వంగా గుర్తింపు పొందాం" అని వివరించారు.

ప్రతిపక్షాల తీరుపై మంత్రి గారు నిప్పులు చెరిగారు. "గత ప్రభుత్వం కేవలం మాటలతో, ఊహలతో కాలక్షేపం చేసింది. అధికారం పోయినా అహంకారం తగ్గని కొందరు నాయకులకు కాలమే బుద్ధి చెబుతుంది. మాది కక్షపూరిత ప్రభుత్వం కాదు.. కానీ విర్రవీగితే సహించేది లేదు" అని హెచ్చరించారు. నాయకులు ప్రజలకు దూరం కావొద్దని, ప్రభుత్వం చేస్తున్న పనులను గడప గడపకూ వివరించాలని దిశానిర్దేశం చేశారు. 2025లో తీపి జ్ఞాపకాలు చూశామని, 2026లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో తెలంగాణ ప్రజలందరి జీవితాల్లో మరిన్ని సంతోషాలు నిండాలని మంత్రి గారు ఆకాంక్షించారు. ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. పాలేరు నియోజకవర్గ అభివృద్ధికి తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, పాలేరు నియోజకవర్గ ముఖ్య నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు భారీగా పాల్గొన్నారు

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని కొనసాగించాలి

విశాలాంధ్ర-పెనుబల్లి : నూతనంగా బిజెపి కేంద్ర ప్రభుత్వం తెచ్చిన,వి బి జి రామ్ జి పథకాన్ని రద్దు చేయాలి రౌండ్ టేబుల్ సమావేశం డి మాండ్. పెనుబల్లి, డిసెంబర్ 31 2025. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పెనుబల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో చలమల సూర్యనారాయణ భవన్ లో మండల అధ్యక్షులు గాయం తిరుపతి రావు అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఉపాదాన్ని చట్టాన్ని రద్దు చేయాలని ప్రయత్నంలో భాగంగా అనేక కఠిన నిబంధనలు తెచ్చిందని డిసెంబర్ 18వ తారీకు పార్లమెంటులో వికసిక్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అజీవక మిషన్(గ్రామీణ)పేరుతో వి బి జి రాంజీ బిల్లు తెచ్చి పాత చట్టాన్ని రద్దు చేసిందని ఇది ఉపాధి కార్మికులకు ఉపాధి లేకుండా చేయడమేనని ఆయన అన్నారు నాడు గాంధీని హత్య చేసిన గాడ్సే వారసులే నేడు ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేశారని ఆయన విమర్శించారు అనేక సందరాల్లో కరోనా లాంటి ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు గ్రామాలలో ఉపాధి చట్టం ద్వారా పనిచేసే కుటుంబాలను పోషించుకున్నారని గ్రామాల్లో ఉపాధి పొందుతున్న వారిని కేంద్ర బిజెపి ప్రభుత్వం ఆకలి చావులతో హత్యచేపనుకున్నదని ఇది దుర్మార్గమైన చర్యని ఆయన అన్నారు దేశంలో 18 కోట్ల మంది ఆధారపడిన ఉపాధి చట్టాన్ని బడ్జెట్ కేటాయించకుండా కఠిన నిబంధనలు తెచ్చి నేడు చట్టాన్ని రద్దు చేసిందని ఆయన విమర్శించారు ఆర్థిక సమస్యలతో సతమవుతమవుతున్న రాష్ట్రాలను 40 శాతం భరించాలని కేంద్రం 60 శాతమే భరిస్తుందని కొత్త పథకంలో పెట్టడం పేదలకు పని లేకుండా చేయడమేనని ఆయన అన్నారు అనేక రాష్ట్రాలు సంక్షేమ పథకాలకు వారిచ్చిన హామీలకు బడ్జెట్ లేక ఇబ్బందులు పడుతుంటే మూలికైనక్కపై తాటికాయ పడ్డట్టు రాష్ట్రాలపై భారం మోపడం అన్యాయం అన్నారు జీఎస్టీ పేరుతో ప్రతి నెల రెండు లక్షల కోట్లు బడ్జెట్ సేకరిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఉపాధి గ్రామీణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వమే నిర్వహించాలని నూతన చట్టాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు చట్టం రద్దు కోసం భవిష్యత్తులో జరగబోయే అన్ని పోరాటాలను ప్రజలందరూ పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా కలిసి రావాలని అన్ని రాజకీయ పార్టీలకు సామాజిక సంఘాలకు కార్మిక సంఘాలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం డివిజన్ కార్యదర్శి జాజిరి శ్రీను సీఐటీయూ జిల్లా కోశాధికారి చలమాల విటల్ గోపిశెట్టి వెంకటేశ్వర్లు,వంగ గిరిజపతిరావు భూక్య ప్రసాద్, తాళ్లూరి రవి మల్లెల శ్రీనివాస్ రావు , తుమ్మలపల్లి రాజేశ్వరరావు ఎండి బాబు మేకతోటి కాంతయ్య మాల మహానాడు కాటనేని శ్రీనివాసరావు అన్నపురెడ్డి శ్రీనివాసరావు తడికమల్ల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ 'కారు' దిగి కాంగ్రెస్ బాట!

ఎన్నికలు ముగిసినా ఆగని చేరికల జోరు

హస్తం గూటికి 45 కుటుంబాలు

పొంగులేటి సమక్షంలో చేరిక

విశాలాంధ్ర ఖమ్మం/ కూసుమంచి : పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగిసినా బిఆర్ఎస్‌కు వరుస షాక్‌లు తగులుతూనే ఉన్నాయి. తాజాగా కూసుమంచి మండలం జుజ్జులరావుపేట గ్రామంలో బిఆర్ఎస్ పార్టీకి ఆ పార్టీ ముఖ్య నేతలే గట్టి ఎదురుదెబ్బ ఇచ్చారు. మాజీ సర్పంచ్ పడిశాల గోపి, మాజీ ఎంపీటీసీ బారి నాగేశ్వరరావు తమ అనుచర వర్గంతో కలిసి గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ బాట పట్టారు. ప్రధాన నేతల మూకుమ్మడి వలస కంచర్ల జీవన్ రెడ్డి నాయకత్వంలో గ్రామానికి చెందిన బిఆర్ఎస్ గ్రామ కార్యదర్శి శ్రీరాముల రాము, మల్లెబోయిన వీరభద్రం, పడిశాల మహేష్ సహా దాదాపు 45 కుటుంబాలు బుధవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నాయి. గ్రామంలో ఆ పార్టీకి వెన్నెముకగా ఉన్న నేతలే ఒక్కసారిగా పార్టీ వీడటంతో జుజ్జులరావుపేటలో బిఆర్ఎస్ ఖాళీ అయినట్లయ్యింది. సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న ప్రజాక్షేమ పథకాలు, నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలే తమను కాంగ్రెస్ వైపు నడిపించా యని ఈ సందర్భంగా పడిశాల గోపి, నాగేశ్వర రావు పేర్కొన్నారు. "ప్రజల పక్షాన నిలిచే నాయకత్వమే మాకు ముఖ్యం.. అందుకే కాంగ్రెస్‌లో చేరాం" అని వారు స్పష్టం చేశారు.

గ్రామస్థా యిలో పట్టున్న నాయకులు హస్తం గూటికి చేరడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొని కొత్తగా చేరిన వారికి ఆహ్వానం పలికారు.

జిల్లా కాంగ్రెస్ కార్యవర్గం రద్దు

నూతన కమిటీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాల డీసీసీ అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కార్యవర్గ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీలక నిర్ణయాలను ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న జిల్లా కార్యవర్గ కమిటీని రద్దు చేస్తున్నామని, నూతన కార్యవర్గ ఏర్పాటు కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని వెల్లడించారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం

ఏఐసీసీ ఆదేశాల మేరకు, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో తెలంగాణలోని ప్రతి జిల్లా కమిటీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని రఘునాథ్ రెడ్డి తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేసే, అధికారికంగా అర్హతలున్న నాయకులను మాత్రమే నూతన కార్యవర్గంలోకి తీసుకోవడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

పదవులు పొందిన ప్రతి నాయకుడికి నిర్దిష్ట బాధ్యతలు అప్పగిస్తామని, వారు తమ పరిధిలో పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2029 పార్లమెంటు ఎన్నికల్లో రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా మంచిర్యాల జిల్లా కార్యవర్గం అంకిత భావంతో పనిచేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

కార్యకర్తలే పార్టీకి ప్రాణం

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అబ్జర్వర్, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ రహమతుల్లా హుస్సేన్ మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్తను ఒక గొప్ప నాయకునిగా తీర్చిదిద్దడమే తమ ఉద్దేశమని అన్నారు. అభ్యర్థుల బాధ్యతలను, పనితీరును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే రాష్ట్ర, జిల్లా, మండల, బ్లాక్ టౌన్ స్థాయి పదవుల్లో నియామకాలు చేపడతామని వివరించారు. ఈ సమావేశంలో జిల్లాలోని వివిధ నియోజకవర్గాల ప్రస్తుత మాజీ పిసిసి సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే ఎన్.ఎస్.యు.ఐ, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సెల్, సేవ దళ్, ఐ ఎన్ టి యు సి ఇతర అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొని తమ దరఖాస్తులను డీసీసీ అధ్యక్షులకు అందజేశారు.

కృష్ణవేణి విద్యా సంస్థలలో ముందస్తు ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు

విశాలాంధ్ర- మంథని: స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్, హిల్-పోర్ట్ హై స్కూల్, సాయి ప్రగతి విద్యానికేతన్ పాఠశాలల్లో ముందస్తు ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతి రెడ్డి, ప్రిన్సిపాల్ బర్ల శ్రీనివాస్ గార్ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు అందరూ సాంప్రదాయ దుస్తులలో వచ్చి తమ ఆట పాటలు మరియు నృత్యాల ద్వారా 2025 సంవత్సరంలో జరిగిన మధుర స్మృతులను తలచుకుంటూ, ఆ సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ, 2026 నూతన ఆంగ్ల సంవత్సరమునకు స్వాగతం పలికారు.

రాష్ట్ర స్థాయి సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎం.జె.పి విద్యార్థుల ప్రభంజనం

విశాలాంధ్ర,బోనకల్: రాష్ట్ర స్థాయిలో మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలు నిర్వహించిన కార్నివాల్ మరియు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బోనకల్ ఎం జె పి బిసి గురుకుల విద్యార్థులు జూనియర్ హిందీ ఉపన్యాసం (వక్తృత్వం) లో 5వ తరగతి విద్యార్థి ఎండి అర్హాన్ ప్రథమ స్థానం ,సంగీత వాయిద్యాలు పరికరాలు విభాగంలో 6వ తరగతి విద్యార్థి కె.ప్రణయ్ కుమార్ ద్వితీయ స్థానాన్ని ప్రత్యేక ప్రతిభను కనబరచి విజయం సాధించడం జరిగింది. మరియు 9వ తరగతి విద్యార్థి టి.రోహిత్ కుమార్ మిమిక్రీ విభాగంలో ఉత్తమ ప్రదర్శన చేయడం జరిగింది ఈ విజయాలుకుగాను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి జ్యోతిర్మయి మేడం గారు మరియు ఏటీపీ నరేష్ గారు ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు తెలుపడం జరిగింది.

శతాదిక వృద్ధురాలి మృతి

నివాళ్లు అర్పించిన సర్పంచ్ హీరాలాల్

విశాలాంధ్ర -కారేపల్లి : మండల పరిధిలోని భాగ్యనగర్ తండా గ్రామపంచాయితీ లావుడ్యా తండా గ్రామానికి చెందిన శతాదిక వృద్ధురాలు భూక్యా సామ్ని (106)సంవత్సరాలు బుధవారం ఉదయం మరణించారు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ బానోతు హిరాలాల్ వారి పార్థివదేహానికి పూలమాలతో నివాళ్లు అర్పించి, వారి కుటుంబానికి సానుభూతి తెలియజేసారు. సామ్ని సంపూర్ణ జీవితం గడిపారని, ఈ కాలంలో సుదీర కాలం పాటు జీవించటం అరుదు అని తెలిపారు. నివాళులర్పించిన వారిలో ఉప సర్పంచ్ గుగులోత్ భిక్కులాల్, వార్డ్ సభ్యులు గాంధీ,అంకు,మాజీ ఎంపిటిసి బానోత్ రాంచందర్, లావుడ్యా భద్రు,కృష్ణ నర్సన్,బాల, తారాచంద్,జర్నలిస్ట్ కళ్యాణ్, రమేష్ తదితరులు ఉన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సింది ఉపాధ్యాయులే

సమాజ నిర్మాణంలో టీచర్ల దే కీలక పాత్ర

కమల టీచర్ పదవీ విరమణ సభలో సీఎం పీఆర్వో దూదిపాళ్ళ విజయ్

విశాలాంధ్ర- కారేపల్లి : ప్రతి ఒక్కరిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని ఉత్తమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పీఆర్వో దూదిపాళ్ళ విజయ్ కుమార్ అన్నారు. బుధవారం కారేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ లో సైన్స్ టీచర్ గా చేసి ఉద్యోగ విరమణ చేసిన భీమవరపు కమల పదవీ విరమణ సన్మానోత్సవ కార్యక్రమాన్న పాఠశాలలో ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీఎం పీఆర్వో దూదిపాళ్ళ విజయ్ కుమార్ మాట్లాడుతూ కొత్త కమలాపురం ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక విద్యను అందించిన కమల టీచర్ నాతోపాటు నా గ్రామంలో ఎంతోమంది ఉన్నత స్థితికి చేరడానికి దోహదపడ్డారని కొనియాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు జ్ఞానాన్ని,నైపుణ్యాలను నేర్పించి వారిని సరైన మార్గంలో నడిపించే మార్గదర్శకులని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు సరైన దిశా నిర్దేశం చేస్తూ ఎందరినో తీర్చిదిద్ది వారి జీవితాల్లో వెలుగులు నింపగల శక్తి వంతులు ఉపాధ్యాయులేనని అన్నారు.అనంతరం కమల- శ్రీనివాసరావు దంపతులను శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో కారేపల్లి సర్పంచ్ మేదరి వీరప్రతాప్, సింగరేణి కాలరీస్ డీజీఎం హరి ప్రసాద్,హైస్కూల్ హెడ్మాస్టర్ శ్యామ్,కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు,రిటైర్డ్ ఎంఈఓ లు నున్న అప్పారావు,యేసుదాసు, రిటైర్డ్ ఉపాధ్యాయులు గాలి రంగారావు,ఎండీ బాబు, చెవుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లాలో కుష్టువ్యాధి గాలింపు సర్వే పూర్తి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. డి. రామారావు

విశాలాంధ్ర -ఖమ్మం : జిల్లాలో అంచనా వేసిన జనాభా : 15,77,120 9, 44,943 మందికి పరీక్షలు. జిల్లాలో సర్వే బృందాలు 2,55,363 ఇళ్ల సందర్శన. 1,369 మంది అనుమానితుల గుర్తింపు. 5 కొత్త కేసులు గుర్తింపు అయిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. డి. రామారావు పేర్కొన్నారు.జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఖమ్మం జిల్లాలో ఈ నెల 18 నుంచి 31 వరకు నిర్వహించిన కుష్టువ్యాధి గాలింపు సర్వే ముగిసింది. ఈ సర్వేలో జిల్లా వ్యాప్తంగా మొత్తం 5 కొత్త కుష్టు వ్యాధి కేసులు గుర్తించడం జరిగింది.జిల్లాలో అంచనా వేసిన మొత్తం జనాభా 15,77,120 కాగా, ఈరోజు వరకు 9,44,943 మందికి పరీక్షలు నిర్వహించాము . జిల్లాలో ఉన్న మొత్తం 3,67,012 ఇళ్లలో సర్వే బృందాలు 2,55,363 ఇళ్లను సందర్శించి పరిశీలనలు ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ గాలింపు చర్యలలో భాగంగా 1,369 మంది అనుమానితులను గుర్తించి వారికి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించగా తుది పరీక్షల అనంతరం 5 నిర్ధారిత కుష్టు వ్యాధి కేసులు నమోదు అయ్యాయి. గుర్తించిన బాధితులకు తక్షణమే ఉచిత మల్టీ డ్రగ్ థెరపీ చికిత్స ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. కుష్టువ్యాధి పట్ల ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, ప్రారంభదశలోనే గుర్తిస్తే ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు. చర్మంపై స్పర్శ లేకుండా వుండే లేతరంగు మచ్చలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రి లేదా ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. డి. రామారావు ప్రజలను కోరారు.